నిష్పక్షపాత కర్తవ్య నిర్వహణం

22ND ANNIVERSARY
నవసంతాల ఆధ్వర్యం (2004-2026)

# నేటిధాత్రి®
తెలుగు వార్త పత్రిక

మీరు మన నేటిధాత్రిలో ఈ వార్తను వినడానికి, చదవడానికి క్యూఆర్‌ని స్కాన్ చేయ్యండి

TQRCG

ఆదివారం 19-07-2026 పేజీలు : 12 | CIRCULATED AT : TELANGANA and ANDHRAPRADESH STATES | సంపుటి : 22 సంచిక : 104 రూ॥ 6.00

# ఎదురులేని నాయకుడు
# తిరుగులేని పాలకుడు




**సమకాలీన రాజకీయాలలో సీఎం రేవంత్ రెడ్డి లాంటి నాయకుడు, పాలకుడు, మరొకరు లేరు. కాంగ్రెస్ పాలకులలో అభివృద్ధి, సంక్షేమం సమపాళ్లలో తెలంగాణా ప్రగతిని "సీఎం రేవంత్ రెడ్డి" పరుగులు పెట్టిస్తున్నారు అంటున్న కాంగ్రెస్ పార్టీ నాయకుడు, అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత "వి.నరేందర్ రెడ్డి", "నేటిధాత్రి" దిన పత్రిక ఎడిటర్ "కట్టా రాఘవేంద్ర" రావుతో పంచుకున్న విషయాలు.. ఆయన మాటల్లోనే...**



- సీఎం రేవంత్ సర్కార్ కు ముప్పై నెలలు.
- అటు పార్టీ, ఇటు పాలన రెండు కళ్ళు గా ముందుకు సాగుతున్నారు.
- ఎటు వంటి సమస్యనైనా అలవోకగా ఎదుర్కొనే దీరుడు.
- కాంగ్రెస్ ను ఒంటి చేత్తో అధికారం లోకి తెచ్చిన చాణక్యుడు.
- మొదటిసారి కాంగ్రెస్ లో నాయకులను ఏకతాటి పైకి తెచ్చి అధికారం తెచ్చాడు.
- ఎన్ని ఆటుపోట్లనైనా ఎదుర్కొని నిలబడ్డ వీరుడు.



హైదరాబాద్, నేటిధాత్రి:

**తెలంగాణ రాజకీయాల్లో ఎదరులేని,తిరుగులేని నాయకుడు ఎవరైనా వున్నారా! అంటే అది సీఎం. రేవంత్‌రెడ్డి ఒక్కరు మాత్రమే కనిపిస్తారు. సిఎం. రేవంత్ రెడ్డి స్దాయి నాయకులు అటు ప్రతిపక్షాలైన బిఆర్ఎస్, బిజేపి, ఏ ఇతర పార్టీలైన సరే ఆ స్ధాయి నాయకుడు లేరు. సీఎం. రేవంత్‌రెడ్డిని ఎదుర్కొనేంత శక్తి యుక్తులున్న నాయకులు ఒక్కరు కూడా లేదు. అంతే కాదు సీఎం. రేవంత్‌రెడ్డి వ్యూహాలను అందుకునే చాణక్యం కూడా ఎవరిలో లేదు. సిఎం. రేవం త్‌రెడ్డి ఎలాంటి అంశాలను ముందుకు తీసుకొస్తారో..ఎలాంటి నిర్ణయాలు అమలు చేస్తారో కూడా కనీసం అంచనా వేసే ఆలోచన కల్గిన నాయకుడు కూడా మరొక్కరు కనిపించరు. అని అంటున్న సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, ఆల్ఫోర్స్ విద్యాసంస్ధల అదినేత వి. నరేందర్‌రెడ్డి నేటిధాత్రి ఎడిటర్ కట్టారాఘవేంద్రరావుకు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలోని అంశాలు, ఆయన మాటల్లోనే పాఠకుల కోసం..**

అందుకే తెలంగాణ ప్రజలు సిఎం.రేవంత్‌రెడ్డిని బలంగా నమ్మారు. సి ఎం. రేవంత్ రెడ్డి మాత్ర వే తెలంగాణను సమస్యల నుంచి బైట పడేస్తారని బలంగా విశ్వసించారు. మెరుగైన పాలన అందిస్తారని నమ్మారు. అందుకే గత ఎన్నికల ముందు సిఎం. రేవంత్‌రెడ్డి అంటే ప్రజలు బ్రహ్మరధ ం పట్టారు. ఆ పాపులారిటీ కాంగ్రెస్ పార్టీ అదిష్టానం కూడా కళ్లతో చూసింది. సిఎం. రేవంత్‌రెడ్డి పిసిసి. అధ్యక్షుడుగా వున్న సమయంలో చేసిన ఉద్యమాలు, పోరాటలను కాంగ్రెస్ పార్టీ నిశితంగా గమనించింది. ఆయనను పూర్తి స్వేచ్ఛతో ప్రోత్సహించింది. రాష్ట్ర కాంగ్రెస్‌లో ఆనాడు ఎన్ని అడ్డంకులు ఎదురైనా సరే, ఆయన సిఎం. రేవంత్‌రెడ్డి ముందుకు వెళ్లడం అధిష్టానానికి బాగా నచ్చింది. అందుకే ఆయనకు పూర్తి బాద్యలు అప్పగించింది. ఎందులోనూ కాంగ్రెస్ అదిష్టానం కలుగజేసుకోలేదు. అందుకే కాంగ్రెస్‌పార్టీ అదిష్టానానికి ఆయన ఇచ్చిన మాట ప్రకారం పార్టీని అదికారంలోకి తెచ్చారు. ఉద్యమ పార్టీగా పేరున్న బిఆర్ఎస్‌ను ఓడించడం అంటే అంత సామాన్యమైన విషయం కాదు. పైగా కేసిఆర్ లాంటి నాయకుడిని ఓడించి, ఫామ్ హౌజ్‌కు పరిమితం చేయడం అంత ఆశామాషీ కాదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై, సిఎం. రేవంత్ సర్కారు కొలువు తీరి 30 నెలలు గడుస్తున్నా, బిఆర్ఎస్ అదినేత కేసిఆర్ బైటకు వచ్చి ఒక్క మాట కూడా మాట్లాడలేని పరిస్ధితిని సృష్టించడం అంటే రాజకీయాల్లో అందరికీ సాద్యమయ్యే పని కాదు. గతంలో కాంగ్రెస్ పార్టీ గెలిపిస్తే నాయకులైన వాళ్లు సిఎం. అయ్యారు. కాని కాంగ్రెస్ చరిత్రలోనే కాంగ్రెస్‌ను గెలిపించిన నాయకుడిగా సిఎం. రేవం త్‌రెడ్డి చరిత్ర సృష్టించారు. ఆయన సృష్టించిన సునామీ అంత సులువైంది కాదు. అందులో ఆయన కష్టం ఎంతో దాగి వుంది. ఆయన పడిన వేదన ఎంతో వుంది. ఆయన ఎదుర్కొన్న సవాళ్లు అనేకం వున్నాయి. అడుగడుగునా అవాతంరాలు ఎదురయ్యాయి. ఇంటి నుంచి కాలు బైట పెట్టకుండా అప్పటి బిఆర్ఎస్ ప్రభుత్వం అనేక ఆంక్షలు పెట్టేది. పదే పదే అరెస్టులు చేసేది. అనేక కేసులు నమోదు చేసింది. అనేక సార్లు జైలు పాలు చేసింది. మానసికంగా సిఎం.రేవంత్‌ను కుంగదీయాలని అనేక కుట్రులు పన్నారు. అయినా అవేమీ రేవంత్ ఆత్మస్ధైర్యాన్ని దెబ్బదీయలేకపోయాయి. ఆయన గుండె నిబ్బరాన్ని చెక్కు చెదరనీయలేకపోయాయి. మానసికంగా కూడాసిఎం. రేవంత్‌ను దెబ్బతీయాని బిఆర్ఎస్ ప్రభుత్వం చేయని చర్యలు లేవు. అయినా వాటిని ఎదుర్కొని నిలబడిన ఏకైక నాయకుడు సిఎం. రేవంత్‌రెడ్డి. ఆయన స్ధానంలో మరే నాయకుడు వున్నా తట్టుకునేవారు కాదు. గత ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించేవారు కాదు. అయినా తన ఒక్కడి బలమే పార్టీ విజయమని ఏనాడు సిఎం. రేవంత్‌రెడ్డి ఇప్పటికీ చెప్పుకోలేదు. సమిష్టి కృషిగానే చెప్పుకుంటారు. పార్టీకి జవసత్వాలు తెచ్చిపెడుతున్నారు. గత ఎన్నికలకు ముందు వున్న కాంగ్రెస్ బలాన్ని ఇప్పుడు వెయ్యేనుగుల బలంగా మార్చారు. కాంగ్రెస్‌పార్టీని గ్రామ గ్రామాన మరింత పటిష్టపర్చేలా చూసుకున్నారు. అందుకే గత పంచాయితీ ఎన్నికల్లో కాంగ్రెస్ సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు 85 సీట్లు దక్కించుకోవడం వెనుక వున్న ధైర్యం సిఎం. రేవం త్‌రెడ్డి. సిఎం.రేవంత్‌రెడ్డి పాలన చూసే ప్రజలు కూడా పల్లెల్లో కాంగ్రెస్‌ను ఆదరించారు. అసలు పంచాయితీ ఎన్నికల ముందు ప్రతిపక్షాలు చేసిన అసత్య ప్రచారం అంతా ఇంతా కాదు. పల్లెల్లో కాంగ్రెస్‌కు తీవ్రమైన వ్యతిరేకత వుందని ప్రచారం చేశారు. కాని ఆ ప్రచారం అంతా ప్రాపగండ మాత్రమే అని, బిఆర్ఎస్ ప్రచారం డొల్ల అని నిరూపించిన నాయకుడు సిఎం.రేవంత్‌రెడ్డి. పంచాయితీ ఎన్నికల్లో అలాంటి తీర్పు వస్తుందని కాంగ్రెస్‌పార్టీలో చాలా మంది నాయకులు నమ్మలేదు. కాని సిఎం.రేవంత్‌రెడ్డికి తన పాలన మీద వున్న చెక్కు చెదరని ఆత్మవిశ్వాసమే కాంగ్రెస్ పంచాయితీ ఎన్నికల్లో స్వీప్‌చేసేందుకు దోహదపడింది. ఒక రకంగా చెప్పాలంటే ప్రజలే కాదు, ప్రకృతి, కాలం కూడా ఒక మంచి నాయకుడికి తోడుగా నిలవాలని అనుకుంటున్నట్లుంది. అందుకే ప్రతిసారి రేవంత్‌కు విజయాలను కాలమే అందిస్తోంది. ఎందుకంటే పంచాయితీ ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారు? అని కాంగ్రెస్‌పార్టీ నాయకులు కూడాఎదురు చూశారు. కాని సరైన సమయం చూసి దెబ్బకొట్టాలన్న రాజకీయం తెలిసిన సిఎం. రేవంత్ రెడ్డి సరైన సమయం చూసి గురి కొట్టారు. బిఆర్ఎస్,బిజేపిలను బోల్తా కొట్టించారు. అంతకు ముందు ఆరు నెలల నుంచి సిఎం. రేవంత్‌రెడ్డి చేసిన కసరత్తు అంతా ఇంతా కాదు. జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటిగోపీనాథ్ చనిపోయిన తర్వాత ఆ ఎన్నిక గెల్చి, ప్రజల్లో కాంగ్రెస్ లేదని నిరూపించాలని బిఆర్ఎస్ సెచ్ వేసుకొని కూర్చున్నది. మాగంటి గోపీనాద్ మరించిన పదో రోజు నుంచే బిఆర్ఎస్ ప్రచారం మొదలు పెట్టింది. దృష్టి అంతా అక్కడే కేంద్రీకరించింది. అదే సమయంలో సిఎం. రేవంత్ పూర్తి స్ధాయిలో పంచాయితీ ఎన్నికల నిర్వహణ మీద దృష్టి పెట్టారు. జూబ్లీ హిల్స్ ఎన్నికలకు సరిగ్గా వారం రోజుల ముందు రంగంలోకి దిగారు. జూబ్లీహిల్స్ అభ్యర్ధిని ప్రకటించారు. అక్కడే బిఆర్ఎస్ కళ్లు బైర్లు కమ్మే దెబ్బ వేశారు.

- నాయకులను సమన్వయం చేసి పాలిస్తున్న రేవంతుడు.
- గతంలో ఎవరికీ సాధ్యం కానీ విజయాలను పార్టీకి అందిస్తున్నాడు.
- ఎన్నికలు ఏవైనా సరే కాంగ్రెస్ జెండా ఎగురవేస్తున్నాడు.
- సంక్షేమం లో కాంగ్రెస్ కు కొత్త దారి చూపిస్తున్నాడు.
- అన్ని వర్గాల ప్రజల ఆశీస్సులు కాంగ్రెస్ కు దక్కేలా రాజకీయం చేస్తున్నాడు.
- ప్రతిపక్షాలను దీటుగా ఎదురుకొంటూ ఒకే ఒక్కడుగా నిలబడుతున్నాడు.
- ప్రతి సమస్యను ఎంతో ఓపికగా ఎదుర్కొంటున్నాడు.
- అధిష్ఠానం నుంచి పూర్తి స్వేచ్ఛ ను అందుకున్న ఏకైక నాయకుడు.
- అద్భుతమైన పాలనతో తెలంగాణ ను నెంబర్ వన్ చేస్తున్నాడు.
- వచ్చే ఎన్నికల వ్యూహాలతో ముందుకు సాగుతున్నాడు.

ఎవరూ ఊహించని అభ్యర్ధిని రంగంలోకి దింపారు. సరిగ్గా వారం రోజులు కాన్‌సంట్రేషన్ చేసి, ఆ ఎన్నిక కాంగ్రెస్‌వశం చేశారు. దాంతో ఒక్కసారిగా పల్లెల్లో కాంగ్రెస్ క్యాడర్‌లో ఆత్మవిశ్వాసం పెరిగింది. పంచాయితీ ఎన్నికల్లో తాము గెలుస్తామనే ధైర్యం వచ్చింది. అప్పటి వరకు పంచాయితీ ఎన్నికల్లో పరిస్ధితి ఎలా వుంటుందో అని ఆలోచించిన కాంగ్రెస్ నాయకులు కూడా తర్వాత పంచాయితీ ఎన్నికల్లో టిక్కెట్ల కోసం పోటీ పడ్డారు. అలా రాజకీయాన్ని కాంగ్రెస్ వైపు తిప్పడం వంటి రాజకీయ వ్యూహాలను అనేక సార్లు అమలు చేస్తూ పార్టీకి విజయాలు అందిస్తున్నారు. పార్టీ అధిష్టానం కూడా అబ్బురపడేలా గెలుపులు కాంగ్రెస్ సొంతం చేస్తున్నారు. అలా తన రాజకీయాన్ని తనదైన శైలిలో నడిపిస్తున్నారు. రెండున్నరేళ్లుగా విశిష్టమైన పాలకుడిగా కీర్తి పొందుతున్నారు. పైగా పార్టీలో ఎలాంటి అసంతృప్తి కనిపించకుండా చూసుకోవడం అంత సామాన్యమైన విషయం కాదు. నిత్యం పాలనా పరంగా ఎన్ని తలనొప్పులున్నా, పార్టీలో కూడా సమస్యలు తలెత్తకుండా చూసుకుంటున్నారు. పాలన సవ్వంగా సాగేలా మార్గం వేసుకున్నారు. రేవంత్‌రెడ్డి సిఎం. అయిన తర్వాత కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని నిర్వహించడం అంటే అంత సామాన్యమైన విషయం కాదని అందరూ అనుకున్నారు. గతంలో వైఎస్ లాంటి వారికి కూడా ఇబ్బందులు తప్పలేదు. కాంగ్రెస్ చరిత్రలోనే మొదటిసారి సిఎం.రేవంత్‌రెడ్డికి వున్న ప్రాధాన్యత మరే నాయకుడికి లేదని చెప్పాలి. అలాగే పిపిసి. అద్యక్షుడుగా అనేక అవరోదాలను కూడా తనకు అనుకూలంగా మల్చుకొని పార్టీని విజయతీరాలకు చేర్చారు. కాంగ్రెస్‌ను గెలిపించి, సిఎం అయ్యారు. అం తే కాదు గతంలో ఏ కాంగ్రెస్ నాయకుడు కూడా మళ్లీ కాంగ్రెస్ పార్టీయే గెలుస్తుంది. మళ్లీ నేనే సిఎం. అని చెప్పగలిగిన నాయకుడు ఒక్కరు కూడా కనిపించరు. వచ్చే ఎన్నికల్లో పార్టీని గెలిపించి, 2034 వరకు సిఎం.గా నేనే వుంటానని చెప్పడంతోనే కాంగ్రెస్ పార్టీలో ఆయన స్ధానం ఎంత బలంగా వుందో, పదిలంగా కనిపిస్తోందో అర్ధం చేసుకోవచ్చు. ఇప్పటికి సిఎం. రేవంత్ రెడ్డి కొన్ని పదులు సార్లు ఈ మాట చెప్పారు. కాని అదిష్టానం ఏ ఒక్కనాడు జోక్యం చేసుకోలేదు. వచ్చే ఎన్నికల్లోనూ కాంగ్రెస్ పార్టీ విజయం కోసం నాలాంటి వాళ్లం అంతా రేవంత్‌రెడ్డి స్ఫూర్తితో పనిచేస్తాం. పార్టీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తాం. రేవంత్‌రెడ్డి అడుగులో అడుగులు వేసుకుంటూ ముందుకు సాగుతాం.



# నేటిధాత్రి®

తెలుగు వార్త పత్రిక

మీరు మన నేటిధాత్రిలో ఈ వార్తను వినడానికి, చదవడానికి క్యూఆర్‌ని స్కాన్ చేయ్యండి

ఆదివారం 19-07-2026 పేజీలు : 12 | CIRCULATED AT : TELANGANA and ANDHRAPRADESH STATES | సంపుటి : 22 సంచిక : 104 రూ॥ 6.00



# కరుణించని వరుణుడు.. కష్టాల్లో రైతులు




చీఫ్ ఎడిటర్
కట్టా రాఘవేందర్ రావ్
9063524136, 9908658888

## రాష్ట్రవ్యాప్తంగా 35 శాతం వర్షపాత లోటు









- 45.49 శాతం విస్తీర్ణంలో మాత్రమే విత్తనాలు
- మునుపెన్నడూ లేని రీతిలో తగ్గిన వరిసాగు
- పత్తి విస్తీర్ణంలో కూడా గణనీయంగా తగ్గుదల
- జూలై మూడో వారానికి కేవలం కేవలం 6.38 లక్షల ఎకరాల్లో వరినాట్లు
- ఎల్‌నినో నేపథ్యంలో కంటింజెన్సీ ప్రణాళిక
- కరువుపై బ్రహ్మాస్త్రం 'ప్రాజెక్ట్ కె-100' !

హైదరాబాద్, నేటిధాత్రి:

రాష్ట్రంలో వానాకాలం (వానకాలం-2026) సీజన్ ప్రారంభమై సగం రోజులు గడిచినా వరు ణుడి కరుణ లభించకపోవడంతో తెలంగాణ రైతాంగం తీవ్ర ఆందోళనలో మునిగిపోయింది. ఆకాశంలో దట్టమైన మేఘాలు కమ్ముకోవడం, ఉక్కపోత పెరగడం తప్ప ఆశించిన స్థాయిలో చుక్కవర్షం కురవకపోవడంతో పొలాలు బీడువారాయి. ఇప్పటికే తొలకరి జల్లుల నమ్మకంతో వందలకోట్లు ఖర్చు చేసి విత్తనాలు వేసిన రైతులు, ఇప్పుడు అవి మొలకెత్తక.. మొలకెత్తిన కాస్త నారు కూడా ఎండ తీవ్రతకు వాడిపోతుండటంతో కన్నీరుమున్నీరవుతున్నారు. తెలంగాణ ప్రభుత్వ అధికారిక 'కంటింజెన్సీ ప్లాన్-2026' నివేదిక ప్రకారం.. రాష్ట్రంలో సాగు విస్తీర్ణం మునుపెన్నడూలేనంతగా తగ్గిపోయింది. తెలంగాణలో వానాకాలం సాధారణ సాగు విస్తీర్ణం 1.32 కోట్ల ఎకరాలు కాగా, జులై మధ్య నాటికి కేవలం 60.22 లక్షల ఎకరాల్లో (అంటే కేవలం 45.49 శాతం) మాత్రమే విత్తనాలు పడ్డాయి. గతేడాదితో పోలిస్తే దాదాపు 10 లక్షల ఎకరాలకు పైగా సాగు వెనకబడింది. రాష్ట్రంలో ప్రధాన పంట అయిన వరి సాధారణ సాగు విస్తీర్ణం 65.95 లక్షల ఎక రాలు. అయితే, జులై మూడో వారం ప్రారంభమైనా కేవలం 6.38 లక్షల ఎకరాల్లో (కేవలం 9.67 శాతం) మాత్రమే వరి నాట్లు లేదా నారుమళ్లు పడ్డాయి. తెలంగాణ అభివఅద్ధి ప్రణాళికల సంస్థ (టీజీడీపీఎస్) లెక్కల ప్రకారం, జులై 16 నాటికి రాష్ట్రంలో కురవాల్సిన సాధారణ వర్షపా తం 243.4 మి.మీ కాగా, నమోదైంది కేవలం 159.1 మి.మీ మాత్రమే. అంటే రాష్ట్రవ్యాప్తంగా35 శాతం వర్షపాత లోటు ఉంది. జులై నెలలో మాత్రమే చూస్తే ఏకంగా 61 శాతం లోటు న మోదైంది. రాష్ట్రంలోని మొత్తం 33 జిల్లాలకు గాను 27 జిల్లాలు అధికారికంగా 'వర్షాభావ' జాబితాలో ఉన్నాయి. హన్మకొండ (67%), మేడ్చల్-మల్కాజ్‌గిరి (60%) జిల్లాలు తీవ్ర కరువు పరిస్థితులను ఎదుర్కొంటున్నాయి. జూన్ ఆరంభంలో పడిన ఒకట్రెండు తేలికపాటి వర్షాలకు నల్గండ, నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్ పరిసర ప్రాంతాల్లో రైతులు పత్తి, మక్కజన్న విత్తనాలు వేశారు. కానీ ఆ తర్వాత దాదాపు 25 రోజులుగా పచ్చి చుక్క లేకపోవడంతో భూమిలోనే విత్తనాలు కుళ్ళిపోతున్నాయి లేదా పురుగుల పాలవుతున్నాయి.

### పడిపోయిన సాగు విస్తీర్ణం

ఎల్‌నినో మరియు వర్షాభావం కారణంగా తెలంగాణలో సాగు విస్తీర్ణం మరియు దిగుబడి గణనీయంగా పడిపోయే అవకాశం ఉంది. ప్రభుత్వం విడుదల చేసిన ఖరీఫ్ అత్యవసర ప్రణాళిక ప్రకారం, రాష్ట్రంలోని 92.08 శాతం (11,479) గ్రామాలు ఎల్‌నినో ముప్పును ఎదుర్కొంటున్నాయి. ప్రాజెక్టులకు ఎగువ రాష్ట్రాల (మహారాష్ట్ర, కర్ణాటక) నుండి నీరు రాకపోవడం వల్ల మరి యు 33% నుండి 40% వరకు వర్షపాతం లోటు ఉండడం వల్ల ఈ ఏడాది రాష్ట్ర వ్యవసాయ ఉత్పత్తిలో స్పష్టమైన క్షీణత ఉంటుందని అధికారులు హెచ్చరిస్తున్నారు. రాష్ట్రంలో సాధారణంగా వానాకాలంలో సుమారు 65 లక్షల ఎకరాల్లో వరి సాగు జరుగుతుంది. నీటి కొరత మరియురిజర్వాయర్లలో నీరు లేకపోవడం వల్ల ఈ ఏడాది వరి సాగును 35 లక్షల ఎకరాలకు పరిమితంచేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అంటే వరి సాగు విస్తీర్ణం దాదాపు 45% నుండి 50% వరకు పడిపోయే అవకాశం ఉంది. జూలై మధ్య నాటికి రాష్ట్రంలో వరి నాట్లు కేవలం 9.67 శాతం విస్తీర్ణంలోనే పూర్తయ్యాయి. బోర్ల కింద నీటి వసతి ఉన్న రైతులు మాత్రమే ప్రస్తు తం వరి వైపు వెళుతున్నారు.తెలంగాణలో సాధారణంగా పత్తి సాగు సగటున 45 నుండి 50 లక్షలఎకరాల వరకు ఉంటుంది. జూలై మూడో వారం నాటికి అందిన నివేదికల ప్రకారం, సకాలంలో వర్షాలు పడకపోవడంతో పత్తి సాగు తీవ్రంగా దెబ్బతింది. వానలు లేక దాదాపు 18 లక్షల ఎకరాలకే పత్తి సాగు పరిమితమై ఉండవచ్చని తాజా అంచనాలు చెప్తున్నాయి. జూలై 14 నాటికి పత్తి విత్తనాలు కేవలం 87.57 శాతం మేరకే పడ్డాయి. అడపా దడపా పడిన వర్షాలకు వేసినపత్తి మొలకలు కూడా రాబోయే రోజుల్లో సరైన వర్షాలు లేకుంటే ఎండిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. వ్యవసాయ శాఖ మరియు ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు ఇచ్చిన ఖరీఫ్ అత్యవసర ప్రణాళిక పై రైతుల స్పందన మిశ్రమం గా ఉంది. నాగార్జునసాగర్, మూసి, దిండి వంటి ప్రధాన ప్రాజెక్టుల్లో నీరు లేకపోవడం, భూగర్భ జలాలు పడిపోవడంతో నల్గండ, సూర్యాపేట వంటి జిల్లాల్లోని రైతు లు శాస్త్రవేత్తల మాట విని వరి సాగును 25 శాతానికి పరిమితం చేస్తున్నారు. మిగిలిన 75% భూమిలో ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లుతున్నారు. జూలై 20 దాటిన తర్వాత పత్తి విత్తనా లు వేయవద్దని, అలా వేస్తే దిగుబడి తగ్గుతుందని శాస్త్రవేత్తలు హెచ్చరించారు. ఈ సూచనను పరిగణనలోకి తీసుకుని రైతులు పత్తికి బదులుగా కంది, జన్న, సజ్జ, సోయాబీన్ పంటలు వేసేందుకు సిద్ధమవుతున్నారు. శాస్త్రవేత్తల సూచనలు పాటించడానికి రైతులు సిద్ధంగా ఉన్నప్పటికీ, కొన్ని ప్రాంతాల్లో వారు సంకోచిస్తున్నారు. చిరుధాన్యాలు మరియు ఆరుతడి పంటలకు మార్కెట్లో కచ్చితమైన మద్దతు ధర లభిస్తుందా లేదా అనే భయమే ఇందుకు కారణం. వరి, పత్తి మాదిరిగా చిరుధాన్యాలను కొనుగోలు చేయడానికి గ్రామాల్లో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు మరియు ప్రా సెసింగ్ యంత్రాలు అందుబాటులో లేకపోవడం. ప్రస్తుత కరవు ముప్పు నేపథ్యంలో రైతులు తప్పనిసరి పరిస్థితుల్లో సంప్రదాయ వరి, పత్తి పంటలను తగ్గించి చిరుధాన్యాల వైపు అడుగులు వేస్తున్నారు. ప్రభుత్వం రాయితీపై ప్రత్యామ్నాయ విత్తనాలు సరఫరా చేయడం మరియు కొనుగోలు గ్యారెంటీ ఇవ్వడం ద్వారా రైతులు ఈ శాస్త్రవేత్తల సూచనలను వంద శాతం పాటించే అవకాశం ఉంది.

### విత్తనాలను కాపాడటానికి బిందు సేద్యం!

గద్వాల, నడిగడ్డ లాంటి ప్రాంతాలలో సాధారణంగా ఎక్కువ దిగుబడి కోసం వాడే బిందు సే ద్యాన్ని, చరిత్రలో మొదటిసారిగా కేవలం వేసిన విత్తనాలు మొలకెత్తడానికి, ప్రాణం నిలుపుకోవ డానికి వాడాల్సిన దయనీయ స్థితి ఏర్పడింది. దీనివల్ల ఎకరాకు రూ. 50,000 వరకు అదనపు భారం పడుతోందని రైతులు వాపోతున్నారు. గత ఏడాదితో పోలిస్తే రాష్ట్రంలోని 18 జిల్లాల్లో భూగర్భ జలమట్టాలు పడిపోయాయి. జలాశయాలు కూడా వాటి కనీస మట్టానికి చేరుకోవడంతో బోర్లపై ఆధారపడటం కూడా కష్టంగా మారింది.


### ఎల్‌నినో కంటింజెన్సీ ప్లాన్

పరిస్థితి తీవ్రతను గమనించిన వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రొఫెసర్ జ యశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం (పీజేటీఏయూ) శాస్త్రవేత్తలతో కలిసి "ఎల్‌నినో కంటింజెన్సీ ప్లాన్ వానాకాలం-2026" ని విడుదల చేశారు. దీని ప్రకారం ఎక్కువ నీరు అవసరమయ్యే వరి పంటకు బదులుగా తక్కువ కాల పరిమితి కలిగి, తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకోవాలని సూచించారు. ఉత్తర తెలంగాణ జిల్లాల్లో కందులు, పెసర్లు, మినుములు,దక్షిణ తెలంగాణ (మహబూబ్నగర్, నల్గండ) ప్రాంతాల్లో ఆముదాలు, సజ్జలు, రాగులు, జన్నలువేసుకోవాలని శాస్త్రవేత్తలు సలహా ఇస్తున్నారు. అలాగే పత్తి పంటలో అంతర పంటలుగా పప్పుధాన్యాలను ప్రోత్సహిస్తున్నారు. వాతావరణ శాఖ జులై చివరి వారంలో అల్పపీడన వర్షాలు పడతాయని అంచనా వేస్తున్నప్పటికీ, అప్పటికే పత్తి సాగు సమయం దాటిపోతుంది. ఒకవేళ వర్షా లు పడినా, రైతులు మళ్లీ దుక్కులు దున్ని, రెండోసారి విత్తనాలు కొనాల్సి వస్తుంది. ఇది ఎకరా కు పెట్టుబడి వ్యయాన్ని రెట్టింపు చేస్తుంది. ప్రభుత్వం కేవలం సలహాలకే పరిమితం కాకుండా, రెండోసారి విత్తనాలు వేసే రైతులకు రాయితీపై విత్తనాలు అందించి, ఉచిత విద్యుత్ సరఫరాను క్రమబద్ధీకరించడం ద్వారానే ఈ సాగు సంక్షోభం నుండి అన్నదాతను గట్టెక్కించగలదు. రాష్ట్రంలో నెలకొన్న తీవ్ర వర్షాభావ పరిస్థితులు, లోటు వర్షపాతం వల్ల ఎదురవుతున్న సాగు సంక్షోభాన్ని అధిగమించడానికి తెలంగాణ ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన వ్యూహ ప్రతివ్యూహాలను సిద్ధం చేస్తోంది. సంప్రదాయ పద్ధతులకు భిన్నంగా, ఒకవైపు విద్యుత్, నీటి పారుదల శాఖలను ఒకేతాటిపైకి తెస్తూ.. మరోవైపు రైతులను తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లించేందుకు వినూత్న విధానాలకు శ్రీకారం చుట్టింది. కరువును జయించడానికి స్థానిక వనరులను ఎలా వాడుకోవచ్చో నారాయణపేట జిల్లాలో విజయవంతమైన 'ప్రాజెక్ట్ కె-100' ఇప్పుడు రాష్ట్రవ్యాప్త మోడల్‌గా నిలుస్తోంది.


### శాఖల మధ్య సమన్వయం కోసం ప్రత్యేక యంత్రాంగం

గతంలో కరువు కాలంలో విద్యుత్ కొరత లేదా సాగునీటి విడుదలపై ఒక శాఖకు, మరో శాఖకు మధ్య సమన్వయ లోపం స్పష్టంగా కనిపించేది. ఈసారి ప్రభుత్వం ఆ తప్పు జరగకుండా ప్రత్యేక యంత్రాంగాన్ని ఏర్పాటు చేసింది. విద్యుత్ మరియు సాగునీటి శాఖల ఉన్నతాధికారులతో జాయింట్ యాక్షన్ కమిటీలను ఏర్పాటు చేశారు. భూగర్భ జలాలు పడిపోవడంతో బోర్ల కింద పంటలు ఎండిపోకుండా ఉండేందుకు, ఏ ఏ ప్రాంతాల్లో బోర్లపై ఆధారపడే రైతులు ఎక్కువగా ఉన్నారో గుర్తించి, అక్కడ నాణ్యమైన తొమ్మిది గంటల పగటిపూట ఉచిత విద్యుత్ నిరంతరాయంగా అందేలా గ్రిడ్లను మేనేజ్ చేస్తున్నారు. ప్రాజెక్టులలో నీటి లభ్యత తక్కువగా ఉన్నందున, కెనాల్స్ ద్వారా విడుదల చేసే ప్రతి చుక్క నీరు వఅధా కాకుండా చిట్టచివరి ఆయకట్టు భూములకు సైతం చేరేలా ఇరిగేషన్ లస్కర్లు, లైన్మెన్లు క్షేత్రస్థాయిలో ఉమ్మడిగా పర్యవేక్షిస్తున్నారు. ఎక్కువ నీ రు అవసరమయ్యే వరి పంటకు బదులుగా.. ఆముదాలు, కందులు, వేరుశనగ, చిరుధాన్యాలు వంటి తక్కువ నీటితో, తక్కువ కాలంలో చేతికొచ్చే ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులను మళ్లించడంపై వ్యవసాయ శాఖ ప్రత్యేక శ్రద్ధ పెట్టింది. దీనికోసం రాయితీలపై విత్తనాలు, అవగాహన సదస్సులు నిర్వహిస్తోంది.

### నారాయణపేట 'ప్రాజెక్ట్ కె-100' కరువుపై బ్రహ్మాస్త్రం!



రాష్ట్రంలోనే అత్యంత వెనుకబడిన, కరువు పీడిత ప్రాంతంగా ముద్రపడిన నారాయణపేట జి ల్లాలో నీటి సంరక్షణ కోసం చేపట్టిన 'ప్రాజెక్ట్ కె-100' ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. నారాయణపేట పరిసర ప్రాంతాలలో ఉన్న 100కు పైగా గొలుసుకట్టు చెరువులు, కుంటలు, చిన్న వాగులను పునరుద్ధరించి, ఒకదానికొకటి అనుసంధానించడమే ఈ ప్రాజెక్ట్ ముఖ్య ఉద్దేశం. వర్షాలు తక్కువగా పడినా, కురిసిన కొద్దిపాటి జలాలనైనా వఅధాగా పోనివ్వకుండా ఈ వంద చెరువులను అనుసంధానించారు. ఈ చెరువులు నెట్‌వర్క్‌లో నీటిని నిల్వ చేశారు. దీనివల్ల చుట్టుపక్కల గ్రామాలలో భూగర్భ జలమట్టాలు ఊహించని విధంగా పెరిగాయి. నారాయణపేట నారాయణరెడ్డిపేట, సింగారం తరహా గ్రామాల్లో బోరుబావుల్లో నీరు ఉబికిరావడంతో రైతులు సంప్రదాయ పంటల శ్రమను తగ్గించుకుని, ఉద్యానవన పంటలు మరియు పప్పుధాన్యాల వైపువిజయవంతంగా మొగ్గుచూపారు. ఈ 'కె-100' స్ఫూర్తితోనే ఇప్పుడు మహబూబ్‌నగర్, నల్గండ, మెదక్ జిల్లాల్లోని ఎండిపోయిన వాగులపై చెక్‌డ్యామ్‌లను అనుసంధానించే పనులను ప్రభుత్వం వేగవంతం చేసింది. నారాయణపేట 'ప్రాజెక్ట్ కె-100' విజయం మనకు ఒక విషయాన్ని స్పష్టం చేస్తోంది. కరువు అనేది కేవలం ప్రకఅతి వైపరీత్యం మాత్రమే కాదు, జల నిర్వహణ లో పం కూడా. ప్రభుత్వం ఇరిగేషన్, పవర్ శాఖలను సమన్వయం చేయడం అభినందనీయం. అ యితే, వరి వేయవద్దని రైతులకు చెప్పేటప్పుడు.. వారు పండించే ప్రత్యామ్నాయ పంటలకు కనీస మద్దతు ధర కల్పించి, మార్కెటింగ్ సదుపాయాలు కల్పించే బాధ్యతను కూడా ప్రభుత్వం ముందే తీసుకుంటేనే 'పంటమార్పిడి' పూర్తిస్థాయిలో విజయవంతమవుతుంది.










# నేటిధాత్రి®

22ND ANNIVERSARY

తెలుగు వార్త పత్రిక



ఆదివారం 19-07-2026 పేజీలు : 12 CIRCULATED AT : TELANGANA and ANDHRAPRADESH STATES సంపుటి : 22 సంచిక : 104 రూ॥ 6.00




# రేవంత్ బ్రదర్స్ విలాసం... యువతకి విలాపం

## ఇప్పటిదాకా ఒక లెక్క ఇకనుంచి మరో లెక్క





- లక్షల ఉద్యోగాల హామీ ఏమైంది?
- జాబ్ క్యాలెండర్.. రెండు లక్షల ఉద్యోగాలు ఏవి?
- కొలువుల కుంభమేళా కాదు.. కుంభకోణాల కుంభమేళా
- ఢిల్లీలో రాహుల్ గాంధీ జేబులు నిండుతున్నాయి.. తెలంగాణలో లూటీ జరుగుతోంది
- మొహబ్బత్ కీ దుకాణ్ కాదు.. ధోఖే కా మకాన్ నడుస్తోంది
- బీఆర్ఎస్ యువ సంగ్రామ సదస్సులో కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ తీవ్ర విమర్శలు

●జాబ్ క్యాలెండర్ నై నై స్కామ్స్ క్యాలెండర్ సై సై కేటీఆర్ ●కాంగ్రెస్ అధికార పీఠం నిరుద్యోగులకు బలి పీఠం

హైదరాబాద్, నేటిధాత్రి:

ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ తెలంగాణ యువతకు ఇచ్చిన హామీలన్నీ అమలు కాకుండానే మిగిలిపోయాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని, జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని, నిరుద్యోగులకు అండగా నిలుస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క హామీని కూడా పూర్తిగా అమలు చేయలేదని విమర్శించారు. హైదరాబాద్‌లోని సరూర్‌నగర్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ యువ సంగ్రామ సదస్సులో ఆయన మాట్లాడుతూ, నిరుద్యోగ యువతను కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్రంగా మోసం చేసిందని ఆరోపించారు.

### రాహుల్ గాంధీ ఇచ్చిన హామీలన్నీ ఏమయ్యాయి?

తెలంగాణ యువత తలరాత మారుస్తామని రాహుల్ గాంధీ అశోక్‌నగర్‌లో నిర్వహించిన "చాయ్ పే చర్చా" కార్యక్రమంలో ఇచ్చిన హామీలు ఇప్పుడు ఏమయ్యాయని కేటీఆర్ ప్రశ్నించారు. రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు, జాబ్ క్యాలెండర్, డిగ్రీ విద్యార్థినులకు స్కూటీలు, విద్యా భరోసా, నిరుద్యోగులకు భృతి, యువతకు ఉపాధి అవకాశాలు అన్నీ ఎన్నికల హామీలుగానే మిగిలిపోయాయని విమర్శించారు. రాహుల్ గాంధీకి తెలంగాణ యువత బాధ తెలియదని, ఎన్నికల సమయంలో చెప్పిన మాటలను కూడా గుర్తు పెట్టుకోలేని పరిస్థితి ఏర్పడిందని అన్నారు.

### కొలువుల కుంభమేళా కాదు.. కుంభకోణాల కుంభమేళా

కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుల కుంభమేళా నిర్వహిస్తామని ప్రకటించి, ఇప్పుడు కుంభకోణాల కుంభమేళా నిర్వహిస్తోందని కేటీఆర్ మండిపడ్డారు. డిసెంబర్ 9 నుంచి ఉద్యోగ పర్వం ప్రారంభమవుతుందని చెప్పిన ప్రభుత్వం, ఇప్పుడు నిరుద్యోగులకు ఉన్మాద పర్వాన్ని చూపిస్తోందని విమర్శించారు. ఉద్యోగాలు అడిగిన యువతపై కేసులు పెట్టడం, నిరసనలు అణచివేయడం, లైబ్రరీలు, విద్యాసంస్థల్లో పోలీసు చర్యలకు పాల్పడటం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ఆరోపించారు.

### ఢిల్లీలో జేబులు నిండుతున్నాయి.. తెలంగాణలో లూటీ

ఢిల్లీలో రాహుల్ గాంధీ జేబులు నిండుతున్నాయని, తెలంగాణలో మాత్రం ప్రజలపై ఆర్థిక భారం పెరుగుతోందని కేటీఆర్ ఆరోపించారు. కాంగ్రెస్ చెప్పే "మొహబ్బత్ కీ దుకాణ్" నినాదం తెలంగాణలో "ధోఖే కా మకాన్"గా మారిందని ఎద్దేవా చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను విస్మరించి, ప్రజలను మోసం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ విధానంగా మారిందన్నారు.

### ప్రజాస్వామ్యం ఖూనీ అవుతోంది

నిరుద్యోగుల ఆవేదన రాహుల్ గాంధీకి కనిపించడం లేదా అని ప్రశ్నించిన కేటీఆర్,



సిటీ సెంట్రల్ లైబ్రరీ ఘటనలు, ఉస్మానియా విశ్వవిద్యాలయంలో జరిగిన నిర్బంధాలు ప్రజాస్వామ్యాన్ని అవమానించే చర్యలని విమర్శించారు. ఢిల్లీలో రాజ్యాంగం చేత పట్టుకుని మాట్లాడే కాంగ్రెస్ నాయకులు, హైదరాబాద్‌లో ప్రజాస్వామ్య హక్కులు కాలరాస్తున్న విషయాన్ని ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు.

### జాబులు లేవు.. జవాబులు లేవు

నవంబర్ 22న జాబ్ క్యాలెండర్ పేరుతో భారీ ప్రకటనలు ఇచ్చిన ప్రభుత్వం, నేడు ఉద్యోగాల విషయంలో ఎలాంటి పురోగతి చూపలేదని కేటీఆర్ అన్నారు. క్యాలెండర్ మారినా జాబ్ క్యాలెండర్ మాత్రం కనిపించడం లేదని, అసెంబ్లీలో ప్రకటించిన ఉద్యోగాల క్యాలెండర్ చిత్తుకాగితంగా మారిపోయిందని విమర్శించారు. యువత ఆశలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు.

### యూత్ డిక్లరేషన్‌లో ఒక్క హామీ నెరవేరలేదు

యూత్ డిక్లరేషన్ పేరుతో కాంగ్రెస్ అనేక హామీలు ఇచ్చిందని గుర్తు చేసిన కేటీఆర్, ప్రైవేట్ కంపెనీల్లో 75 శాతం రిజర్వేషన్లు, డిగ్రీ విద్యార్థినులకు స్కూటీలు, యువతకు రూ.10 లక్షల రుణాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్, నాలుగు ట్రిపుల్ ఐటీలు, మూడు విశ్వవిద్యాలయాలు, నెలకు రూ.4 వేల నిరుద్యోగ భృతి, పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణులకు ప్రకటించిన ఆర్థిక ప్రోత్సాహకాల్లో ఒక్క హామీ కూడా అమలు కాలేదని ఆరోపించారు.



### యువతను మోసం చేసిన కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి

రేపటి తెలంగాణ నిర్మాతలు యువతేనని, అలాంటి యువతను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని కేటీఆర్ అన్నారు. సరూర్‌నగర్ వేదికగానే కాంగ్రెస్ నాయకులు హామీల వర్షం కురిపించి అధికారంలోకి వచ్చారని, ఇప్పుడు ఆ హామీలను పూర్తిగా విస్మరించారని విమర్శించారు. ఎన్నికల ముందు ఇచ్చిన రెండు లక్షల ఉద్యోగాల హామీ సహా యూత్ డిక్లరేషన్‌లోని ఒక్క అంశం కూడా అమలు కాలేదని ఆరోపించారు. కాంగ్రెస్ మోసాన్ని యువత గుర్తుంచుకోవాలని, ప్రజాస్వామ్యబద్ధంగా తగిన సమయంలో సమాధానం చెప్పాలని పిలుపునిచ్చారు.

# ఆహార కల్తీపై ఇక ఉక్కుపాదం

## ప్రజల ప్రాణాలతో చెలగాటమాడితే కఠిన చర్యలు



- ఆహార కల్తీ నిరోధానికి పటిష్ట చట్టం
- ప్రపంచ దేశాల విధానాలపై అధ్యయనం
- సేంద్రీయ ఉత్పత్తుల స్వచ్ఛతపైనా ప్రత్యేక పరిశీలన
- అసెంబ్లీలో చర్చించి సమగ్ర చట్టం రూపకల్పన
- ఉన్నతస్థాయి సమీక్షలో సీఎం రేవంత్ ఆదేశం

హైదరాబాద్, నేటిధాత్రి:

ఆహార, ఔషధాల కల్తీని అరికట్టేందుకు కఠిన చట్టం రూపొందించాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. కూరగాయలు, పండ్లు, పాలు, ఇతర ఆహార పదార్థాల్లో కల్తీ కారణంగా ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

ఆహార, ఔషధ కల్తీ నియంత్రణపై మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షలో సీఎం పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఆకుకూరలు, కూరగాయలు, పాలు ఎక్కువ రోజులు నిల్వ ఉండేందుకు, పండ్లు త్వరగా మగ్గేందుకు విచ్చలవిడిగా రసాయనాలు వాడుతున్నారని పేర్కొన్నారు. ఎరువులు, పురుగుమందుల అధిక వినియోగంతో పంట ఉత్పత్తుల్లో రసాయన అవశేషాలు పెరుగుతున్నాయని, దీంతో విదేశాలకు ఎగుమతులపైనా ప్రతికూల ప్రభావం పడుతోందని సీఎం చెప్పారు. మార్కెట్‌లో సేంద్రియ ఉత్పత్తుల పేరుతో భారీ ధరలకు వస్తువులు విక్రయిస్తున్నప్పటికీ, వాటి స్వచ్ఛతను నిర్ధారించే సమగ్ర వ్యవస్థ లేదని పేర్కొన్నారు.

ఈ నేపథ్యంలో కల్తీ నిరోధానికి సమగ్ర చట్టాలు అమలు చేస్తున్న దేశాలను అధ్యయనం చేసి, అక్కడి ఉత్తమ విధానాలపై నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం బిల్లు రూపొందించి శాసనసభలో సమగ్ర చర్చ నిర్వహించి, ప్రజల అభిప్రాయాలను సేకరించిన తర్వాత చట్టానికి తుది రూపం ఇవ్వాలని సూచించారు.


కల్తీకి సంబంధించిన సమాచారాన్ని ప్రజలు నేరుగా ప్రభుత్వానికి చేరవేసేలా ప్రత్యేక టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు చేయాలని, అక్రమాలను వెలుగులోకి తీసుకొచ్చే విజిల్‌బ్లోయర్ వ్యవస్థను కూడా అమలు చేయాలని సీఎం ఆదేశించారు.

మొదటి దశలో 'క్యూర్' ప్రాంతాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి అమలు చేయాలని, అందులోని అనుభవాల ఆధారంగా రాష్ట్రవ్యాప్తంగా విస్తరించాలని సూచించారు. తెలంగాణ ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ అథారిటీ చట్టంపై అసెంబ్లీలో సమగ్ర చర్చ జరిపి ప్రజల అభిప్రాయాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని స్పష్టం చేశారు.

సేంద్రియ ఉత్పత్తుల ధ్రువీకరణకు ప్రత్యేక వ్యవస్థను రూపొందించడంపైనా ప్రభుత్వం దృష్టి సారించింది. ప్రజల ఆరోగ్య రక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ, కల్తీకి పాల్పడే వారిపై ఇకపై ఎలాంటి రాజీ లేకుండా కఠిన చర్యలు తీసుకుంటామని సీఎం హెచ్చరించారు. ఈ సమీక్షలో డీజీపీ ఆనంద్, ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు తదితరులు పాల్గొన్నారు.

# దేశ అంతరిక్ష కలలకు తెలంగాణ చిరునామా

## 'విక్రమ్-1' విజయంపై సీఎం హర్షం




హైదరాబాద్, నేటిధాత్రి:

ఆహార, ఔషధాల కల్తీని అరికట్టేందుకు పటిష్ట చట్టం తీసుకురావాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. కల్తీకి సంబంధించిన ఫిర్యాదుల కోసం ప్రత్యేక టోల్‌ఫ్రీ నంబర్, విజిల్‌బ్లోయర్ వ్యవస్థ ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రపంచ దేశాల్లో అమలవుతున్న చట్టాలను అధ్యయనం చేసి తెలంగాణకు అనువైన సమగ్ర బిల్లును రూపొందించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. తొలి దశలో పైలట్ ప్రాజెక్టు అమలు చేసి, అనంతరం రాష్ట్రవ్యాప్తంగా విస్తరించాలని తెలిపారు. సేంద్రియ ఉత్పత్తుల పేరుతో జరుగుతున్న అక్రమాలపైనా ప్రత్యేక పర్యవేక్షణ ఉంటుందని స్పష్టం చేశారు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడే వారిపై ఎలాంటి రాజీ లేకుండా కఠిన చర్యలు తీసుకుంటామని సీఎం హెచ్చరించారు.

# స్థానిక ఉత్పత్తులకు తోడుగా ప్రజలు




- 16-26 వరకు బోనాలు చేతివృత్తుల మేళా
- మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపు

హైదరాబాద్, నేటిధాత్రి:

ట్యాంక్‌బండ్ అంబేద్కర్ విగ్రహం సమీపంలో ఈ నెల 16 నుంచి 26 వరకు నిర్వహిస్తున్న బోనాలు-చేతివృత్తుల మేళాకు ప్రజలు విశేషంగా తరలివస్తున్నారు. 60 స్టాల్స్‌లో చేనేత, హస్తకళలు, మట్టిపాత్రలు, వెదురు వస్తువులు, పోచంపల్లి, గద్వాల్, నారాయణపేట చేనేత ఉత్పత్తులు, మహిళా సంఘాల ఆహార పదార్థాలు, తెలంగాణ సంప్రదాయ వంటకాలు అందుబాటులో ఉన్నాయి. ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు మేళా కొనసాగుతుండగా, ప్రవేశం పూర్తిగా ఉచితం. స్థానిక ఉత్పత్తులను కొనుగోలు చేసి చేతివృత్తి కళాకారులకు అండగా నిలవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రజలకు పిలుపునిచ్చారు. సంప్రదాయ కళలను భావితరాలకు అందించడంలో ఇటువంటి మేళాలు కీలకమని, "మన కళలు-మన చేతివృత్తులు-మన సంపద" అనే భావనతో ప్రతి ఒక్కరూ మేళాను విజయవంతం చేయాలని కోరారు.

# స్కైరూట్ మన టీహబ్‌లోనే పుట్టింది



- విక్రమ్-1 రాకెట్ విజయంపై కేటీఆర్ హర్షం
- తెలంగాణ స్టార్టప్ ఎకోసిస్టమ్‌కు మరో గొప్ప గుర్తింపు
- స్కైరూట్ బృందానికి అభినందనలు తెలిపిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్

హైదరాబాద్, నేటిధాత్రి:

తెలంగాణ స్టార్టప్ వ్యవస్థ మరోసారి ప్రపంచ దృష్టిని ఆకర్షించిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. టీహబ్‌లో పురుడు పోసుకున్న స్కైరూట్

04 లో

# భాజపా నేతల్లో ఎలాంటి విభేదాలు లేవు

## అందరం కలిసి అధికారం కోసం కృషి చేస్తున్నాం

- బండి సంజయ్-ఈటల మధ్య సయోధ్యకు యత్నం
- ఎంపీ లక్ష్మణ్ నివాసంలో ఇద్దరు నేతలతో అభయ్ పాటిల్ చర్చలు
- తెలంగాణలో అధికారం బీజేపీదేనన్న ఎంపీ లక్ష్మణ్

హైదరాబాద్, నేటిధాత్రి :

తెలంగాణ భాజపా నేతల్లో ఎలాంటి విభేదాలు లేవని, అందరం కలిసి పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి కృషి చేస్తున్నామని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ అన్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్, ఎంపీ ఈటల రాజేందర్ మధ్య ఉన్న విభేదాలపై ఆయన స్పందించారు.

పార్టీ కీలక నేతల మధ్య నెలకొన్న విభేదాలపై అధిష్ఠానం దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో కేంద్ర మంత్రి బండి సంజయ్, ఎంపీ ఈటల రాజేందర్‌తో బీజేపీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి అభయ్ పాటిల్ భేటీ అయ్యారు. ఎంపీ లక్ష్మణ్ నివాసంలో జరిగిన ఈ సమావేశంలో ఇరువురు నేతలతో దాదాపు గంటపాటు చర్చలు జరిపారు.

పార్టీ బలోపేతంపై దృష్టి సారించాలని అభయ్ పాటిల్ సూచించారు.



కరీంనగర్ నియోజకవర్గానికి సంబంధించిన అంశాల్లో ఇద్దరూ సమన్వయంతో పనిచేయాలని, ఏవైనా సమస్యలు ఉంటే పార్టీ అంతర్గతంగానే పరిష్కరించుకోవాలని సూచించినట్లు సమాచారం.

అనంతరం ఇరువురు నేతలతో కలిసి ఎంపీ లక్ష్మణ్ మీడియాతో మాట్లాడారు. తెలంగాణలో బీజేపీని అధికారంలోకి తీసుకురావడంపైనే చర్చించినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి ఉందని, బీఆర్ఎస్‌పై కూడా ప్రజలకు నమ్మకం లేదని పేర్కొన్నారు.

వచ్చే ఎన్నికల నాటికి అసెంబ్లీ, లోక్‌సభ స్థానాల్లో బీజేపీ బలం మరింత పెరుగుతుందని, జమిలి ఎన్నికలు జరిగే అవకాశముందని ఆశాభావం వ్యక్తం చేశారు. పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి తామంతా కలిసికట్టుగా పనిచేస్తామని స్పష్టం చేశారు.

తెలంగాణలో అధికారంలోకి రావాలనే లక్ష్యంతో బీజేపీ ముందుకు సాగుతోందని, అందులో భాగంగానే నేతల మధ్య ఉన్న విభేదాలను తొలగించి అందరినీ ఒకే తాటిపైకి తీసుకురావాలని అధిష్ఠానం నిర్ణయించిందన్నారు.

ఎంతోకాలంగా విభేదాలతో ఎడమొహం-పెడమొహంగా ఉన్న కేంద్ర మంత్రి బండి సంజయ్, ఎంపీ ఈటల రాజేందర్ మధ్య సయోధ్య కుదిర్చేందుకు బీజేపీ రాష్ట్ర

04 లో

## ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ

# గడువులో పూర్తి చేయాలి

- రాష్ట్ర ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ హరి చందన దాసరి
- ఐదు జిల్లాల్లో ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమ పురోగతిపై జిల్లా వారీగా సమీక్ష







వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి,నేటిధాత్రి:
ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ--2026 (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) కార్యక్రమాన్ని ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పారదర్శకంగా, నిష్పాక్షికంగా, నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని రాష్ట్ర ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్, తెలంగాణ రాష్ట్ర స్కిల్, హ్యూమన్ క్యాపిటల్ అండ్ నాలెడ్జ్ ట్రైనింగ్ ఇనిషియేటివ్స్ (ఎస్హెచ్ఏకెటీఐ) శాఖ కార్యదర్శి దాసరి హరిచందన సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం హనుమకొండ కలెక్టరేట్‌లోని ఐడీఓసీలో వరంగల్ ఉమ్మడి జిల్లా హనుమకొండ,వరంగల్,జయశంకర్ భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్ జిల్లాల్లో ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమం పురోగతిపై జిల్లా వారీగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్యుమరేషన్ ప్రక్రియ, ఇంటింటి సర్వే, ఫారాల పంపిణీ, స్వీకరణ, మ్యాపింగ్, డిజిటలైజేషన్, అర్హులైన ప్రతి ఓటరును జాబితాలో చేర్చడం, అనర్హుల వివరాల పరిశీలన, పెండింగ్ దరఖాస్తుల పరిష్కారం తదితర అంశాలపై అధికారులతో సమగ్రంగా చర్చించి పలు సూచనలు చేశారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పూర్తి పారదర్శకంగా, నిష్పాక్షికంగా నిర్వహించాలని, ప్రతి అర్హుడైన ఓటరుకు ఓటు హక్కు కల్పించేలా క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేయాలని సూచించారు. భారత ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలు, కాలపట్టికను కచ్చితంగా పాటిస్తూ కార్యక్రమాన్ని నిర్ణీత గడువులో పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా దాసరి హరిచందన మాట్లాడుతూ ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణపై ప్రజల్లో మరింత విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. ఓటర్లు ఎందుకు దరఖాస్తు సమర్పించాలి. ఎప్పుడు, ఎక్కడ, ఎలా సమర్పించాలి
అవసరమైన పత్రాలు ఏమిటి. తరచుగా అడిగే ప్రశ్నలకు (ఎఫ్ఏక్యూ) సమాధానాలు వంటి సమాచారాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలని తెలిపారు. శాశ్వతంగా నివాసం మారిన వారు, వలస వెళ్లిన వారు, ఓటరు జాబితాలో మార్పులు చేయించుకోవాల్సిన వారు స్వచ్ఛందంగా తమ వివరాలు నమోదు చేసుకునేలా అవగాహన కార్యక్రమాలను మరింత ముమ్మరం చేయాలని సూచించారు. బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌వోలు) పనితీరును నిరంతరం పర్యవేక్షిస్తూ, పనితీరు తక్కువగా ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రాజకీయ పార్టీలు, ప్రజాప్రతినిధులు, మీడియా ప్రతినిధులతో నిరంతరం సమన్వయం కొనసాగిస్తూ, ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు సరైన సమాచారం చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీలు, రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్లు (ఆర్డబ్ల్యూఏఎస్),గిరిజన ప్రాంతాల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, ఒక్క అర్హుడైన ఓటరు కూడా నమోదు కాకుండా మిగిలిపోకుండా చూడాలని పేర్కొన్నారు. జిల్లా అధికారులు ప్రతిరోజూ కార్యక్రమ పురోగతిని పోలింగ్ కేంద్రాల వారీగా విశ్లేషిస్తూ క్షేత్రస్థాయిలో జరుగుతున్న పనులను నిరంతరం పర్యవేక్షించాలని, ఎక్కడైనా సమస్యలు ఎదురైతే వెంటనే పరిష్కార చర్యలు చేపట్టాలని సూచించారు. రాష్ట్ర స్థాయి నుంచి అవసరమైన సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. అదేవిధంగా రాజకీయ పార్టీల నుంచి వచ్చే సూచనలు, అభ్యంతరాలు, ఫిర్యాదులను సకాలంలో పరిశీలించి పరిష్కరించాలని, ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో విశ్వాసం పెంపొందేలా పారదర్శకంగా వ్యవహరించాలని అధికారులకు సూచించారు.

**హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ...**

ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)-2026 కార్యక్రమాన్ని ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పారదర్శకంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. జిల్లాలోని వరంగల్ పశ్చిమ, పరకాల నియోజకవర్గాలు ఉన్నాయని, 5.09 లక్షల మంది ఓటర్లు, 483 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, 100 శాతం ఎన్యుమరేషన్ ఫారాలు పంపిణీ చేసి, 68.13 శాతం డిజిటలైజేషన్ పూర్తి చేసినట్లు వెల్లడించారు. గైర్హాజరు ఓటర్లు అధికంగా ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ప్రతి నియోజకవర్గానికి ఎన్నికల అధికారులు, సూపర్‌వైజర్లు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల బీఎల్ఏలను నియమించి, వారికి గుర్తింపు కార్డులు జారీ చేసినట్లు చెప్పారు. కార్యక్రమాన్ని పర్యవేక్షించేందుకు జిల్లా స్థాయి అధికారులు, మంది జూనియర్, సీనియర్ అసిస్టెంట్లను నియమించామని తెలిపారు. ఎస్ఐఆర్‌పై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు 2కే రన్, మీడియా సమావేశాలు, ప్రచార వాహనాలు, బీఎల్ఏలకు శిక్షణ, ఎన్నికల అక్షరాస్యత క్లబ్‌ల ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. ఒక్క అర్హుడైన ఓటరు కూడా మిగిలిపోకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.
జిల్లా స్థాయిలో మీడియా మానిటరింగ్ సెంటర్, కలెక్టరేట్‌తో పాటు ఈఆర్‌వో, ఏఈఆర్‌వో కార్యాలయాల్లో హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేసి దరఖాస్తుల పూరణలో సహాయం అందిస్తున్నామని తెలిపారు. ఫిర్యాదులను నిర్ణీత గడువులో పరిష్కరిస్తూ, కాల్ సెంటర్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుపై 48 గంటల్లోపు స్పందించేలా ప్రత్యేక పర్యవేక్షణ కొనసాగుతోందని పేర్కొన్నారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువులోగా ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసేందుకు జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేస్తోందని కలెక్టర్ తెలిపారు.

**వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ...**

వరంగల్ జిల్లాలోని వరంగల్ తూర్పు, నర్సంపేట, వర్ధన్నపేట అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)-2026 కార్యక్రమాన్ని భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు సమర్థవంతంగా అమలు చేస్తున్నామని తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు 71 శాతం ఫారాల డిజిటలైజేషన్ పూర్తయిందని వెల్లడించారు. పోలింగ్ స్టేషన్‌ల వారీగా ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ, స్వీకరణ, డిజిటలైజేషన్ పురోగతి, క్షేత్రస్థాయిలో చేపట్టిన చర్యలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్‌కు వివరించారు.

**మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ...**

జిల్లాలో ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)-2026 కార్యక్రమాన్ని భారత ఎన్నికల సంఘం నిబంధనల మేరకు సమర్థవంతంగా అమలు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమం అమలులో చేపట్టిన చర్యలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. జిల్లాలో 100 శాతం ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ పూర్తి కాగా, 74 శాతం ఫారాల డిజిటలైజేషన్ పూర్తయిందని వెల్లడించారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువులోగా కార్యక్రమాన్ని పూర్తి చేసేందుకు జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేస్తోందని తెలిపారు.

**జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ..**

జిల్లాలో ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)-2026 కార్యక్రమం వేగవంతంగా కొనసాగుతోందని తెలిపారు. ఇప్పటివరకు 71.74 శాతం ఎస్ఐఆర్ ఫారాల డిజిటలైజేషన్ పూర్తి చేసినట్లు వెల్లడించారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన కాలపట్టిక మేరకు మిగిలిన ప్రక్రియను కూడా సకాలంలో పూర్తి చేసేందుకు జిల్లా యంత్రాంగం సమన్వయంతో కృషి చేస్తోందని పేర్కొన్నారు.

**ములుగు జిల్లా అదనపు కలెక్టర్ మహేందర్ జి మాట్లాడుతూ..**

జిల్లాలో ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)-2026 కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. జిల్లాలో 100 శాతం ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ పూర్తి కాగా, 75.60 శాతం ఫారాల డిజిటలైజేషన్ పూర్తయిందని వెల్లడించారు. ఈ సమావేశంలో హన్మకొండ, వరంగల్ జిల్లాల అదనపు కలెక్టర్లు రవి, సంధ్యారాణి, సంబంధిత జిల్లాల ఎన్నికల విభాగ అధికారులు, ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలు, ఎన్నికల విభాగ పర్యవేక్షకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కూటమి దోపిడీకి అడ్డూ అదుపు

# లేకుండా పోయింది



- అనకాపల్లి జిల్లాలో పంచభూతాల దోపిడీ
- మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఆరోపణలు

అనకాపల్లి, నేటిధాత్రి:
కూటమి పాలనలో దోపిడీకి హద్దు లేకుండా పోతోందని మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఆరోపించారు. అనకాపల్లి జిల్లాలో పంచభూతాలను ఎంపీ సీఎం రమేష్ దోచుకుంటున్నారని అమర్‌నాథ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. మహాపాపానికి కూటమి నేతలు ఒడిగట్టారని మండిపడ్డారు.
అనకాపల్లి జిల్లాలోని ఎలమంచిలిలో పంచదార్ల కొండపై అక్రమ మైనింగ్‌కు వ్యతిరేకంగా గ్రామస్తులు రిలే నిరాహార దీక్షలకు దిగారు. వారి రిలే దీక్షలకు వైఎస్సార్‌సీపీ నేతలు కురసాల కన్నబాబు, గుడివాడ అమర్‌నాథ్, దాడిశెట్టి రాజా, కరణం ధర్మశ్రీ, బొడ్డేడ ప్రసాద్ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా రిలే నిరాహార దీక్షను సందర్శించారు.
ఈ సందర్భంగా మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మాట్లాడుతూ.. "ఎంపీ సీఎం రమేష్ దోపిడీ పీక్ స్టేజ్‌కు చేరుకుంది. కొండలను పిండి చేస్తున్నారు. వందల లారీలతో గ్రావెల్ తరలిస్తున్నారు. పవిత్రమైన పంచదార్ల కొండను మింగేస్తున్నారు. మహాపాపానికి కూటమి నేతలు ఒడిగట్టారు. సనాతన ధర్మం గురించి మాట్లాడే పవన్ కళ్యాణ్ ఏమైపోయారు? 1200 ఏళ్ల చరిత్ర కలిగిన పంచదార్ల కొండను ధ్వంసం చేస్తున్నారు. ఈ పాపానికి పవన్ కళ్యాణ్ ఏం ప్రాయశ్చిత్తం చేస్తారు?" అని ప్రశ్నించారు.
కురసాల కన్నబాబు మాట్లాడుతూ.. "దొంగలు దొంగలు ఊళ్లు పంచుకున్నట్లు కూటమి నేతలు దోపిడీకి పాల్పడుతున్నారు. కొండలను మాయం చేస్తున్నారు. పర్యావరణానికి విఘాతం కల్పిస్తున్నారు. కడప నుంచి సీఎం రమేష్ ప్రజాసేవకు వచ్చారని అనుకున్నాం. వారి కంపెనీల పేరుమీద పర్మిట్లతో కొండలను మింగేస్తున్నారు. సనాతన ధర్మం గురించి మాట్లాడే నాయకులు తెల్లవారితే ఉమా ధర్మలింగేశ్వరస్వామి దేవాలయానికి గుండు కొడుతున్నారు. ఇక్కడ జరుగుతున్న
అన్యాయాన్ని వైఎస్ జగన్ దృష్టికి తీసుకువెళ్తాం. ఈ నెల 21వ తేదీన 'చలో పంచదార్ల' కార్యక్రమం నిర్వహిస్తాం. 30 కిలోమీటర్ల పరిధిలో ఉన్న పంచదార్ల కొండలను 'నో మైనింగ్ జోన్'గా ప్రకటించాలి. మైనింగ్ లీజులను సోమవారం లోపు రద్దు చేయాలి" అని డిమాండ్ చేశారు.
మాజీ మంత్రి దాడిశెట్టి రాజా మాట్లాడుతూ.. "మహా పవిత్రమైనవి పంచదార్ల కొండలు. ఈ కొండ గురించి మహాభారతంలో ప్రస్తావన ఉంది. చోళుల కాలంలో ఉమా ధర్మలింగేశ్వరస్వామి దేవాలయాన్ని నిర్మించారు. పంచదార్ల కొండపై జరుగుతున్న అక్రమ మైనింగ్ సనాతనవాదులకు కనిపించడం లేదా? సంపద సృష్టి పేరుతో వారసత్వ సంపదను దోచుకుంటున్నారు. ఎక్కడి నుంచో వచ్చి ఉత్తరాంధ్ర సంపదను దోచుకుంటున్నారు" అని మండిపడ్డారు.
కరణం ధర్మశ్రీ మాట్లాడుతూ.. "పంచదార్ల కొండపై కూటమి అనకొండలు పడ్డాయి. కొండలను ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ గద్దల్లా దోచుకుంటున్నారు. అక్రమ మైనింగ్‌పై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. 30 కిలోమీటర్ల పరిధిలో పంచదార్ల కొండలు విస్తరించి ఉన్నాయి. ప్రజలకు ఈ కొండలే జీవనాధారం" అని పేర్కొన్నారు.

## తుంగభద్ర పరివాహక రాష్ట్రాలతో భేటీ

- 27న హైపవర్ కమిటీ తొలి సమావేశం
- నీటి సమస్యలపై చర్చించనున్న కమిటీ

అమరావతి, నేటిధాత్రి:
తుంగభద్ర పరివాహక ప్రాంతంలోని ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలు ఎదుర్కొంటున్న సమస్యలపై సమగ్ర అధ్యయనం కోసం కేంద్ర ప్రభుత్వం నియమించిన హైపవర్ కమిటీ తొలిసారిగా ఈ నెల 27న ఢిల్లీలోని కేంద్ర జల సంఘం కార్యాలయంలో సమావేశం కానుంది.
సీడబ్ల్యూసీ సభ్యుడు యోగేష్ పైథంకర్ అధ్యక్షతన ఏపీ ఈఎన్‌సీ కె. నరసింహమూర్తి, కర్ణాటక జలవనరుల శాఖ కార్యదర్శి బీఎస్ శివశంకర్, తెలంగాణ ఈఎన్‌సీ ఓ.వి. రమేష్‌బాబు, సీడబ్ల్యూసీ చీఫ్ ఇంజినీర్లు అభిషేక్ బెనర్జీ, సంజయ్ గంగ్వార్, శరబ్‌జీత్ సింగ్ భక్షీ, ఓంప్రకాశ్ గుప్తా సభ్యులుగా ఉన్న ఈ కమిటీకి తుంగభద్ర బోర్డు కార్యదర్శి ఆస్మా ఖాతూన్ సభ్య కార్యదర్శిగా వ్యవహరిస్తారు.
గత నెల 25న తుంగభద్ర డ్యామ్ కొత్త గేట్ల ప్రారంభ కార్యక్రమానికి కేంద్ర జల్ శక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌తో పాటు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబు నాయుడు, రేవంత్ రెడ్డి, డీకే శివకుమార్ హాజరై ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తుంగభద్ర జలాల వినియోగంలో ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు.
వాటిపై సమగ్రంగా అధ్యయనం చేసి, బచావత్ ట్రిబ్యునల్ అవార్డుకు లోబడి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై నివేదిక ఇవ్వడానికి హైపవర్ కమిటీని ఏర్పాటు చేస్తామని కేంద్ర జల్ శక్తి శాఖ
మంత్రి సీఆర్ పాటిల్ ప్రకటించారు. ఆ మేరకు ఈ నెల 11న కేంద్ర జల్ శక్తి శాఖ జాయింట్ కమిషనర్ సంజయ్ కుమార్ సింగ్ ఉత్తర్వులు జారీ చేశారు.
ఏడు ప్రధాన అంశాలపై అధ్యయనం చేసి ఆరు నెలల్లోగా నివేదిక సమర్పించాలని కమిటీకి సూచించారు.

**హైపవర్ కమిటీ అధ్యయనం చేయనున్న అంశాలు**

రాజోలిబండ డైవర్షన్ స్కీమ్ (ఆర్డీఎస్) కింద చారిత్రక నీటి వినియోగం, నీటి అవసరాలు, నిర్వహణలో ఎదురవుతున్న ఇబ్బందులు, ప్రస్తుత పరిస్థితిపై అధ్యయనం.
తుంగభద్ర డ్యామ్‌లో ఎంత మేరకు పూడిక చేరింది? దాని వల్ల నీటి నిల్వ సామర్థ్యం ఎంత తగ్గింది? సాగు, తాగునీటి అవసరాలు, జలవిద్యుత్ ఉత్పత్తిపై ఎంత ప్రభావం పడుతోంది? డ్యామ్ భద్రత, వరద నియంత్రణ చర్యలపై పరిశీలన.
తుంగభద్ర డ్యామ్‌లో పూడికతీతకు సంబంధించిన సాంకేతిక, ఆర్థిక అంశాలను పరిశీలించి, లాభదాయక మార్గాలను సూచించడం. భవిష్యత్తులో రిజర్వాయర్‌లో పూడిక చేరకుండా తీసుకోవాల్సిన చర్యలను సిఫారసు చేయడం.
ఆర్డీఎస్‌కు నీటి లభ్యతను భరోసా కల్పించేందుకు తుంగభద్ర డ్యామ్ దిగువన బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మాణం అవసరమా? ట్రిబ్యునల్ అవార్డులు, ఒప్పందాలు, న్యాయపరమైన అంశాలపై అధ్యయనం.
తుంగభద్ర డ్యామ్‌లో పూడికతీత వల్ల ప్రయోజనం ఉంటుందా? లేక సమాంతరంగా బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మాణం వల్ల ఎక్కువ ప్రయోజనం కలుగుతుందా? అనే అంశాలపై సాంకేతిక, ఆర్థిక సాధ్యాసాధ్యాల పరిశీలన.
అంతర్రాష్ట్ర అంశాలు, సామాజిక, పర్యావరణ, న్యాయపరమైన సమస్యలపై అధ్యయనం.
కృష్ణా జల వివాదాల ట్రిబ్యునల్ తీర్పులకు లోబడి రాష్ట్రాలకు వాటా మేరకు నీరు అందే అవకాశాలపై పరిశీలన.
అవసరమైతే సబ్ కమిటీలను ఏర్పాటు చేసుకునే, ప్రత్యేక ఆహ్వానితులను నియమించుకునే అధికారాలను కూడా హైపవర్ కమిటీకి కేంద్ర ప్రభుత్వం కల్పించింది.

## బహుజన విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో

# డి.ఈ.ఓ ఆఫీసు ముందు ధర్నా




హన్మకొండ,నేటిధాత్రి:
ప్రభుత్వ అనుమతి లేకుండా నడుపుతున్న ప్రైవేట్ పాఠశాలలను మూసివేయాలని బహుజన విద్యార్థి సంఘం (బి.యస్.ఫ్) ఆధ్వర్యంలో హన్మకొండ జిల్లా విద్యాశాఖ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బి.యస్.ఫ్ హన్మకొండ జిల్లా అధ్యక్షులు బొట్ల మనోహర్ మాట్లాడుతూ హనుమకొండ జిల్లాలో గల్లి గల్లికి విచ్చలవిడిగా ప్రభుత్వ అనుమతి లేకుండా ప్రైవేట్ పాఠశాలలు నడుపుతున్నారని లక్షలాది అధిక ఫీజులు తీసుకుంటున్నారని ఫీజుల పేరుతో పేద మధ్య తరగతి తల్లిదండ్రుల విద్యార్థుల రక్తం తాగుతున్నారని ప్రి ప్రైమరీ మరియు ప్రైమరీ పాఠశాలల పేరుతో ప్రభుత్వ అనుమతి లేకుండా ప్రతి కాలనీలో పుట్టగొడుగులుగా ప్రవేట్ పాఠశాల వెలిశాయని వెంటనే వాటిని మూసివేయాలని అధిక ఫీజుల దోపిని అరికట్టాలని అదేవిధంగా ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ధరలకు పుస్తకాలు నోట్ బుక్స్ అమ్ముతున్నారని ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా స్కూల్ యూనిఫామ్స్ టై బెల్టు లు అమ్ముతున్న ప్రైవేట్ పాఠశాలల గుర్తింపును రద్దు చేయాలని ఎలాంటి గ్రౌండ్ లేకుండా ఫైర్ రక్షణ లేకుండా కమర్షియల్ ఇండ్లలో పాఠశాలలు నడుపుతున్నారని వాటిని గుర్తించి వెంటనే మూసివేయాలని డిమాండ్ చేశారు. అనంతరం పై డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జిల్లా విద్యాశాఖ అధికారికి తన చాంబర్ లో కలిసి అందజేశారు. ఈ కార్యక్రమంలో బిఎస్ఎఫ్ ప్రధాన కార్యదర్శి గడ్డం కృష్ణకాంత్ నాయకులు కడదారపు నవీన్ పుట్ట అజయ్ సునీల్ కుమార్ ప్రశాంత్ రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# భాజపా నేతల్లో ఎలాంటి విభేదాలు లేవు

హైదరాబాద్, నేటిధాత్రి :
తెలంగాణ భాజపా నేతల్లో ఎలాంటి విభేదాలు లేవని, అందరం కలిసి పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి కృషి చేస్తున్నామని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ అన్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్, ఎంపీ ఈటల రాజేందర్ మధ్య ఉన్న విభేదాలపై ఆయన స్పందించారు.
పార్టీ కీలక నేతల మధ్య నెలకొన్న విభేదాలపై అధిష్ఠానం దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో కేంద్ర మంత్రి బండి సంజయ్, ఎంపీ ఈటల రాజేందర్‌తో బీజేపీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి అభయ్ పాటిల్ భేటీ అయ్యారు. ఎంపీ లక్ష్మణ్ నివాసంలో జరిగిన ఈ సమావేశంలో ఇరువురు నేతలతో దాదాపు గంటపాటు చర్చలు జరిపారు.
పార్టీ బలోపేతంపై దృష్టి సారించాలని అభయ్ పాటిల్ సూచించారు. కరీంనగర్ నియోజకవర్గానికి సంబంధించిన అంశాల్లో ఇద్దరూ సమన్వయంతో పనిచేయాలని, ఏవైనా సమస్యలు ఉంటే పార్టీ అంతర్గతంగానే పరిష్కరించుకోవాలని సూచించినట్లు సమాచారం. అనంతరం ఇరువురు నేతలతో కలిసి ఎంపీ లక్ష్మణ్ మీడియాతో మాట్లాడారు. తెలంగాణలో బీజేపీని అధికారంలోకి తీసుకురావడంపైనే చర్చించినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి ఉందని, బీఆర్ఎస్‌పై కూడా ప్రజలకు నమ్మకం లేదని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల నాటికి అసెంబ్లీ, లోక్‌సభ స్థానాల్లో బీజేపీ బలం మరింత పెరుగుతుందని, జమిలి ఎన్నికలు జరిగే అవకాశముందని ఆశాభావం వ్యక్తం చేశారు. పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి తామంతా కలిసికట్టుగా పనిచేస్తామని స్పష్టం చేశారు. తెలంగాణలో అధికారంలోకి రావాలనే లక్ష్యంతో బీజేపీ ముందుకు సాగుతోందని, అందులో భాగంగానే నేతల మధ్య ఉన్న విభేదాలను తొలగించి అందరినీ ఒకే తాటిపైకి తీసుకురావాలని అధిష్ఠానం నిర్ణయించిందన్నారు.
ఎంతోకాలంగా విభేదాలతో ఎడమొహం--పెడమొహంగా ఉన్న కేంద్ర మంత్రి బండి సంజయ్, ఎంపీ ఈటల రాజేందర్ మధ్య సయోధ్య కుదిర్చేందుకు బీజేపీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి అభయ్ పాటిల్ స్వయంగా రంగంలోకి దిగారు. ఈటల రాజేందర్, బండి సంజయ్‌లతో ఎంపీ లక్ష్మణ్ నివాసంలో సమావేశమై ఇరువురి మధ్య సమన్వయం కుదిరేలా చర్చలు జరిపారు. విభేదాలను పక్కనపెట్టి తెలంగాణలో బీజేపీని అధికారంలోకి తీసుకురావడానికి కలిసి పనిచేయాలని ఇద్దరు నేతలకు అభయ్ పాటిల్ దిశానిర్దేశం చేశారు. సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడిన బీజేపీ నేతలు తమ మధ్య ఎలాంటి విభేదాలు లేవని స్పష్టం చేశారు. తెలంగాణలో అధికారంలోకి వచ్చేది బీజేపీనే అని ధీమా వ్యక్తం చేశారు.
ఈ సందర్భంగా ఎంపీ లక్ష్మణ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ పాలనతో ప్రజలు విసిగిపోయారని అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చలేదని, కాంట్రాక్టర్లు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు. తెలంగాణ అభివృద్ధిపై ప్రధాని నరేంద్ర మోదీ ప్రత్యేక చొరవ చూపారని, వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

## స్కైరూట్ మన

# టీహబ్‌లోనే పుట్టింది

- విక్రమ్-1 రాకెట్ విజయంపై కేటీఆర్ హర్షం
- తెలంగాణ స్టార్టప్ ఎకోసిస్టమ్‌కు మరో గొప్ప గుర్తింపు
- స్కైరూట్ బృందానికి అభినందనలు తెలిపిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్

హైదరాబాద్, నేటిధాత్రి:
తెలంగాణ స్టార్టప్ వ్యవస్థ మరోసారి ప్రపంచ దృష్టిని ఆకర్షించిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. టీహబ్‌లో పురుడు పోసుకున్న స్కైరూట్ ఏరోస్పేస్ సంస్థ చేపట్టిన విక్రమ్--1 రాకెట్ ప్రయోగం విజయవంతం కావడం తెలంగాణ యువత ప్రతిభకు, రాష్ట్రంలో ఏర్పాటైన వినూత్న పారిశ్రామిక వాతావరణానికి నిదర్శనమని పేర్కొన్నారు. ఈ విజయంతో తెలంగాణ నుంచి ప్రపంచ స్థాయి అంతరిక్ష సాంకేతిక సంస్థలు రూపుదిద్దుకుంటున్నాయనే విషయం మరోసారి రుజువైందని ఆయన అన్నారు.

**టీహబ్ నుంచి అంతరిక్ష రంగానికి**

హైదరాబాద్ సరూర్‌నగర్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ యువ సంగ్రామ సదస్సులో కేటీఆర్ మాట్లాడుతూ, టీహబ్ వేదికగా ప్రారంభమైన స్కైరూట్ సంస్థ నేడు దేశ అంతరిక్ష చరిత్రలో ప్రత్యేక స్థానం సంపాదించిందన్నారు. స్టార్టప్‌గా ప్రారంభమైన ఈ సంస్థ ప్రైవేటు రంగంలో భారత అంతరిక్ష రంగానికి కొత్త దారులు చూపుతోందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గతంలో తీసుకొచ్చిన స్టార్టప్ విధానాలు, యువ పారిశ్రామికవేత్తలకు కల్పించిన ప్రోత్సాహం ఇలాంటి విజయాలకు పునాది వేసిందని తెలిపారు.

**దేశానికి గర్వకారణమైన ఘట్టం**

భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి దాదాపు ఎనిమిది దశాబ్దాలు పూర్తవుతున్న తరుణంలో, ప్రైవేటు రంగం నుంచి అభివృద్ధి చెందిన సంస్థ అంతరిక్ష ప్రయోగంలో విజయం సాధించడం దేశానికి గర్వకారణమని కేటీఆర్ అన్నారు. శ్రీహరికోట నుంచి విజయవంతంగా ప్రయోగించిన విక్రమ్--1 రాకెట్ భారత అంతరిక్ష సామర్థ్యాన్ని మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లిందని కొనియాడారు.

**యువతకు స్ఫూర్తిదాయక విజయం**

స్కైరూట్ విజయం తెలంగాణ యువతకు స్ఫూర్తిగా నిలుస్తుందని కేటీఆర్ పేర్కొన్నారు. ప్రతిభ, పట్టుదల, సాంకేతిక పరిజ్ఞానం ఉంటే ప్రపంచ స్థాయి విజయాలు సాధించడం సాధ్యమేనని ఈ ఘట్టం నిరూపించిందన్నారు. యువత ఉద్యోగాల కోసం మాత్రమే కాకుండా, ఉద్యోగాలను సృష్టించే పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఆయన పిలుపునిచ్చారు.


**స్కైరూట్ బృందానికి అభినందనలు**

శ్రీహరికోట నుంచి విక్రమ్--1 రాకెట్ ప్రయోగం విజయవంతం కావడంతో స్కైరూట్ కంట్రోల్ సెంటర్‌లో శాస్త్రవేత్తలు, సిబ్బంది సంబరాలు జరుపుకుంటున్నారని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా సభలో ఉన్న విద్యార్థులు, నిరుద్యోగ యువత అందరూ చప్పట్లతో స్కైరూట్ బృందాన్ని అభినందించాలని కోరారు. తెలంగాణలో పుట్టిన సంస్థ ప్రపంచ వేదికపై మరో మైలురాయిని అధిగమించడం రాష్ట్ర ప్రజలందరికీ గర్వకారణమని ఆయన అన్నారు.


## అందెశ్రీ స్మృతివనంతో తెలంగాణ

# సాహిత్యానికి చిరస్థాయి గుర్తింపు

- శంకుస్థాపన చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి హృదయపూర్వక ధన్యవాదాలు: డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ
- తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీకగా ప్రజాకవి అందెశ్రీ స్మృతి నిలిచిపోతుంది



హైదరాబాద్, నేటిధాత్రి:
తెలంగాణ ప్రజాకవి, "జయ జయహే తెలంగాణ" గేయ రచయిత అందేశ్రీ స్మృతిని చిరస్థాయిగా నిలిపేందుకు రాష్ట్ర ప్రభుత్వం స్మృతివనం ఏర్పాటు చేసి శంకుస్థాపన చేయడం అభినందనీయమని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ పేర్కొన్నారు. తెలంగాణ సాహిత్య, సాంస్కృతిక చరిత్రలో ఈ నిర్ణయం ఒక చారిత్రాత్మక ఘట్టంగా నిలుస్తుందని ఆయన అన్నారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన అందెశ్రీ గారి సేవలను భావితరాలకు పరిచయం చేయాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకున్న నిర్ణయం ప్రశంసనీయమని పేర్కొన్నారు. సాహిత్యం, సంస్కృతి, తెలంగాణ ఉద్యమ చరిత్రను గౌరవించే ప్రభుత్వంగా కాంగ్రెస్ ప్రభుత్వం మరోసారి తన నిబద్ధతను చాటుకుందని అన్నారు. అందెశ్రీ గారి రచనలు తెలంగాణ ప్రజల్లో ఆత్మవిశ్వాసాన్ని, స్వాభిమానాన్ని పెంపొందించాయని, ఆయన స్మృతిని శాశ్వతంగా నిలిపే ఈ స్మృతివనం రాష్ట్ర ప్రజలందరికీ గర్వకారణంగా నిలుస్తుందని తెలిపారు.
స్మృతివనం నిర్మాణానికి శ్రీకారం చుట్టి



శంకుస్థాపన చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రాష్ట్ర ప్రజల తరఫున హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ పేర్కొన్నారు. తెలంగాణ సాహిత్య వారసత్వాన్ని పరిరక్షిస్తూ, ఉద్యమ చరిత్రను భావితరాలకు అందించే దిశగా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు అభినందనీయమని అన్నారు.
ఈ సందర్భంగా మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షులు రేగుంట సునీల్ మాదిగ మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమంలో అందెశ్రీ గారి పాటలు ప్రజల్లో చైతన్యాన్ని నింపాయని అన్నారు. అలాంటి మహనీయుడి జ్ఞాపకార్థం స్మృతివనం నిర్మించడం ప్రభుత్వం తీసుకున్న గొప్ప నిర్ణయమని కొనియాడారు. తెలంగాణ సంస్కృతి, చరిత్ర, సాహిత్య వారసత్వాన్ని భావితరాలకు అందించేందుకు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాదిగ హక్కుల దండోరా నాయకులు, సామాజిక కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ముస్లిం సోదరులు వర్షాల కోసం ప్రత్యేక ప్రార్థనలు.



**జహీరాబాద్, నేటిధాత్రి:** రాష్ట్రంలో వర్షాలు ఆలస్యమవడంతో రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో వర్షాల కోసం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. జమీఅతుల్ ఉలమా జహీరాబాద్, ఈద్గా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ఈద్గా మైదానంలో సలాతుల్ ఇస్తిస్కా ప్రత్యేక నమాజ్ నిర్వహించి,
రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతుల పంటలు పండాలని, చెరువులు, కుంటలు నిండాలని, ప్రజలకు కరువు కష్టాలు తొలగాలని అల్లాహ్‌ను వేడుకున్నారు. ఈ సందర్భంగా ఉలమా ప్రజలు అల్లాహ్‌ను ఎక్కువగా స్మరించడంతో పాటు తౌబా చేసి దువాలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ ప్రత్యేక ప్రార్థనలు శనివారం, ఆదివారం కూడా ఇదే సమయంలో కొనసాగనున్నాయని నిర్వాహకులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు, ముస్లిం సోదరులు పాల్గొన్నారు

# రజక కుటుంబాలకు మడేలయ్య ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలి

## బోనాల వేడుకల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ పెండెం శ్రీలక్ష్మీరామానంద్....



**నర్సంపేట, నేటిధాత్రి:** నర్సంపేట పట్టణ రజక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన మడేలయ్య బోనాల పండుగ శనివారం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా జరిగింది. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన నర్సంపేట మున్సిపల్ చైర్‌పర్సన్, టీపీసీసీ సభ్యులు పెండెం శ్రీలక్ష్మీరామానంద్ మడేలయ్య ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం రజక కుల సంఘం నాయకులు చైర్‌పర్సన్ శ్రీలక్ష్మీరామానంద్‌ను శాలువాతో ఘనంగా సత్కరించారు.



ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మహాదేవుడు మడేలయ్య ఆశీస్సులు రజక కుల బాంధవులు, వారి కుటుంబాలపై ఎల్లప్పుడూ ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో కొల్లూరి లక్ష్మీనారాయణ, కొల్లూరి శ్రీహరి, ఐలోని శ్రీనివాస్, మార్కెట్ డైరెక్టర్ కొల్లూరి మధుకర్, కొల్లూరి భాస్కర్, రాయరాకుల శ్రీనివాస్, గుడికందుల సదానందం, ఉప్పుల పరమేశ్వర్, పొదిల్ల రామ్‌చందర్, నర్సంపేట నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు తుమ్మలపెల్లి సందీప్, యూత్ కాంగ్రెస్ నాయకులు ఉప్పుల షాలోమ్, చిక్కటి శివమణి, గుడికందుల శీను, వావిళ్ల ఈశ్వర్, రజక కుల సంఘం నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కుందారం రైతుల ఆందోళన.. నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్



**జైపూర్, నేటిధాత్రి:** మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం కుందారం గ్రామానికి చెందిన రైతులు శనివారం స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టి తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వ్యవసాయానికి నాణ్యమైన,నిరంతర విద్యుత్ సరఫరా అందించడంలో విద్యుత్ శాఖ అధికారులు పూర్తిగా విఫలమయ్యారని రైతులు ఆరోపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఒకవైపు వర్షాభావ పరిస్థితులతో పంటలు ఎండిపోతున్నాయని, మరోవైపు మార్కెట్‌లో రసాయన ఎరువుల కొరత తీవ్రంగా ఉందని తెలిపారు. కొంతమంది వ్యాపారులు ఎరువులను బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తుండటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ పెట్టుబడులు రోజురోజుకూ పెరుగుతుండగా,ఎరువుల కొరతతో పాటు తరచూ విద్యుత్ అంతరాయాలు ఏర్పడటం వల్ల పంటలను కాపాడుకోవడం కష్టంగా మారిందని రైతులు వాపోయారు. ఇప్పటికే ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్న తమకు విద్యుత్ కోతలు మరింత భారంగా మారాయని పేర్కొన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి,వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వ్యవసాయానికి అవసరమైన నాణ్యమైన,నిరంతర విద్యుత్ సరఫరా అందించడంతో పాటు విద్యుత్ అంతరాయాలను నివారించేలా చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేశారు.

# ఎల్‌నినో దృష్ట్యా ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి

## నర్సంపేట మండల అగ్రికల్చర్ ఆఫీసర్ కృష్ణ కుమార్....ఎల్‌నినో ప్రభావంతో తక్కువ నీటి అవసరమయ్యే పంటలపై రైతులకు అవగాహన....



**నర్సంపేట, నేటిధాత్రి:** వానాకాలం--2026 సీజన్‌లో ఎల్‌నినో ప్రభావం కారణంగా వర్షపాతం తక్కువగా నమోదయ్యే అవకాశం ఉన్నందున వరి సాగుకు బదులుగా తక్కువ నీటి అవసరమయ్యే ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని వ్యవసాయ శాఖ అధికారి కృష్ణ కుమార్ రైతులకు సూచించారు. ఈ మేరకు మండలంలోని రామవరం, చిన్న గురిజాల, రాములునాయక్ తండా, మాధన్నపేట, రాజుపేట గ్రామాల్లో రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ కృష్ణకుమార్ మాట్లాడుతూ, ప్రస్తుతం నెలకొన్న వాతావరణ పరిస్థితుల దృష్ట్యా వరి నాట్లు వేయడం వల్ల భవిష్యత్‌లో నీటి కొరత ఏర్పడి పంటలు దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు. అందుబాటులో ఉన్న నీటి వనరులను దృష్టిలో ఉంచుకుని కూరగాయలు, అపరాలు, జొన్న తదితర తక్కువ నీటి అవసరమయ్యే పంటలను సాగు చేయాలని సూచించారు. ఈ పంటలు తక్కువ వ్యవధిలో దిగుబడినివ్వడంతో పాటు రైతులకు నష్టాల ప్రమాదాన్ని తగ్గిస్తాయని వివరించారు. ఈ కార్యక్రమంలో రామవరం సర్పంచ్ యర్నం అనిత, చిన్న గురిజాల సర్పంచ్ రాగిరి కమలాకర్,వ్యవసాయ విస్తరణ అధికారులు అశోక్, వినాయక్, అబిద్ హుస్సేన్, సంధ్య, సింధు, కిరణ్మయి, రైతులు పాల్గొన్నారు.

# హార్వెస్టర్స్ యూనియన్ ప్రెసిడెంట్ గా ఏకగ్రీవం



**వీణవంక, నేటిధాత్రి:** వీణవంక మండల పరిధిలోని కొండపాక గ్రామంలో హార్వెస్టర్స్ ఓనర్స్ ఆధ్వర్యంలో నూతనంగా హార్వెస్టర్స్ యూనియన్ ప్రెసిడెంట్ గా కోల్గూరి రాము ను ఏకగ్రీవంగా నియమించడం జరిగింది ఈ సందర్భంగా ఓనర్స్ అందరు కలిసి కోర్కల్ శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించుకొని స్వామి వారి ఆశీర్వాదం ప్రజల అందరి పై ఉండాలని వారు కోరారు యూనియన్ ప్రెసిడెంట్ కొల్గూరి రాము మాట్లాడుతూ... సమృద్ధిగా వర్షాలు కురిసి పాడి పంటలు సమృద్ధిగా పండి రైతుల కళ్ళల్లో ఆనందం కలగాలని ఆ భగవంతుని ఆశీర్వాదం ప్రజల అందరిపై ఉండాలని వారు కోరారు ఈ కార్యక్రమంలో కాసర్ల సుధాకర్ సంగెం సారయ్య ఈదునూరి రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# ఇందారం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఘనంగా ప్రజాకవి అందెశ్రీ జయంతి




**జైపూర్, నేటిధాత్రి:** మంచిర్యాల జిల్లా జైపూర్ మండలంలోని ఇందారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం తెలంగాణ రాష్ట్ర గేయ రచయిత,ప్రజాకవి అందెశ్రీ జయంతిని ఘనంగా నిర్వహించారు. తల్లిదండ్రులు--ఉపాధ్యాయుల సమావేశం సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.
ఈ సందర్భంగా పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు కె.రమేష్‌బాబు మాట్లాడుతూ ప్రజాకవి అందెశ్రీ రచనలు సమాజంలో చైతన్యాన్ని నింపాయని అన్నారు. తెలంగాణ ఉద్యమానికి ఆయన గేయాలు ఎంతో స్ఫూర్తినిచ్చాయని,ఆయన జీవితం నేటి తరానికి ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. అనంతరం తల్లిదండ్రులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులను ప్రతిరోజూ క్రమం తప్పకుండా పాఠశాలకు పంపించి వారి విద్యాభివృద్ధికి సహకరించాలని కోరారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం పాఠశాలకు నిరంతరం పంపిస్తామని తల్లిదండ్రులు ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వి.మంజుల,ఎం.విజయలక్ష్మి, ఎం.సత్తిరెడ్డి,జి.చక్రధర్,డి.సహదేవ్,జి.సంధ్యారాణి,ఎన్.పద్మ,జి.రవీందర్,బి.నవీన్ కుమార్,కనకయ్య,అరుణ్‌తో పాటు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# వరుణ యాగాలతో వర్షాలు రావు

## శాస్త్రీయ ఆలోచనలతోనే సమస్యలకు పరిష్కారం....తెలంగాణ విద్యావంతుల వేదిక జిల్లా అధ్యక్షులు రాదండి దేవేందర్....



**భూపాలపల్లి, నేటిధాత్రి:** ప్రస్తుతం రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో తెలంగాణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ రాష్ట్రంలోని దేవాలయాల్లో వరుణ యాగాలు నిర్వహించి వర్షాలు కురిపిస్తామని ప్రకటించడం అజ్ఞానానికి, అశాస్త్రీయ ఆలోచనలకు నిదర్శనమని తెలంగాణ విద్యావంతుల వేదిక భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు రాదండి దేవేందర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఒకవైపు ప్రపంచం విజ్ఞాన శాస్త్రంలో రాకెట్ వేగంతో ముందుకు సాగుతోంది. అంతరిక్ష పరిశోధనలు, కృత్రిమ మేధస్సు, వాతావరణ అంచనాలు, శాస్త్రీయ సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందుతున్న ఈ కాలంలో ప్రజలకు మార్గనిర్దేశం చేయాల్సిన బాధ్యత కలిగిన మంత్రులు మూఢనమ్మకాలను ప్రోత్సహించేలా మాట్లాడడం అత్యంత దురదృష్టకరమన్నారు. ప్రభుత్వం ప్రజల పన్నుల ద్వారా సమకూరిన నిధులను శాస్త్రీయ పరిశోధనలు, నీటి సంరక్షణ, చెరువుల పునరుద్ధరణ, వర్షపు నీటి నిల్వ, భూగర్భ జలాల పెంపు, సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణ, కరువు నివారణ చర్యలపై ఖర్చు చేయాల్సింది పోయి వరుణ యాగాల పేరుతో ప్రజాధనాన్ని వినియోగించడం సమర్థనీయం కాదన్నారు. గతంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వ హయాంలో మేఘమథనం వంటి శాస్త్రీయ పద్ధతులను పరిశీలిస్తూ వర్షాలను ప్రోత్సహించే ప్రయత్నాలు జరిగాయని గుర్తు చేశారు. అవి పూర్తిస్థాయిలో విజయవంతమయ్యాయా లేదా అన్నది వేరే చర్చ అయినప్పటికీ, కనీసం శాస్త్రీయ ఆధారాలపై ప్రయోగాలు చేయాలనే ప్రయత్నం అందులో కనిపించిందన్నారు. అయితే ఇప్పుడు వరుణ యాగాల ద్వారా వర్షాలు కురుస్తాయని చెప్పడం శాస్త్రీయ దృక్పథానికి పూర్తిగా విరుద్ధమని పేర్కొన్నారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 51ఏ ప్రకారం ప్రతి పౌరుడు శాస్త్రీయ దృక్పథం, మానవతావాదం, పరిశోధనా మనస్తత్వాన్ని పెంపొందించడం ప్రాథమిక విధి. అదే బాధ్యత ప్రజాప్రతినిధులపై మరింత ఎక్కువగా ఉంటుందని అన్నారు. ప్రజల్లో శాస్త్రీయ చైతన్యం పెంపొందించాల్సిన ప్రభుత్వమే మూఢనమ్మకాలకు ఊతమివ్వడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమన్నారు. వాతావరణ మార్పులు, అటవీ వినాశనం, భూగర్భ జలాల క్షీణత, పర్యావరణ అసమతుల్యత వంటి అంశాల వల్ల వర్షపాతం విధానాలు మారుతున్నాయని ప్రపంచవ్యాప్తంగా శాస్త్రవేత్తలు చెబుతున్నారని పేర్కొన్నారు. ఈ సమస్యలకు పరిష్కారం యాగాలు కాదు; పర్యావరణ పరిరక్షణ, అడవుల విస్తరణ, నీటి వనరుల సంరక్షణ, శాస్త్రీయ ప్రణాళికల అమలేనని స్పష్టం చేశారు. తెలంగాణ ప్రభుత్వం ప్రజలను మూఢనమ్మకాల వైపు నడిపించే కార్యక్రమాలను విరమించి, శాస్త్రీయ దృక్పథాన్ని ప్రోత్సహించే చర్యలు చేపట్టాలని, వర్షాభావ నివారణకు శాస్త్రీయ, పర్యావరణ పరమైన కార్యాచరణను అమలు చేయాలని తెలంగాణ విద్యావంతుల వేదిక డిమాండ్ చేస్తోందని రాదండి దేవేందర్ తెలిపారు.



# భూపాలపల్లిలో సిపిఐ రాజకీయ శిక్షణ శిబిరం ప్రారంభం

## సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్ రావు...



**భూపాలపల్లి, నేటిధాత్రి:** అసమానతలు ఉన్నంతకాలం కమ్యూనిస్టులకు అంతం లేదని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. శనివారం భూపాలపల్లి మంజూరు నగర్ లోని ఇల్లందు క్లబ్ లో మోట పలుకుల రమేష్ అధ్యక్షతన భూపాలపల్లి జిల్లా రాజకీయ శిక్షణా తరగతులు ప్రారంభమయ్యాయి. తొలుత శిక్షణా తరగతుల ప్రాంగణంలో సిపిఐ పతాకాన్ని ఎగురవేసిన అనంతరం శిక్షణా తరగతులను తక్కళ్లపల్లి శ్రీనివాసరావు ప్రారంభించారు.



ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాసమస్యలపై అనునిత్యం పోరాడుతున్నది కమ్యూనిస్టులేనని అన్నారు.
కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తరువాత మతతత్వ శక్తుల ఆగడాలు పెరిగిపోయాయని, ప్రజాసమస్యలను విస్మరించి కార్పొరేట్ శక్తులకు మోడీ ప్రభుత్వం దేశ సంపదను దోచి పెడుతున్నదని అన్నారు. దేశంలో బిజెపిని అడ్డుకునేందుకు వామపక్షాలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. బిజెపి ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుంటే ప్రభుత్వానికి తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు.
పాలకులు పేదల అనుకూల విధానాలను అవలంబించడం లేదని, ప్రధాని నరేంద్ర మోదీ బంగారం కొన వద్దంటూ పేదలకు నీతులు చెబుతూ పెద్దలకు అనుకూలంగా మెదులుతున్నారని విమర్శించారు.
రాష్ట్రంలో ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇస్తామని, ప్రభుత్వ భూములలో గుడిసెలు వేసుకుని నివసిస్తున్న పేదలకు జీవో 58 ప్రకారం పట్టాలు ఇస్తామని చెప్పి నేడు అమలు చేయడం లేదన్నారు. రాష్ట్రంలో లక్షలాది మంది ఇండ్లు లేని నిరుపేదలు ఉన్నారని అన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏండ్లు గడిచినా పేదవాడి జీవితం మార లేదని అన్నారు. పేదలు సిపిఐ ఆధ్వర్యంలో అనేక చోట్ల భూపోరాటాలు నిర్వహించి గుడిసెలు వేసుకుని నివసిస్తున్నారని, వారందరికీ పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కమ్యూనిస్టుల మద్దతు ఉంటేనే ప్రభుత్వాలు మనగలుగుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్, ప్రిన్సిపాల్ వ్యవహరించిన ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి మోటపలుకుల రమేష్, వైస్ ప్రెసిడెంట్ మాతంగి రామచందర్, సిపిఐ జిల్లా నాయకులు పైళ్ళ శాంతి కుమార్, మామిడాల సమ్మిరెడ్డి,క్యాథరాజు సతీష్, పరమండ్ల రాజయ్య, కొరిమి సుగుణ, పెంట రవి, సోతుకు ప్రవీణ్ కుమార్, నాయకులు నేరెళ్ల జోసెఫ్, వేముల శ్రీకాంత్, కుడుదుల వెంకటేష్, తాళ్ల పోశం, ఏఐటీయూసీ అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీలు జి శ్రీనివాస్, ఆసిఫ్ పాషా, ఏఐటీయూసీ నాయకులు కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

# గౌతమ్ మోడల్ స్కూల్‌లో ఘనంగా 'ఇన్వెస్టిచర్ వేడుక'



**శేరిలింగంపల్లి, నేటిధాత్రి:** కొండాపూర్ లో గౌతమ్ మోడల్ స్కూల్‌లో వార్షిక ఇన్వెస్టిచర్ సెర్మనీ పదవీ స్వీకార మహోత్సవం శనివారం అత్యంత ఘనంగా జరిగింది. నూతనంగా ఎన్నికైన స్టూడెంట్ కౌన్సిల్ సభ్యులకు పాఠశాల ప్రతినిధులు బాధ్యతలను అప్పగించారు. ఈ సందర్భంగా విద్యార్థి నాయకులు పాఠశాల విలువలను కాపాడుతూ, బాధ్యతాయుతంగా వ్యవహరిస్తామని ప్రమాణ స్వీకారం చేశారు. విద్యార్థులు నిర్వహించిన మార్చ్ పాస్ట్ వేడుకలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ శ్రవంతి మాట్లాడుతూ, ఇన్వెస్టిచర్ సెర్మనీ విద్యార్థులలో నాయకత్వ లక్షణాలను, నమ్మకాన్ని పెంచే ఒక వేదిక అని, భావి భారత పౌరులుగా ఎదగడానికి ఇది ఎంతగానో తోడ్పడుతుందని పేర్కొన్నారు. బాధ్యతలతో పాటు జవాబుదారీతనం, సమష్టి కృషి అలవడుతుందని చెప్పారు. ఈ కార్యక్రమానికి పాఠశాల చైర్మన్ వెంకటనారాయణ, సీఈఓ భరత్ శుభాకాంక్షలు తెలియజేయగా, డీన్ భరద్వాజ్ విద్యార్థులను అభినందించారు. వేడుకలో పాఠశాల ఇన్‌ఛార్జ్‌లు నళిని, షారోన్, మధు, ఉపాధ్యాయులు మరియు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని విద్యార్థులను ఉత్సాహపరిచారు.

# స్పోర్ట్స్ హాస్టల్స్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

## జిల్లా క్రీడల శాఖ అధికారి రఘు....



**భూపాలపల్లి, నేటిధాత్రి:** స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ హైదరాబాద్ వారి ఆదేశాల మేరకు 2026-27 కు రాష్ట్రంలోని వివిధ ప్రాంతీయ క్రీడా పాఠశాలలు క్రీడా అకాడమీలలో ఉచిత ప్రవేశాల కొరకు బాలబాలికల ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా యువజన క్రీడల అధికారి సిహెచ్ రఘు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల జూలై 20 నుండి జూలై 28 వరకు రాష్ట్రంలోని నిర్దేశిత క్రీడా కేంద్రాలలో ఈ ఎంపికలు జరుగుతాయి. వారు తెలిపారు

# మద్దులపల్లిలో గుడుంబా అమ్మితే కఠిన చర్యలు



## దుకాణదారులకు గ్రామపంచాయతీ పాలకవర్గం హెచ్చరిక....

**భూపాలపల్లి, నేటిధాత్రి:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం మద్దులపల్లి గ్రామంలో గుడుంబా అమ్మకాలు, తయారీని పూర్తిగా అరికట్టేందుకు గ్రామపంచాయతీ పాలకవర్గం కఠిన నిర్ణయాలు తీసుకుంది. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ సరిత, ఉపసర్పంచ్ లచ్చిరెడ్డి, వార్డు సభ్యులు తేజస్విని, దేవిక, శ్రావణి, వెంకటేష్, మనక్క, గ్రామ కార్యదర్శి స్వాతి గ్రామంలోని దుకాణాలను సందర్శించి దుకాణదారులకు హెచ్చరికలు జారీ చేశారు. గ్రామంలో ఎవరైనా గుడుంబా అమ్మకాలు లేదా తయారీ చేపడితే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు రూ.10,000 జరిమానా విధిస్తామని స్పష్టం చేశారు. అలాగే గుడుంబా అమ్మకాలపై ఫోటోలు లేదా ఆధారాలతో సమాచారం అందించిన వారికి రూ.1,000 నగదు బహుమతి అందజేస్తామని తెలిపారు. మద్దులపల్లిని గుడుంబా రహిత, మద్యపాన నిషేధిత ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు ప్రతి గ్రామస్థుడు సహకరించాలని గ్రామపంచాయతీ పాలకవర్గం పిలుపునిచ్చింది.

# ప్రత్యామ్నాయ పంటల వైపే మొగ్గు చూపాలి



**నర్సంపేట, నేటిధాత్రి:** ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, ఎల్ నినో వర్షాభావ ముప్పును దృష్టిలో ఉంచుకుని రైతులు సంప్రదాయ వరి సాగుకు బదులుగా ప్రత్యామ్నాయ ఆరుతడి పంటల వైపు మొగ్గు చూపాలని అధికారులు సూచించారు. మండలంలోని రాజేశ్వరావుపల్లి, బొడ్యానాయక్ తండా గ్రామాల్లో వర్షాభావ పరిస్థితులపై రైతులకు ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ విస్తరణ సి.హెచ్ సింధు కిరణ్మయి మాట్లాడుతూ ప్రస్తుత నీటి ఎద్దడి పరిస్థితుల్లో వర్షాభావాన్ని, తీవ్రమైన బెట్టను తట్టుకునే ప్రత్యేక కంది రకాలైన పి.ఆర్.జి-158,ఎల్ ఆర్ జి-41 లను రైతులు సాగు చేయాలని పిలుపునిచ్చారు. ఇవి నేలలోని తక్కువ తేమను కూడా సమర్థవంతంగా వినియోగించుకుని, రైతులకు ఆశించిన స్థాయిలో మంచి దిగుబడిని ఇస్తాయని ఆమె స్పష్టం చేశారు. రైతులు ఒకే పంటపై ఆధారపడకుండా పంట వైవిధ్యీకరణ పాటించాలని, తక్కువ కాలంలో పండే రకాలను ఎంచుకోవాలని సూచించారు. ముఖ్యంగా కంది, పెసర, మినుము, జొన్న, సజ్జ, పొద్దుతిరుగుడు మరియు నూనె గింజల పంటలను, అలాగే కూరగాయలు, చిరుధాన్యాల సాగు వైపు మొగ్గు చూపాలని వివరించారు. ఈ సదస్సులో వర్షాభావ పరిస్థితుల్లో పంటల యాజమాన్యం, ఎరువుల సమర్థవంతమైన వాడకం, నేలలోని తేమను కాపాడుకునే సంరక్షణ పద్ధతులను రైతులకు క్షుణ్ణంగా వివరించారు. ఈకార్యక్రమంలో రాజేశ్వరావుపల్లి, బొడ్యానాయక్ తండా గ్రామాల సర్పంచ్‌లు, స్థానిక రైతులు,ఇతర వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

# వర్షాలు లేక ఒకవైపు.. మోటార్లు కాలి.. మరమ్మతులకు ట్రాన్స్ఫార్మర్లు తెచ్చినా పట్టించుకోని విద్యుత్ శాఖ అధికారులు!

**రైతన్నల కన్నీరు.. కరెంటోల్ల నిర్లక్ష్యం: మరమ్మతులకు తిరిగోస్తున్న అన్నదాతలు.... (టీ) సర్టిఫికెట్ ఉంటేనే ట్రాన్స్ఫార్మర్లు మరమ్మతులకు దిగుమతి....విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ల మరమ్మతుల కేంద్రం వద్ద బురదమయం....**



కోదాడ, నేటి ధాత్రి: సాగునీరు లేక నాట్లు వేసిన వరి పొలాలు ఎండిపోతుంటే కాలిపోయిన ట్రాన్స్ఫార్మర్లు మాత్రం మరమ్మతులకు నోచుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోదాడ నియోజకవర్గంలోని చింతలపాలెం, అనంతగిరి అజ్మీర తండా, ద్వారకుంట వివిధ గ్రామాల రైతులు కాలిపోయిన విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లను మరమ్మతుల కోసం తీసుకురాగా ఆ ఆ ట్రాన్స్ఫార్మర్లను మరమ్మతుల కోసం దిగుమతి చేసుకోవడంలో నిర్లక్ష్యం వహించారు. అంతే కాకుండా దిగుమతి చేయాలంటే మీ లైన్మెన్ ద్వారా (టీ )సర్టిఫికెట్ తీసుకోరావాలన్నారు. కొత్తగా టీ సర్టిఫికెట్ ఏమిటి అనే కోణంలో రైతులు ఏమి చేయలేక ఎవరిని కలవాలో కలవలేక విద్యుత్ అధికారులు అందుబాటులో లేక రైతులు అయినటువంటి బండ్ల లక్ష్మీనారాయణ, కందుల వెంకట్రెడ్డి, రావూరి సైదాతో పాటు పలువురు రైతులు ఆరోపించారు. కాలిన ట్రాన్స్ఫార్మర్లను కార్యాలయానికి తరలించినప్పటికీ రెండు, మూడు రోజుల పాటు మరమ్మతులు చేపట్టడం లేదని వాపోయారు. దీంతో ఇటీవల నాట్లు వేసిన వరి పొలాలకు సకాలంలో నీరు అందక పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొంటోందని తెలిపారు. వర్షాలు సరిగా కురవని పరిస్థితిలో విద్యుత్ మోటార్లపైనే ఆధారపడాల్సి వస్తోందని, ట్రాన్స్ఫార్మర్లు పనిచేయకపోవడంతో సాగునీటి సరఫరా పూర్తిగా నిలిచిపోతోందని పేర్కొన్నారు. అధికారులు వెంటనే స్పందించి ట్రాన్స్ఫార్మర్లను మరమ్మతు చేసి విద్యుత్ సరఫరా పునరుద్ధరించాలని కోరారు.

# వర్షాభావ పరిస్థితుల్లో రైతులు పంట మార్పిడి పై దృష్టి సారించాలి..

**పంట మార్పిడిపై రైతులకు అవగాహన.. మండల వ్యవసాయ అధికారి బి.వెంకన్న..**



**కేసముద్రం, నేటిధాత్రి:** వర్షాభావ పరిస్థితుల్లో రైతులు పంట మార్పిడి పై దృష్టి సారించాలని మండల వ్యవసాయ అధికారి బి.వెంకన్న అన్నారు. శనివారం కేసముద్రం మండలంలోని నారాయణపురం గ్రామంలో గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలోగ్రామ సర్పంచ్ ధరావత్ యమున -సుమన్ నాయక్ అధ్యక్షతన వానకాలం 2026- 27 సీజన్లో సాగు చేసే పంటల మీద వాతావరణ శాఖ ఆదేశాల మేరకు పంట మార్పిడిపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా వ్యవసాయ అధికారి వెంకన్న మాట్లాడుతూ రాష్ట్రంలోఎల్నినో ప్రభావం వలన వాతావరణంలో పెను మార్పులు సంబంధించి సకాలంలో వర్షాలు కురిసే అవకాశం లేనందున, సెప్టెంబర్ మాసం చివరివరకు వర్షపాతం తక్కువగా నమోదు అయ్యే అవకాశం ఉన్నందున రైతు సోదరులు నీటి వసతి కింద సాగు చేసే వరిని తగ్గించి, బోర్ల కింద, బావుల కింద, చెరువుల కింద, వరి విస్తీర్ణాన్ని తగ్గించి పంట మార్పిడి విధానాన్ని అవలంబిం చలన్నారు. మెట్ట పంటలు, తక్కువ నీటితో సాగుచేసే పెసర, మినుములు,కందులు జొన్నలు, సజ్జలు, రాగులు, కూరగాయల పంటల సాగులను సాగు చేసి నష్ట నివారణ చర్యలు చేపట్టాలని తెలిపారు. వర్షాకాలం సీజన్ లో వేసినటువంటి పత్తి మొక్కజొన్న, పంటలకు అడపాదనప నీటి తడులు ఇచ్చి పంటలను రక్షించుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఉప సర్పంచ్ గుగులోత్ లచ్చు, ఇరిగేషన్ శాఖ అధికారి విజయ్ , మండల వ్యవసాయ విస్తరణ అధికారి రాజీవ్ లోచన్ ,వార్డు సభ్యులు జాటోత్ వీరన్న, బానోత్ నవీన నరేష్,గ్రామ పెద్దలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# డబుల్ బెడ్ రూములు ఇస్తానని నమ్మించి మోసం చేసిన నాయకులు



**మందమర్రి, నేటిధాత్రి:** డబుల్ బెడ్రూమ్ ఇళ్లను తమ ఆధీనంలోకి తీసుకుంటున్న బాధితులు మందమర్రిలో డబుల్ బెడ్రూమ్ ఇళు ల్లు ఇప్పిస్తామని నమ్మించి కొందరు దళారులు, నాయకులకు డబ్బులు ఇచ్చి మోసపోయినట్లు ఆరోపిస్తున్న బాధితులు ఆందోళనకు దిగారు. ఇళ్లు కేటాయించకపోవడంతో వారు స్వయంగా డబుల్ బెడ్రూమ్ ఇళ్ల నిర్మాణ ప్రాంతానికి చేరుకుని, ఆ ఇళ్లను తమ ఆధీనంలోకి తీసుకుంటున్నట్లు తెలిపారు. తాము దళారులకు,నాయకులకు డబ్బులు చెల్లించినప్పటికీ ఇళ్లు ఇవ్వలేదని, అందువల్ల తమకు న్యాయం జరిగే వరకు డబుల్ బెడ్రూమ్ ఇళ్లను ఖాళీ చేయబోమని బాధితులు హెచ్చరిస్తున్నారు.

# విద్యాలయాల్లో ర్యాగింగ్ చెయ్యడం చట్టపరంగా నేరం

**ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి శ్రీమతి కె.పూజ...**







**హన్మకొండ, నేటిధాత్రి:** విద్యాలయాల్లో వికృత చేష్టలు వద్దు, ర్యాగింగ్ రహిత సమాజం దిశగా అడుగులు వేద్దాం,హా అని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి శ్రీమతి కె.పూజ భట్టుపల్లి లోని, తెలంగాణ సాంఘిక సంక్షేమ నివాస మహిళా డిగ్రీ కళాశాల, వరంగల్హా కళాశాలలో వరంగల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో "ప్రోహిబిషన్ ఆఫ్ ర్యాగింగ్ యాక్ట్ – 1997" చట్టంపై శనివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించిన సందర్భంగా విద్యార్థులకు సూచించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా న్యాయమూర్తి కె.పూజ పాల్గొని, మాట్లాడుతూ "ర్యాగింగ్ అనేది విద్యార్థుల జీవితాలను చిన్నాభిన్నం చేసే ఒక సామాజిక భూతం అని పేర్కొన్నారు. ర్యాగింగ్ అనేది కేవలం వినోదం కోసం మొదలై, నేడు మానసిక, శారీరక హింసకు మరియు బలవన్మరణాలకు దారితీస్తోందని వాపోయారు.హా విద్యాసంస్థల్లో సీనియర్ విద్యార్థులు జూనియర్లను భయభ్రాంతులకు గురిచేయడం, అవమానించడం నేరంగా పేర్కొన్నారు. బాధితులు మానసిక ఒత్తిడికి లోనయి, చదువు మధ్యలోనే ఆపేయడం లేదా భయంతో ఆత్మహత్యలకు పాల్పడటం జరుగుతోంది అని వివరించారు. ర్యాగింగ్ను తీవ్రమైన నేరంగా పరిగణిస్తూ, ర్యాగింగ్కు పాల్పడినట్లు రుజువైతే విద్యాసంస్థల నుండి బహిష్కరించడమే కాకుండా, చట్టప్రకారం జైలు శిక్ష మరియు భారీ జరిమానా విధిస్తారు అని తెలిపారు. ర్యాగింగ్ కేసుల్లో చిక్కుకున్న విద్యార్థులకు భవిష్యత్తులో ప్రభుత్వ ఉద్యోగాలు, పాస్పోర్ట్ మరియు ఇతర ఉన్నత అవకాశాలు లభించవు అని హెచ్చరించారు. ప్రతీ కళాశాలలో ప్రత్యేక కమిటీలను తప్పనిసరిగా ఉండాలి అని తెలిపారు. ర్యాగింగ్ రహిత సమాజం కోసం విద్యార్థులు, తల్లిదండ్రులు, కళాశాల యాజమాన్యాలు బాధ్యతగా వ్యవహరించాలి అని కోరారు. ఈ కార్యక్రమంలో ఛీఫ్ లీగల్ ఏయిడ్ కౌన్సిల్ ఆర్.సురేష్, అసిస్టెంట్ లీగల్ ఏయిడ్ ఆర్. రజిని, కళాశాల ప్రిన్సిపాల్ డా.వి.రాధిక, అధ్యాపకులు, సిబ్బంది మరియు సుమారు 300 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమ కార్యక్రమాలతో ముందుకు వెళతాం

**పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ...**




మంచిర్యాల, నేటిధాత్రి: ప్రజా సంక్షేమ కార్యక్రమాలతో ముందుకు వెళ్తామని,ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా చర్యలు తీసుకుంటామని పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ అన్నారు. శనివారం జిల్లాలోని దండేపల్లి మండలం గూడెం గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకుహావిశాఖ చారిటబుల్ ట్రస్ట్ తరఫున మంజూరు చేసిన స్కూల్ బ్యాగులను జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్,జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు),జిల్లా విద్యాధికారి



పి.చంద్రయ్య లతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పార్లమెంట్ సభ్యులు మాట్లాడుతూ పాఠశాలలో 1వ తరగతి నుండి 10వ తరగతి వరకు చదువుతున్న 150 మంది విద్యార్థులకు విశాఖ చారిటబుల్ ట్రస్ట్ తరఫున స్కూల్ బ్యాగులను అందించడం జరుగుతుందని,ఈ క్రమంలో 110 మంది విద్యార్థులకు అందించడం జరిగిందని, మిగిలిన వారికి పంపిణీ చేస్తామని తెలిపారు. పాఠశాలలో విద్యార్థులు క్రింద కూర్చోకుండా విద్యార్థులకు సరిపడా బెంచీలు అందించేందుకు ట్రస్ట్ తరఫున చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వ విద్యాసంస్థలను బలోపేతం చేస్తూ ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందని,ప్రతి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించి నాణ్యమైన విద్య అందించడం జరుగుతుందని తెలిపారు. విశాఖ చారిటబుల్ ట్రస్ట్ తరఫున నీటి సౌకర్యం కల్పించేందుకు బోర్ వెల్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. విద్యార్థులు ఎంచుకున్న రంగంలో రాణించే విధంగా ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని,ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డించి వారితో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు,ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# కేసముద్రంలో 90 ఎకరాలప్రభుత్వ భూమిని పేదలకు పంచాలి

**ఆక్రమణలపై చర్యలు తీసుకుని ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలి.... ఎంసీపీఐ(సి) మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి మరిపెల్లి మొగిలి డిమాండ్...**



**కేసముద్రం, నేటిధాత్రి:** కేసముద్రం రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 399/1లో ఉన్న సుమారు 90 ఎకరాల ప్రభుత్వ భూమిని ప్రభుత్వం వెంటనే స్వాధీనం చేసుకుని ఇళ్లులేని నిరుపేదలకు ఇళ్ల స్థలాలుగా పంపిణీ చేయాలని భారత మార్క్సిస్ట్ కమ్యూనిస్టు పార్టీ (క్లాస్ స్ట్రగుల్) ఎంసీపీఐ(సి) మహబూబాబాద్ జిల్లా శాఖ కార్యదర్శి మరిపెల్లి మొగిలి, జిల్లా కమిటీ సభ్యుడు జాటోత్ బిచ్యా నాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం కేసముద్రం తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ ఎర్రయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కేసముద్రం గ్రామం--మహమూద్పట్నం సరిహద్దుల్లో, కేసముద్రం--తొర్రూరు ప్రధాన రహదారి వెంట ఉన్న ప్రభుత్వ భూమిని కొందరు దళారులు ఆక్రమించి, మొరం పోసి చదును చేసి అక్రమంగా ప్లాట్లుగా విక్రయిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ భూములను కాపాడాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారులపై ఉ ందన్నారు. ఆక్రమణలకు పాల్పడిన వారిపై వెంటనే క్రిమినల్ కేసులు నమోదు చేసి భూమిని స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. పేదలకు ఇళ్ల స్థలాల కోసం సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న కుటుంబాలకు ఈ భూమిని కేటాయించాలని కోరారు. భూ రికార్డులను సమగ్రంగా పరిశీలించి అన్ని ఆక్రమణలను తొలగించాలని, అక్రమంగా కొనుగోలు చేసే వారు మోసపోయే ప్రమాదం ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రభుత్వం స్పందించకపోతే ప్రజలను సమీకరించి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వ భూములను పరిరక్షించి అర్హులైన నిరుపేదలకు పంపిణీ చేయడం ద్వారా సామాజిక న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

# రాబిన్ హుడ్ ఆర్మీ స్వచ్ఛందసంస్థ ఆధ్వర్యంలో నిత్యవసర సరుకులు అందజేత



**కరకగూడెం, నేటిధాత్రి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కరకగూడెం మండలంలోని వలస ఆదివాసి గ్రామాలైన నీలాద్రి పేట గండి, అశ్వాపురం పాడు గ్రామాలలో సుమారు 70 కుటుంబాలకు రాబిన్ హుడ్ ఆర్మీ స్వచ్ఛంద సంస్థ హైదరాబాద్ దాతల సహకారంతో సోలార్ లైట్లు, మరియు చీరలు ,నిత్యవసర సరుకులు ఏడుల్ల బయ్యారం సిఐ వెంకటేశ్వరరావు మరియు కరకగూడెం ఎస్సై పివి నాగేశ్వరరావు సమక్షంలో అందజేయడం జరిగింది ఈ సందర్భంగా సిఐ ఎస్ఐ మాట్లాడుతూ వలస ఆదివాసి చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ సమాజంలో మంచి గుర్తింపుతో ఎదగాలన్నారు వలస ఆదివాసి తమ పిల్లలను ఉన్నంతంగా చదివించాలని సూచించారు ఈ కార్యక్రమంలో సీఐ మరియు ఎస్సై పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# జేపీఎల్ కన్వెన్షన్ హాల్లో వైభవంగా కేజీఆర్సీఈటీ 15వ గ్రాడ్యుయేషన్ డే వేడుకలు




**మొయినాబాద్, నేటిధాత్రి:** హైదరాబాద్లోని కేజీ రెడ్డి కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (కేజీఆర్సీఈటీ) తన 15వ గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాన్ని 2026 జూలై 18న జేపీఎల్ కన్వెన్షన్ హాల్లో ఘనంగా నిర్వహించింది. ఈ కార్యక్రమానికి మైక్రోసాఫ్ట్ సొల్యూషన్స్ టెక్నాలజీ ఓ ప్రొడక్ట్ లీడర్ శ్రీ సునీల్ సత్యవోలు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎస్. సాయి సత్యనారాయణ రెడ్డి అధ్యక్షతన, డైరెక్టర్ డా. రోహిత్ కందకట్ల సమక్షంలో అధ్యాపకులు, తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థులు మరియు పట్టభద్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డా. ఎస్. సాయి సత్యనారాయణ రెడ్డి పట్టభద్రులను అభినందిస్తూ, వృత్తి నైతిక విలువలను పాటించాలని జీవితాంతం నేర్చుకునే దృక్పథాన్ని అలవర్చుకోవాలని, సమాజంపై సానుకూల ప్రభావం చూపే బాధ్యతాయుత నాయకులుగా ఎదగాలని సూచించారు. డైరెక్టర్ డా. రోహిత్ కందకట్ల విద్యార్థులు ఆవిష్కరణ, నిరంతర అభ్యాసం మరియు వృత్తి నైపుణ్యాల ద్వారా ఉన్నత శిఖరాలను చేరాలని ఆకాంక్షించారు. ముఖ్య అతిథి శ్రీ సునీల్ సత్యవోలు నాయకత్వ లక్షణాలు, మార్పులకు అనుగుణంగా మలుచుకునే సామర్థ్యం, నైతిక విలువలు మరియు నిరంతర అభ్యాసం విజయానికి కీలకమని పేర్కొంటూ విద్యార్థులకు ప్రేరణనిచ్చారు. ఈ కార్యక్రమంలో బీ.టెక్., ఎం.టెక్., ఎంబీఏ కోర్సులకు చెందిన అర్హులైన విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేశారు. కళాశాల మరియు విభాగాల టాపర్లకు పతకాలు, ప్రశంసాపత్రాలు అందజేయగా, వినూత్న స్టార్టప్లను స్థాపించిన విద్యార్థి పారిశ్రామికవేత్తలను ప్రత్యేకంగా సత్కరించారు. అనంతరం ప్రిన్సిపాల్ పట్టభద్రులతో గ్రాడ్యుయేషన్ ప్రతిజ్ఞ చేయించి, వృత్తి నైతికత, సమాజ సేవ మరియు జీవితాంతం నేర్చుకునే సంకల్పాన్ని పునరుద్ఘాటించారు. ముఖ్య అతిథి సత్కారం, కృతజ్ఞతా ప్రసంగం, జాతీయ గీతాలాపన మరియు గ్రూప్ ఫోటోతో కార్యక్రమం ముగిసింది. ఈ కార్యక్రమాన్ని కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ (డేటా సైన్స్) విభాగాధిపతి ప్రొఫెసర్ ఎల్. గోవర్ధన్ కన్వీనర్గా సమర్థవంతంగా నిర్వహించగా, ఆయన ప్రణాళికాబద్ధమైన సమన్వయంతో కార్యక్రమం విజయవంతంగా సాగింది.

# గుగులోతు నగేష్కు ఘన స్వాగతం మొగుళ్ళపల్లి ఏఈగా బాధ్యతలు



మొగుళ్లపల్లి, నేటిధాత్రి: మొగుళ్ళపల్లి మండల విద్యుత్ శాఖ నూతన అసిస్టెంట్ ఇంజనీర్గా గుగులోతు నగేష్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. కార్యాలయంలోని తన చాంబర్లో ఆయన బాధ్యతలు చేపట్టారు. ఇంతకుముందు భూపాలపల్లి రూరల్లో ఇంజనీర్గా పనిచేసిన నగేష్ ఇటీవల ప్రమోషన్ పొంది మొగుళ్ళపల్లికి వచ్చారు. గతంలో ఇన్చార్జి ఏఈగా ఉన్న సంజయ్ గత నెలలో ప్రమోషన్పై భూపాలపల్లికి బదిలీ అయ్యారు. నూతన ఏఈగా బాధ్యతలు చేపట్టిన గుగులోతు నగేష్కు విద్యుత్ శాఖ సిబ్బంది శాలువాలతో ఘనంగా స్వాగతం పలికి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఫోర్మెన్ యాదగిరి, టీఆర్వీకెఎస్ జిల్లా నాయకులు శ్రీనివాస్ నాయక్, లైన్మెన్లు మచ్చ సత్యం, శ్రీనివాస్, అనిల్, ఏఎల్ఎంలు రమేష్, సంపత్ రావు, మహిపాల్, శంకర్, ఆన్ మ్యాన్డ్ వర్కర్లు వేముల కిరణ్ గౌడ్, నరేష్, యుగంధర్, స్పాట్ బిల్డర్లు ప్రసాద్, రాజ్ కుమార్ తో పాటు ఆర్టిజన్ కార్మికులు పాల్గొన్నారు.

# చెక్కు బౌన్స్ కేసుల పరిష్కారానికి ప్రత్యేక లోక్ అదాలత్




**ములుగు, నేటిధాత్రి:** ములుగు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్ పర్సన్ ఎస్. వి. పి సూర్య చంద్రకళ గారి ఆదేశాలసారం, ములుగు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లాకోర్టు ఆవరణలో తేదీ:18.07:2026 శనివారం రోజున స్పెషల్ లోక్ అదాలత్ నిర్వహించడం జరిగింది. ఈ లోక్ అదాలత్ లో చెక్-బౌన్స్ కేసులు పరిష్కరించబడినవి. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ టీ.కన్హయ్యలాల్,ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి జి.జ్యోత్స్న, అదనపు జూనియర్ సివిల్ జడ్జి మధులీక తేజ ,జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు బాలుగు చంద్రయ్య,ఉ పాధ్యక్షులు రంగోజు బిక్షపతి, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సభ్యులు మేకల మహేందర్, బానోత్ స్వామిదాస్ న్యాయవాదులు ఆర్.శ్రీనివాస్,రంగోజు సూర్యం, ఎండీ. మన్సూర్ అలీ, కే. ప్రణయ్ ప్రసాద్, విజయ్, ములుగు సీఐ సురేష్ మరియు వివిధ బ్యాంక్ మేనేజర్ లు పాల్గొన్నారు..

# అర్ధరాత్రి పిలుపు.. తెల్లవారేసరికి పండంటి బిడ్డ జననం



**ఆత్మకూరు ఎస్ పీహెచ్సీ వైద్యురాలు డాక్టర్ రమ్యకు ప్రశంసల జల్లు!**

**సూర్యాపేట, నేటిధాత్రి:** అత్యవసర సమయాల్లో స్పందిస్తూ విధి నిర్వహణలోనే కాకుండా విధులకు ఆవల కూడా రోగుల ప్రాణాలకు ప్రాధాన్యతనిస్తూ ఆత్మకూరు (ఎస్) ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్ సీ) వైద్యురాలు డాక్టర్ రమ్య మరోసారి తన నిబద్ధతను చాటుకున్నారు. శుక్రవారం తెల్లవారుజామున ఒక గర్భిణీ స్త్రీకి సంబంధించిన బంధువుల నుండి డాక్టర్ రమ్యకు అర్ధరాత్రి 2:00 గంటల సమయంలో ఫోన్ కాల్ వచ్చింది. పేషెంట్ పరిస్థితిని అర్థం చేసుకున్న ఆమె తక్షణమే స్పందించారు. వెంటనే ఆసుపత్రి సిబ్బందిని అప్రమత్తం చేసి, పేషెంట్ ఆసుపత్రికి చేరుకునేలోపే డెలివరీకి కావలసిన అన్ని ఏర్పాట్లతో సిబ్బందిని సిద్ధంగా ఉ ంచారు. వైద్యురాలితో పాటు సిబ్బంది సకాలంలో స్పందించడంతో తెల్లవారుజామున 5:15 గంటలకు సదరు మహిళ పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. ప్రస్తుతం తల్లి, నవజాత శిశువు ఇద్దరూ పూర్తి ఆరోగ్యంగా క్షేమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఈ ప్రసవ ప్రక్రియలో నర్సింగ్ ఆఫీసర్ మానస, ఏఎన్ఎంలు లక్ష్మి, సుజాత, మరియు ఆశా కార్యకర్త సుజాతలు పాల్గొని విజయవంతం చేశారు. విధులే కాకుండా అర్ధరాత్రి వేళలో కూడా రోగుల పిలుపునకు ఓపికగా స్పందించి, ఆత్మకూరు (ఎస్) పరిసర ప్రాంత ప్రజలకు అత్యవసర సమయాల్లో మెరుగైన వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ రమ్యను, ఆమె బృందాన్ని స్థానిక ప్రజలు, రోగుల బంధువులు మనస్ఫూర్తిగా అభినందిస్తున్నారు.

# ఘనంగా హరితహారం కార్యక్రమం



**తంగళ్ళపల్లి, నేటిధాత్రి:** తంగళ్ళపల్లి మండల కేంద్రంలో. శ్రీ సరస్వతి శుభోదయం ఇంగ్లీష్ మీడియం స్కూల్. తంగళ్ళపల్లిలో. హరితహారం కార్యక్రమం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఇట్టి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా. MEO. భూక్య..రాజు. పాల్గొని మాట్లాడుతూ. హరితహారం ప్రోగ్రాం జూలై 15.న. ప్రారంభం కావడం జరిగిందని ఇందులో భాగంగా. మన రాష్ట్రంలో 24% ఉన్నటువంటి అడుగుల్ని 33 శాతానికి పెంచడం. ముఖ్య ఉద్దేశమని. చెట్టు మానవ సర్వతో ముఖాభివృద్ధికి ఉపయోగపడుతుందని.. మండల తయారీలో కూడా చెట్లను ఉపయోగిస్తారని. ముఖ్యంగా మనకు స్వచ్ఛమైన గాలిని ఇస్తూ కార్బన్డయాక్సైడ్ తొలగిస్తాయి. అని పర్యావరణాన్ని మరిరిస్తూ కాలుష్యాన్ని ni పరిస్తాయని. మేఘాలను ఆకర్షించే లక్షణం ఒక చెట్టుకు మాత్రమే ఉందని. చెట్లను విచక్షణ రహితంగా నరకడం మూలంగా ప్రకృతిలో పర్యావరణ సామాన్యత దెబ్బతింటుందని. అందుచేత మనకు వర్షాలు పడట్లేదు. హ్యాపు లో. నీ శీ బాస్. మేఘాలను ఆకర్షించే లక్షణం ఒక చెట్టుకు మాత్రమే ఉందని. అందుచేతనే మనకు వర్షాలు పడట్లేదని. సేవ్. ఏ ట్రీ సేవ్. నేచర్. ప్లాంట్ టుడే. స్మైల్ టుమారో. సేవ్. ఎర్త్ సేవ్. నేచర్ సేవ్. సేఫ్ లైఫ్. అని స్లోగన్స్ చెప్పడం జరిగింది. అలాగే మీ ఇంటిలో ఏదైనా పండుగ. బర్త్. కార్యక్రమం జరుపుకున్నప్పుడు ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని తెలియజేస్తూ. భవిష్యత్తులో ఎదుర్కొనే సవాళ్లు. గురించి తెలియజేస్తూ హరితహారం యొక్క ప్రాముఖ్యత గురించి చెప్పడం జరిగిందని విద్యార్థిని విద్యార్థులు అందరూ కూడా చార్టు వాటి గురించి చెప్పడం జరిగిందని. ఏదైనా కార్యక్రమంలో భాగంగా మీ ఇంటిలో ఏదైనా మొక్కలు నాటలని చెప్పడం జరిగిందని. ఇట్టి కార్యక్రమంలో .(MEO). ప్రధానోపాధ్యాయులు కరస్పాండెంట్ ఉపాధ్యాయుల బృందం పాఠశాల సిబ్బందివిద్యార్థిని విద్యార్థులు అందరూ తదితరులు పాల్గొన్నారు

# విద్యార్థుల శ్రేయస్సుకై ప్రతిరోజూ గంటపాటు “నో ఫోన్ నో టీవీ” తీర్మానం



**మందమర్రి, నేటిధాత్రి:** విద్యార్థుల విద్యా ప్రగతి, క్రమశిక్షణ, కుటుంబ అనుబంధాలను మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, ఫిల్టర్ బెడ్, మందమర్రిలో నిర్వహించిన తల్లిదండ్రులు--ఉపాధ్యాయుల సమావేశం (పి. టి యం) ఒక వినూత్న తీర్మానం ఆమోదించబడింది. ఈ తీర్మానం ప్రకారం ప్రతిరోజూ సాయంత్రం 6:00 గంటల నుండి 7:00 గంటల వరకు “నో ఫోన్ -- నో టీవీ” సమయంగా పాటించాలని తల్లిదండ్రులు ప్రతిజ్ఞ చేశారు. ఈ ఒక గంట సమయంలో మొబైల్ ఫోన్లు ఉపయోగించకుండా, టెలివిజన్ చూడకుండా పూర్తిగా పిల్లలతో గడుపుతూ వారి ఇంటి పనులు, చదువులు, అభ్యాసంలో తోడ్పాటు అందించాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమం ద్వారా పిల్లలలో చదువుపై ఆసక్తి పెరగడంతో పాటు, కుటుంబ సభ్యుల మధ్య అనుబంధాలు బలపడతాయని, ఏకాగ్రత, క్రమశిక్షణ, బాధ్యతాయుతమైన అలవాట్లు పెంపొందుతాయని ఉపాధ్యాయులు మరియు తల్లిదండ్రులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు శ్రీనివాసాచారి, డా. భీంపుత్ర శ్రీనివాస్, ఉమాదేవి, రవి, లలిత గార్లు మరియు విద్యార్థుల తల్లిదండ్రులు ఉత్సాహంగా పాల్గొన్నారు

# సోనం వాంగ్చుక్ దీక్షకు టీఆర్పీ భూపాలపల్లి జిల్లా మద్దతు



**భూపాలపల్లి, నేటిధాత్రి:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా అధ్యక్షుడు రవి పటేల్ ఆధ్వర్యంలో సోనం వాంగ్చుక్ చేపట్టిన నిరాహార దీక్షకు సంఘీభావం తెలుపుతూ భూపాలపల్లిలోని అంబేద్కర్ చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రవి పటేల్ మాట్లాడుతూ, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఎన్ టిఏ ను పూర్తిగా రద్దు చేసి, దాని స్థానంలో నేషనల్ ఎడ్యుకేషన్ కమిషన్ ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ హక్కుల నేత, శాస్త్రవేత్త సోనం వాంగ్చుక్ గత 20 రోజులుగా నిరాహార దీక్ష కొనసాగిస్తున్నారని తెలిపారు. ఆయన ఆరోగ్యం రోజురోజుకు క్షీణిస్తున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడం అత్యంత బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 20వ తేదీ నుంచి పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో కాక్రోచ్ జనతా పార్టీ ఇచ్చిన “చలో సంసద్” పిలుపునకు తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర అధినేత ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న సంపూర్ణ మద్దతు ప్రకటించారని తెలిపారు. ఆయన పిలుపు మేరకు భూపాలపల్లిలో ఈ సంఘీభావ ర్యాలీ నిర్వహించి, సోనం వాంగ్చుక్ డిమాండ్లకు టీఆర్పీ పూర్తి మద్దతు ప్రకటించినట్లు రవి పటేల్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రైతులకు సకాలంలో ఎరువులు అందిస్తాం

## ఖరీఫ్‌కు ఎరువుల సరఫరాపై సమీక్షలో చైర్మన్ ముత్యాల కుమారస్వామి...



**దుగ్గొండి, నేటిధాత్రి:** ఖరీఫ్ సీజన్‌లో రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు సకాలంలో అందిస్తామని దుగ్గొండి వ్యవసాయ సహకార సొసైటీ చైర్మన్ రిటైర్డ్ ఏఎస్ఐ ముత్యాల కుమారస్వామి గౌడ్ అన్నారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు, ఇతర వ్యవసాయ అవసరాల సరఫరాపై దుగ్గొండి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పాలకవర్గ సమావేశంలో విస్తృతంగా చర్చించారు. శనివారం సంఘ కార్యాలయంలో చైర్మన్ ముత్యాల కుమారస్వామి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎరువులను సకాలంలో అందుబాటులో ఉంచేందుకు అన్ని చర్యలు చేపడుతున్నామని తెలిపారు. సహకార సంఘం ద్వారా రైతులకు అవసరమైన సేవలను పారదర్శకంగా, సమర్థవంతంగా అందించాలని అధికారులను ఆదేశించారు. రైతుల అవసరాలకు అనుగుణంగా ఎరువుల నిల్వలను సిద్ధంగా ఉంచి, సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చూడాలని సూచించారు. సమావేశంలో ఖరీఫ్ సీజన్ ఏర్పాట్లు, రైతులకు అందించాల్సిన సేవలు, సహకార సంఘ నిర్వహణకు సంబంధించిన పలు అంశాలపై పాలకవర్గ సభ్యులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఈసమావేశంలో సీఈఓ ఆరెల్లి బిక్షపతి, డైరెక్టర్లు కొలగాని రవి, జంగిలి రవి, పిండి అశోక్, తొర్రురు రామన్న, నాగుర్ల సునీత, బొల్లంపల్లి నర్సయ్య, తోకల మధుకర్ రెడ్డి, ఏఈఓ హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

# దూపదీప నైవేద్య అర్చకుల మండల అధ్యక్షుడిగా అఖిల్ సాయిశర్మ



**నెక్కొండ, నేటిధాత్రి:** భీమదేవరపల్లి మండల దూపదీప నైవేద్య అర్చకుల సంఘం నూతన అధ్యక్షుడిగా నెక్కొండకు చెందిన కీర్తిశేషులు బూరుగుపల్లి శివరామ్ శాస్త్రి సిద్ధాంతి కుమారుడు బూరుగుపల్లి అఖిల్ సాయిశర్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. భీమదేవరపల్లి మండల కేంద్రంలోని శ్రీ భీమేశ్వర ఆలయంలో శనివారం నిర్వహించిన మండల స్థాయి అర్చకుల సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు వాసుదేవ శర్మ ఆదేశాల మేరకు, జిల్లా అధ్యక్షుడు గణేష్ సిద్ధాంతి ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యక్షుడిగా గుడికందుల రమేషాచారి, కార్యదర్శిగా గుండ్ల శ్రీరామశర్మ, కోశాధికారిగా అనుముల ప్రవీణ్ శర్మతో పాటు కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. నెక్కొండకు చెందిన అఖిల్ సాయిశర్మ మండల అధ్యక్షుడిగా ఎన్నిక కావడం పట్ల నెక్కొండ మండలంలోని ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు, అర్చకులు, ఆధ్యాత్మిక వేత్తలు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

# వర్షపు నీటి సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

## మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ....



**రామకృష్ణాపూర్, నేటిధాత్రి:** కేంద్ర జల శక్తి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన జల్ సంచయ్ జన భాగీదారి 3.0 కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని క్యాతనపల్లి మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ మునిసిపల్ ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వర్షపు నీటి సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొంటూ, క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు, ప్రజాప్రతినిధులు, విద్యాసంస్థలు, వ్యాపార సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, యువత ఈ కార్యక్రమంలో చురుకుగా పాల్గొనాలని కోరారు. వర్షపు నీటిని ఒడిసిపట్టేందుకు ఇంకుడు గుంతల ఏర్పాటు, నీటి వృథా నివారణ, భూగర్భ జలాల పెంపు, చెరువుల పరిరక్షణ, ప్రతి ఇంటిలో వర్షపు నీటి సంరక్షణ వ్యవస్థల ఏర్పాటుకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ప్రతి ఇంటి వద్ద వర్షపు నీటి సంరక్షణ చర్యలు చేపట్టడం ద్వారా భూగర్భ జలమట్టం పెరగడంతో పాటు భావితరాలకు నీటి భద్రతను కల్పించవచ్చని, పర్యావరణ పరిరక్షణకు కూడా దోహదపడుతుందని పేర్కొన్నారు. నీటి ప్రతి బొట్టు అమూల్యమని, భవిష్యత్ తరాలకు నీటి కొరత రాకుండా చూడాలంటే ప్రతి పౌరుడు బాధ్యతతో వ్యవహరించి నీటి సంరక్షణలో భాగస్వామి కావాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల సహకారంతోనే జల్ సంచయ్ జన భాగీదారి--3.0 కార్యక్రమం విజయవంతమవుతుందని, అందరూ స్వచ్ఛందంగా పాల్గొని నీటి సంరక్షణ ఉద్యమాన్ని విజయవంతం చేయాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. ”నీటిని ఆదా చేద్దాం -- భావితరాలకు భద్రత కల్పిద్దాం” అనే సందేశాన్ని ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని ఆయన పిలుపునిచ్చారు.

# మల్లంపల్లిలో గ్రామీణ వ్యవసాయ కృషి అనుభవ కార్యక్రమం



## పాల్గొన్న సర్పంచ్ ల్యాద శ్యామ్ రావు....

**మల్లంపల్లి, నేటిధాత్రి:** మల్లంపల్లి మండల కేంద్రంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో గ్రామీణ వ్యవసాయ కృషి అనుభవ (ఆర్ఏడబ్ల్యూఈ) కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మల్లంపల్లి గ్రామ సర్పంచ్ ల్యాద శ్యామ్ రావు పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. వ్యవసాయ విద్యార్థులు గ్రామీణ రైతులతో మమేకమై క్షేత్రస్థాయిలో వ్యవసాయ పరిస్థితులను అధ్యయనం చేయడం ద్వారా వాస్తవ సమస్యలను తెలుసుకునే అవకాశం లభిస్తుందని ఆయన తెలిపారు. రైతులు వినియోగిస్తున్న ఎరువులు, పంటలను ఆశించే చీడపీడలు, ఆధునిక సాగు పద్ధతులు, జీవ ఎరువుల తయారీ, డ్రోన్ టెక్నాలజీ వంటి ఆధునిక వ్యవసాయ సాంకేతికతలపై విద్యార్థులు ప్రత్యక్షంగా అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. మల్లంపల్లి గ్రామానికి వచ్చిన వ్యవసాయ విద్యార్థులకు గ్రామపంచాయతీ తరఫున అవసరమైన అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని సర్పంచ్ ల్యాద శ్యామ్ రావు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మల్లంపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చెరుకుపల్లి శ్రీకాంత్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి దేవేందర్ చారి, జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యుడు చిట్టి రెడ్డి రాంరెడ్డి, వనమ శ్రీనివాస్, మూల వెంకన్న, కొలిపాక శ్రీనివాస్, షాపూర్ మహేందర్, మమ్మద్ మోసిన్, ఇటుకల కర్ణాకర్, ఇమ్మడి బిక్షపతి, వ్యవసాయ విశ్వవిద్యాలయ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# మొక్కలు పంపిణీ చేసిన సర్పంచ్



**నడికూడ, నేటిధాత్రి:** మండలంలోని రాయపర్తి గ్రామంలో వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా గ్రామ సర్పంచ్ రాజా జగత్ ప్రకాష్ ఆధ్వర్యంలో ఇంటింటికి ఆరు మొక్కలు పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. సందర్భంగా మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ప్రతి కుటుంబం కనీసం ఆరు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కోరారు. నేడు నాటిన మొక్కలే రేపటి తరాలకు స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన వాతావరణం, పచ్చదనాన్ని అందిస్తాయని పేర్కొన్నారు. మొక్కలను నాటడమే కాకుండా అవి పెరిగే వరకు సంరక్షించాలని గ్రామ ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ చేలుమల్ల సురేందర్ రెడ్డి, పంచాయితీ కార్యదర్శి సంధ్య, ఫీల్డ్ అసిస్టెంట్ ఏరుకొండ యుగేందర్, మహిళా సమాఖ్య సిఏలు ప్రియాంక, కావ్య, పంచాయతీ కారోబార్ కోడెపాక సురేష్, తదితరులు పాల్గొన్నారు.

# 20న ప్రజావాణి కార్యక్రమం రద్దు: కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల, నేటిధాత్రి:** ఈ నెల 20వ తేదీ సోమవారం నిర్వహించాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు.

ఉట్నూర్‌లోని వీ ఎం ఆర్పీ సమావేశ మందిరంలో ఈ నెల 20న ఉమ్మడి జిల్లా అధికారులతో రాష్ట్ర ఆబ్కారీ, మద్యనిషేధ, పర్యాటసాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సమీక్ష సమావేశం నిర్వహించనున్న నేపథ్యంలో, నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు ఆయన ఒక ప్రకటనలో వెల్లడించారు. ప్రజలు, దరఖాస్తుదారులు ఈ విషయాన్ని గమనించి అధికారులకు సహకరించాలని జిల్లా కలెక్టర్ కోరారు.

# కన్నం సౌందర్య భూములను ఎవరికి పట్టా చేయవద్దు



**మల్లంపల్లి, నేటిధాత్రి:** మల్లంపల్లి మండలంలోని మహమ్మద్ గౌస్ పల్లి గ్రామానికి చెందిన నిరుపేద దళితురాలు కన్నం సౌందర్య పేరు మీద వివిధ గ్రామాలలో పట్టా భూములు ఉన్నాయని ఆమెకు గాని ఆమె కుటుంబీకుల గాని తెలియకుండా ఎవరికి ఈ భూములను పట్టా చేయవద్దని అని ప్రజా సంఘాల జేఏసీ హన్మకొండ జిల్లా చైర్మన్ మాదాసి సురేష్, ములుగు జిల్లా చైర్మన్ ముంజాల బిక్షపతి గౌడ్, ప్రముఖ న్యాయవాది అసైన్ భూమి సమితి అధ్యక్షుడు కలకోటి మహేందర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం డిప్యూటీ తహసిల్దార్ మమతకు బాధిత కుటుంబీకులతో కలిసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ కన్నం సౌందర్య పేరు మీద మండలంలోని చాలా గ్రామాల్లో విలువైన భూములు ఉన్నప్పటికీ వారు ఆ భూములను ఎవరికి అమ్ముకోలేదని ఈ భూములను కాజేయాలని కుట్రతో కొందరు తప్పుడు పత్రాలు సృష్టించి సాదా బైనామా కింద దరఖాస్తులు చేసుకున్నట్లు తమ దృష్టికి వచ్చిందని అన్నారు. కావున ఆ దరఖాస్తులను తిరస్కరించి సదరు భూములను కన్నం సౌందర్యతో పాటు ఆమె కుటుంబీకుల మీద పట్టా చేసి, పట్టాదారు పాసుపుస్తకాలు జారి చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రజాసంఘాల మాదాసు జితేందర్, నల్లబెల్లి మేఘంతో పాటు బాధిత కుటుంబీకులు పాల్గొన్నారు.

# ఎస్ఆర్కే పాఠశాలలో ఘనంగా గోరింటాకు ఫెస్టివల్ డే..



**రామకృష్ణాపూర్, నేటిధాత్రి:** గోరింటాకులో అనేకమైనటువంటి ఔషధ ప్రయోజనాలు ఉన్నాయని రామకృష్ణాపూర్ ఎస్ఆర్కే పాఠశాల కరస్పాండెంట్ పెద్దపల్లి ఉప్పలయ్య అన్నారు. పాఠశాలలో గోరింటాకు ఫెస్టివల్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప్పలయ్య మాట్లాడుతూ అరికాళ్ళు, అరి చేతులకు గోరింటాకు పెట్టుకోవడం వల్ల శరీరంలో ఉన్న అధిక వేడిని తగ్గిస్తుందని తెలిపారు. వర్షాకాలంలో వచ్చే చర్మ సమస్యలు, వెళ్ళమధ్య ఇన్ఫెక్షన్లను రాకుండా నిరోధిస్తుందన్నారు . అలాగే కీళ్ల నొప్పులు, తిమ్మిర్లు నియంత్రించడంలో గోరింటాకు ఆయుర్వేద ఔషధముల ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ వేడుకల్లో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# బీసీ బాలికల వసతి గృహంలో సీట్లు పెంచాలి



## ఏబీవీఎస్ఎఫ్, బీఆర్ఎస్వీ, ఏఐఎఫ్‌డీఎఫ్ సంఘాల డిమాండ్....

**నర్సంపేట, నేటిధాత్రి:** నర్సంపేట ప్రభుత్వ బీసీ బాలికల కళాశాల వసతి గృహంలో విద్యార్థినులకు సరిపడా సీట్లు పెంచాలని ఏబీఎస్ఎఫ్, బీఆర్ఎస్వీ, ఏఐఎఫ్‌డీఎఫ్ విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు బొట్ల నరేష్, సదిరం వినయ్ మాట్లాడుతూ.. నర్సంపేట డివిజన్‌లోని వివిధ మండలాలకు చెందిన ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థినులు డిగ్రీ, బీటెక్, బీ.ఫార్మసీ తదితర ఉన్నత విద్యా కోర్సుల్లో ప్రవేశాలు పొందుతున్నప్పటికీ, ప్రభుత్వం నిర్వహిస్తున్న బీసీ బాలికల కళాశాల వసతి గృహంలో సరిపడా సీట్లు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వసతి గృహంలో సీట్లు లేకపోవడంతో అనేక మంది విద్యార్థినులు ప్రతిరోజూ తమ గ్రామాల నుంచి నర్సంపేట పట్టణానికి రాకపోకలు సాగిస్తూ విద్యను కొనసాగించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. మరికొందరు వసతి గృహంలో ప్రవేశం కోసం వెళ్లగా ఇప్పటికే ప్రవేశాలు పూర్తయ్యాయని అధికారులు చెప్పడంతో వారు నిరాశకు గురవుతున్నారని పేర్కొన్నారు. ఈ సమస్యను జిల్లా కలెక్టర్ వెంటనే పరిశీలించి, బీసీ బాలికల వసతి గృహంలో సీట్ల సంఖ్యను పెంచి అర్హులైన విద్యార్థినులందరికీ వసతి కల్పించి న్యాయం చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు ప్రవళిక, రమ్య, సుమలత, శ్రీవాణి, భవిత, శ్రీ, కావ్య, భాగ్యలక్ష్మి, మంజుల, సప్న తదితరులు పాల్గొన్నారు.

# దండు కదిలే... పటాన్చెరు గులాబీ దండు కదిలే..



## పటాన్చెరు గడ్డపై గులాబీ జెండా హోరు..యువ సంగ్రామ సదస్సుకు కదిలిన పటాన్చెరు గులాబీ దండు..ఎమ్మెల్యే జీఎంఆర్ నాయకత్వంలో.. 1200 ల వాహనాల్లో తరలి వెళ్లిన గులాబీ శ్రేణులు..జెండా ఊపి ర్యాలీ ప్రారంభించిన ఎమ్మెల్యే జీఎంఆర్..పల్లెలు, పట్టణాల నుండి కదం తొక్కిన నిరుద్యోగులు, బిఆర్ఎస్ కార్యకర్తలు.. నిరుద్యోగుల గొంతు కోసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయి..యూత్ డిక్లరేషన్ పేరుతో యువత భవిష్యత్తుకు చరమగీతం పాడారు..2028లో ఎగిరేది గులాబీ జెండాయే..పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి..



**పాటన్‌చేరు, నేటిధాత్రి:** అసెంబ్లీ ఎన్నికల సమయంలో నిరుద్యోగ యువతకు లక్షల ఉద్యోగాలు ఇస్తామంటూ యూత్ డిక్లరేషన్ ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. నేడు జాబ్ క్యాలెండర్ విడుదల చేయమంటే ఎండ్రిన్ తాగి చావాలంటూ వ్యాఖ్యలు చేస్తోందని.. త్వరలోనే కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పడంతో పాటు.. 2028 ఎన్నికల్లో తిరిగి గులాబీ జెండా ఎగరం ఖాయమని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. భారత రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) ఆధ్వర్యంలో హైదరాబాద్ సరూర్ నగర్ స్టేడియం వేదికగా ఏర్పాటు చేసిన యువ సంగ్రామ సదస్సుకు పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి నేతృతంలో 1200 వాహనాల్లో గులాబీ శ్రేణులు బయలుదేరి వెళ్లాయి. శనివారం ఉదయం పటాన్చెరు డివిజన్ పరిధిలోని జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్ వద్ద ఏర్పాటుచేసిన ర్యాలీని జీఎంఆర్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం పటాన్చెరు పురవీధుల గుండా ఓఆర్ఆర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే జీఎంఆర్ మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరంలోనే 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని స్వయానా కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకురాలు ప్రియాంక గాంధీ 2023 లో సరూర్ నగర్ స్టేడియం వేదికగా యూత్ డిక్లరేషన్ ప్రకటించారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటనను నమ్మి యువత, నిరుద్యోగులు ఓటు వేసి అధికారం అప్పగించి రెండున్నర సంవత్సరాలు గడుస్తున్న.. జాబ్ క్యాలెండర్ విడుదల చేయడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ఓటు కొట్టు.. జాబ్ పట్టు అని ప్రగల్బాలు పలికిన సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం.. నేడు ఉద్యోగాలు ఏవని ప్రశ్నిస్తున్న నిరుద్యోగులను ఎండ్రిన్ తాగి చావాలంటూ వ్యాఖ్యలు చేయడం ప్రభుత్వ దురహంకారానికి అర్థం పడుతుందని విమర్శించారు. జాబులు నింపడంలో విఫలమైనా రేవంత్ రెడ్డి. రాహుల్ గాంధీ కి సుట్ కేసులు పంపడంలో గోల్డ్ మెడల్ సాధిస్తున్నారని ఎద్దేవా చేశారు. అరచేతిలో స్వర్గం చూపించి అందలమెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వానికి.. ప్రజలు బుద్ధి చెప్పే రోజులు దగ్గర పడ్డాయని.. 2028లో తిరిగి కెసిఆర్ నాయకత్వంలో ప్రభుత్వం ఏర్పాటు చేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. యువత, విద్యార్థి, నిరుద్యోగులకు సువర్ణ యుగం రాబోతోందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, సీనియర్ నాయకులు, యువత, విద్యార్థి, మహిళ, కార్మిక విభాగాల ప్రతినిధులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# బీజేపీ అర్బన్ మండల కార్యవర్గ సమావేశం

## తెలంగాణలో బీజేపీ డబుల్ ఇంజన్ ప్రభుత్వం రావడం ఖాయం.... డా.పగడాల కాళీ ప్రసాద్ రావు...



**పరకాల, నేటిధాత్రి:** భారతీయ జనతా పార్టీ పరకాల అర్బన్ మండల కార్యవర్గ సమావేశం మండల అధ్యక్షుడు గాజుల నిరంజన్ అధ్యక్షతన నిర్వహించారు. పార్టీ జెండా ఆవిష్కరణతో సమావేశాన్ని ప్రారంభించారు.

ఈ కార్యక్రమానికి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, పరకాల నియోజకవర్గ కాంటెస్టెండ్ ఎమ్మెల్యే డా.పగడాల కాళీ ప్రసాద్ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను తీవ్ర నిరాశకు గురిచేసిందని విమర్శించారు.ఎన్నికలు ఎప్పుడు వచ్చినా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు ఓటుతో గద్దె దించేందుకు సిద్ధంగా ఉన్నారని,రాష్ట్రంలో బీజేపీ డబుల్ ఇంజన్ ప్రభుత్వం ఏర్పడటం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు.రైతులు,నిరుద్యోగులు,మహిళలు,యువతతో పాటు అన్ని వర్గాల ప్రజలను ప్రభుత్వం మోసం చేసిందని విమర్శించారు.ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం ప్రచారాలకే పరిమితమైందని ఎద్దేవా చేశారు.అలాగే పార్టీ కార్యకర్తలు బూత్ స్థాయి నుంచే పార్టీని మరింత బలోపేతం చేయాలని,ప్రతి గ్రామం,ప్రతి వార్డులో ప్రజా సమస్యలపై పోరాటాలను ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు.కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ,అభివృద్ధి పథకాలను ఇంటింటికీ తీసుకెళ్లి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రైతు భరోసా నిధులను అర్హులైన రైతుల ఖాతాల్లో జమ చేయాలని,ఖరీఫ్ సీజన్‌లో రైతులకు అవసరమైన ఎరువులను సమృద్ధిగా అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు.రైతులను ఇబ్బందులకు గురిచేసే విధానాలను వెంటనే విరమించుకోవాలని హెచ్చరించారు.ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకున్న ఏకైక ప్రభుత్వం కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వమేనని,తెలంగాణలో కూడా అభివృద్ధి,పారదర్శక పాలన కోసం ప్రజలు బీజేపీకి అవకాశం కల్పిస్తారని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

**ఓటరు సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి.....** బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజ్ పురోహిత్ జయంతీలాల్ మాట్లాడుతూ ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు,బీఎల్ఏ-2లు పూర్తి బాధ్యతతో పనిచేయాలని కోరారు.ఒక్క అర్హుడైన ఓటరు కూడా జాబితా నుంచి తొలగిపోకుండా చూసి,ప్రతి అర్హుడి పేరును నమోదు చేసేలా కృషి చేయాలని సూచించారు.




ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు బెజ్జంకి పూర్ణచారి,ఆకుల లావణ్య శ్రీధర్,పీఏసీఎస్ వైస్ చైర్మన్ చందుపట్ల రాజేందర్ రెడ్డి,జిల్లా కోశాధికారి ఎర్రం రామన్న,నాయకులు దగ్గు విజేందర్ రావు,పట్టణ ఉపాధ్యక్షుడు మిడిదొడ్డి నరేష్,పట్టణ ప్రధాన కార్యదర్శులు సంఘం పురుషోత్తం,పాలకుర్తి తిరుపతి, నాయకులు వేముల సదారాణి ఆంజనేయులు,మార్త బిక్షపతి,మార్త రాజభద్రయ్య,దంచనాథుల కిరణ్,కుంటమల్ల గణేష్,ముత్యాల దేవేందర్,బీరం రాజిరెడ్డి,దాసరి వెంకటేశ్వర్లు,మరాఠి నర్సింగరావు,ఆకుల రాంబాబు,ఉడుత చిరంజీవి,పిట్ట కిషోర్,కాగితపు చంద్రమోహన్ చారి,సంగా నరేష్,సాదా మధుకర్,బొచ్చు నరేందర్,తాడిశెట్టి రజనీకాంత్,సారంగ నరేష్,దామ సతీష్,రంతు కుమార్,మంతెన సంతోష్‌తో పాటు పలువురు బీజేపీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# మోడల్ స్కూళ్లలో నాణ్యమైన విద్యతో పెరుగుతున్న విశ్వాసం

## పిల్లల చదువుపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలి....టిజీఎంఎస్ ప్రిన్సిపాల్ బుచ్చన్న....



**మంచిర్యాల, నేటిధాత్రి:** మంచిర్యాల పట్టణంలోని రాజీవ్ నగర్ తెలంగాణ మోడల్ స్కూల్ (టీజీఎంఎస్)లో శనివారం తల్లిదండ్రుల సమావేశాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రిన్సిపాల్ బుచ్చన్న మాట్లాడుతూ ప్రభుత్వ విద్యను మరింత బలోపేతం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతున్నందున మోడల్ పాఠశాలలపై తల్లిదండ్రుల్లో విశ్వాసం పెరిగిందన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ మౌలిక వసతులు,నాణ్యమైన విద్య,హాస్టల్ సౌకర్యాలు,పోషకాహార భోజనం,రవాణా వంటి అంశాల్లో ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నందున మోడల్ స్కూళ్లలో విద్యార్థుల చేరికలు గణనీయంగా పెరిగాయని తెలిపారు.ప్రైవేట్ పాఠశాలలకు ఏమాత్రం తీసిపోని విధంగా టీజీఎంఎస్‌లో బోధన కొనసాగుతోందని,విద్యతో పాటు క్రీడలు,సైన్స్ ప్రాజెక్టులు,డిజిటల్ లెర్నింగ్,వ్యక్తిత్వ వికాసం,కమ్యూనికేషన్ నైపుణ్యాలు,పోటీ పరీక్షలకు అవసరమైన మౌలిక అవగాహన కల్పించే కార్యక్రమాలను కూడా నిర్వహిస్తున్నామని వివరించారు.విద్యార్థుల సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా ఉపాధ్యాయులు నిరంతరం కృషి చేస్తున్నారని,తల్లిదండ్రులు కూడా తమ పిల్లల చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ పాఠశాలతో సమన్వయం చేసుకోవాలని సూచించారు.ప్రభుత్వ పాఠశాలల్లో లభిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా తల్లిదండ్రులు పాఠశాలలో కల్పిస్తున్న విద్యా ప్రమాణాలు, హాస్టల్ భోజనం,ఇతర సౌకర్యాలపై సంతృప్తి వ్యక్తం చేస్తూ,విద్యార్థుల అభివృద్ధికి ఎల్లప్పుడూ సహకరిస్తామని హామీ ఇచ్చారు.



# మోకుదెబ్బ రాష్ట్ర కార్యదర్శిగా గడ్డం సమ్మయ్య గౌడ్



**మహబూబాబాద్, నేటిధాత్రి:** గౌడ జన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ రాష్ట్ర కార్యదర్శిగా మహబూబాబాద్ జిల్లా ముడుపుగల్ గ్రామానికి చెందిన గడ్డం సమ్మయ్య గౌడ్‌ను సంస్థ జాతీయ అధ్యక్షుడు అమరవేణి నర్సాగౌడ్, జాతీయ ప్రధాన కార్యదర్శి రాగుల సిద్ధిరాములు గౌడ్ నియమించారు.

ఈ సందర్భంగా గడ్డం సమ్మయ్య గౌడ్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి రాష్ట్ర కార్యదర్శిగా నియమించిన జాతీయ అధ్యక్షుడు అమరవేణి నర్సాగౌడ్, జాతీయ ప్రధాన కార్యదర్శి రాగుల సిద్ధిరాములు గౌడ్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేష్ గౌడ్, జాతీయ ప్రధాన కార్యదర్శి కొండాపురం బాలరాజు గౌడ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి ముత్యం నరసింహులు గౌడ్‌లకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.అలాగే తనను ప్రోత్సహించిన మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు ముంజాల రాజేందర్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి బూడిగె భద్రసేన గౌడ్, జిల్లా కార్యదర్శి మెరుగు మల్లేశం గౌడ్, అధికార ప్రతినిధి లింగాల వీరభద్రం గౌడ్, కురవి మండల అధ్యక్షుడు తండా నాగేందర్ గౌడ్, రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ కందుల శ్రీనివాస్ గౌడ్ తదితర నాయకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.రాష్ట్ర కార్యదర్శిగా తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానని, గౌడల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడతానని, గౌడల ఐక్యత కోసం కృషి చేస్తానని సమ్మయ్య గౌడ్ పేర్కొన్నారు. అలాగే గుర్తింపు కార్డు లేని ప్రతి గీతా కార్మికుడికి గుర్తింపు కార్డు అందేలా కృషి చేయడంతో పాటు, రాష్ట్రవ్యాప్తంగా సంస్థ కమిటీల నిర్మాణాన్ని మరింత బలోపేతం చేసేందుకు కట్టుబడి పనిచేస్తానని తెలిపారు.



# వారం రోజుల కిందటే చలివాగు నీళ్ళు విడుదల



## చౌకబారు విమర్శలు మానుకోవాలి....జోగంపల్లి సర్పంచ్ మారబోయిన ప్రభాకర్...

**శాయంపేట, నేటిధాత్రి:** శాయంపేట మండలం జోగం పల్లె గ్రామంలోని చలివాగు ప్రాజెక్టు నీరు గత వారం రోజుల కిందటే చలివాగు నుండి నీటిని విడుదల చేయడం జరిగింది .బీఆర్ఎస్ నాయకులకు కనీస అవగా హన లేకుండా మాట్లాడడం విడ్డూరమని జోగంపల్లి సర్పం చ్ మారబోయిన ప్రభాకర్ అన్నారు. చలివాగు గేట్లువ ఎత్తాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేసిన నేపథ్యంలో చలివాగు ప్రాజెక్టు ఉన్న జోగం పల్లి శివారు సర్పంచ్ ప్రభాకర్ శనివారం మాట్లాడారు ప్రాజె క్టు ఆయకట్టు రైతులకు ఇబ్బంది తలెత్తకూడదని అధికారులతో మాట్లాడి



నీటి ని ఎత్తివేసే మోటార్ ను బంద్ చేయించిన ఘనత భూపాల పల్లి ఎమ్మెల్యే గండ్ర సత్య నారాయణరావు అన్నారు. రైతులు ధర్నా చేసినప్పుడు 10 అడుగుల నీరు ఉంటే మోటార్ బంద్ చేయడం వల్ల ప్రస్తుతం 13 అడుగులకు పెరి గిందన్నారు. రైతు పక్షపాతి ఎమ్మెల్యే గండ్ర సత్తన్న స్పష్టం చేశారు. తూము నుండి నారుమల్లకు నీరు అందుతు న్నాయని, పంటలకు నీరు అందేవిధంగా మున్ముందు ప్రాజెక్టు లో లెవెల్స్ పెరిగే విధంగా చర్యలు తీసుకుంటా రని అన్నారు. బీఆర్ఎస్ నాయకులు చౌకబారు విమర్శలు మానుకోవాలని హితవు పలికారు. రైతులతో రాజకీయం తగదని అన్నారు. ప్రతిపక్షంగా సమస్యలపై ప్రశ్నిచాలే తప్ప అవగాహన లేకుండా మాట్లాడడం సరికా దన్నారు. ఈ కార్యక్రమంలో కౌటం లక్ష్మీనారాయణ రాజేం దర్ అశోక్ గణేష్ ,రైతులు పాల్గొన్నారు.

# ఉచిత జనరల్ మెడిసిన్ మెగా ఆరోగ్య శిబిరం



**వరంగల్, నేటిధాత్రి:** ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలను అందించాలనే లక్ష్యంతో అపోలో రీచ్ ఎన్ఎస్ఆర్ హాస్పిటల్, వరంగల్ ఆధ్వర్యంలో ప్రముఖ జనరల్ ఫిజీషియన్ ఢ డయాబెటాలజిస్ట్ డా. ఎన్. రాజిరెడ్డి సేవలతో జూలై 21, 22, 23 తేదీలలో ప్రత్యేక ఉచిత జనరల్ మెడిసిన్ ఆరో గ్య శిబిరం నిర్వహించనున్న ట్లు ఆసుపత్రి యాజమాన్యం వెల్లడించింది. ఈ శిబిరంలో మధుమేహం (డయాబెటిస్), అధిక రక్తపోటు (బీపీ), థైరా యిడ్ వ్యాధులు, వైరల్ జ్వ రాలు, సాధారణ ఆరోగ్య సమస్యలు వంటి అనారోగ్యా లపై నిపుణుల వైద్య పరీక్షలు, సలహాలు అవసరమైన చికిత్స అందించబడుతుంది.ఆరోగ్య శిబిరంలో భాగంగా సీబీపీ (CBP), రక్తంలో చక్కెర పరీక్ష (RBS/HBS), సీరమ్ క్రియాటినిన్ పరీక్షలను పూర్తి గా ఉచితంగా నిర్వహిస్తారు. అలాగే లిపిడ్ ప్రొఫైల్, థైరా యిడ్ ప్రొఫైల్, హెచ్‌బీఏ1సీ (HbA1c) వంటి ముఖ్యమైన రక్త పరీక్షలపై 50% ప్రత్యేక రాయితీ కల్పిస్తున్నారు.మధుమేహం, బీపీ, థైరా యిడ్ వంటి వ్యాధులు ప్రారంభ దశలో పెద్దగా లక్షణాలు కనిపించకపో యినా, నిర్లక్ష్యం చేస్తే గుండె, మూత్రపిండాలు, కంటి చూపు వంటి కీలక అవయవాలపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని వైద్యులు సూచిస్తు న్నారు. అందువల్ల ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకో వడం ద్వారా వ్యాధులను ముందుగానే గుర్తించి సమ యానికి చికిత్స పొందాలని సూచించారు.ఈ శిబిరం జూలై 21, 22, 23 తేదీలలో ఉదయం 10.00 గంటల నుంచి మధ్యాహ్నం 3.00 గంటల వరకు అపోలో రీచ్ ఎన్ఎస్ఆర్ హాస్పిటల్, కొత్తపేట క్రాస్ రోడ్, ఆరెపల్లి, వరంగల్ లో నిర్వహిస్తారుప్రజలందరూ ఈ అరుదైన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ ఆరోగ్యాన్ని పరీక్షించుకోవాలని ఆసుపత్రి యాజమాన్యం కోరింది.అపాయింట్‌మెంట్ ఫోన్ నెంబర్: 9459875555.

# రీ-సర్వేను పకడ్బందీగా పూర్తి చేయాలి



## జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి. ఎస్ లత...

**పెగడపెల్లి, నేటిధాత్రి:** శనివారం రోజున పెగడపెల్లి మండలం నరసింహునిపేట గ్రామంలో నిర్వహించిన భూముల రీ - సర్వే అవగాహన సదస్సు (గ్రామ సభ )లో పాల్గొన్న జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి. ఎస్ లతరీ - సర్వే ప్రక్రియను ప్రణాళికాబద్ధంగా, పకడ్బందీగా చేపట్టి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భూముల రీ-సర్వే కార్యక్రమాన్ని చేపడుతోందని తెలిపారు. ఈ రీసర్వేలో భాగంగా గ్రామ సరిహద్దులను నిర్ధారించి, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, అత్యాధునిక సర్వే పరికరాల సహాయంతో వ్యవసాయ భూములను సర్వే చేయనున్నట్లు చెప్పారు. సర్వే పూర్తయిన అనంతరం భూ వివరాలను ప్రజలకు ప్రకటిస్తామని పేర్కొన్నారు. గ్రామస్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పారదర్శకంగా రీ సర్వే ప్రక్రియను నిర్వహించాలని, ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు యుద్ధ ప్రాతిపదికన పనులను పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. మొదట గ్రామ బౌండరీ పై లైసెన్సుడ్ సర్వేయర్లు, మండల సర్వేలు కలిసి రీ సర్వే చేస్తారని. తర్వాత ఒక్కొక్క రైతు వారిగా రీ సర్వే నిర్వహిస్తారని తెలిపారు. జగిత్యాల జిల్లాలో మొదటి విడతగా 70 గ్రామాల్లో రీ సర్వే చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్, సర్వేయర్ లు, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# బాలాజీ టెక్నోస్కూల్ లో విద్యార్థుల మాక్ ఎలక్షన్స్



**నర్సంపేట, నేటిధాత్రి:** నర్సంపేట మండలంలోని లక్నేపల్లిలో గల బాలాజీ టెక్నో స్కూల్లో విద్యార్థులలో ఓటింగ్ పై అవగాహన కల్పించేందుకు మాక్ ఓటింగ్ నిర్వహించారు. ఓటింగ్ లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బాలాజీ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఏ .రాజేంద్ర ప్రసాద్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ప్రపంచంలో అత్యంత బలమైన ప్రజాస్వామ్య దేశాలలో భారతదేశం ఒకటి.ప్రజాస్వామ్య దేశాలలో రహస్య బాలెట్ ద్వారా తమ ప్రజాప్రతినిధులను ఎన్నుకోవడం ఎంతో శ్రేయస్కరమని స్వచ్ఛమైన పరిపాలన అందుతుందని ప్రజాస్వామ్యం బలంగా ఉంటుందని తద్వారా ఆర్థిక సంస్కరణలు చేపట్టి దేశం సర్వతో ముఖాభివృద్ధి సాధించేందుకు దోహదపడుతుందని తెలిపారు. మీరు కూడా భవిష్యత్తులో ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా బలమైన నాయకుడిని ఎన్నుకోవాలని అప్పుడే సుస్థిర పాలన అందుతుందని గుర్తు చేశారు.స్కూల్ ప్రిన్సిపాల్ బి రాజేంద్రప్రసాద్ గారు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ప్రతి ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును తప్పకుండా వినియోగించుకోవాలని అసమర్ధ నాయకులను బ్యాలెట్ ద్వారానే పదవిలో నుండి తొలగించే అధికారం ఓటరుకు మాత్రమే ఉంటుందని తెలిపారు .మన దేశంలో స్వాతంత్ర్యానంతరం 1952 లో మొట్టమొదటిసారిగా సార్వత్రిక ఎన్నికలు జరిగాయని గుర్తు చేశారు.ఈ కార్యక్రమానికి ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా చాగంటి క్రాంతి కుమార్, పోలింగ్ ఆఫీసర్ గా ఎం.డి రియాజుద్దీన్, పోలింగ్ సిబ్బందిగా ఉపాధ్యాయులు చందు,అనిల్,సంగీత, కవిత పాల్గొన్నారు.

# హిందుత్వం పేరుతో మతోన్మాద దాడులు ఆపాలి

## రమణమూర్తి పై దాడి చేసిన కశ్యపరెడ్డిని అరెస్టు చేయాలి....



**ములుగుటౌన్, నేటిధాత్రి:** ములుగు జిల్లాలో విజయ విహారం పత్రిక వ్యవస్థాపకుడు జై భారత్ జాతీయ అధ్యక్షుడు రమణమూర్తి పై మతోన్మాది కశ్యప్ రెడ్డి టీవీ డిబేట్లో చెప్పుతో దాడి చేయడానికి తీవ్రంగా ఖండిస్తూ ములుగు జిల్లా కేంద్రం అంబేద్కర్ సెంటర్లో కెవిపిఎస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం తెలియజేయడం జరిగింది ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి రత్నం ప్రవీణ్ మాట్లాడుతూ భావ ప్రకటనా స్వేచ్ఛ భారత రాజ్యాంగం కల్పించిన మౌలిక హక్కు అని అన్నారు. భిన్నాభిప్రాయాలను హింసతో కాకుండా చర్చల ద్వారా ఎదుర్కోవాలని, ప్రజాస్వామ్యంలో విమర్శలను సహించే సంస్కృతి పెరగాల్సిన అవసరం ఉందన్నారు.రమణమూర్తిపై జరిగిన దాడిపై పోలీసులు ఫిర్యాదును చట్టప్రకారం విచారించి, వాస్తవాలను నిర్ధారించి, బాధ్యులపై తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యంలో రచయితలు, పాత్రికేయులు, కళాకారులు, మేధావులు భయాందోళనలు లేకుండా తమ అభిప్రాయాలను వ్యక్తపరిచే వాతావరణాన్ని ప్రభుత్వం కల్పించాల్సిన బాధ్యత ఉందన్నారు.సమాజంలో మత విద్వేషాలు, హింస, అసహనం పెరగకుండా ప్రతి పౌరుడు రాజ్యాంగ విలువలను గౌరవించాలని, అన్ని మతాల పట్ల పరస్పర గౌరవం, శాంతి, సామరస్యాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు. ప్రజల మధ్య ద్వేషాన్ని రెచ్చగొట్టే చర్యలను ఎవరైనా చేపట్టినా చట్టం ముందు సమానంగా బాధ్యత వహించాల్సిందేనని అన్నారు.జై భారత్ రమణమూర్తిపై జరిగిన భౌతిక దాడిని ప్రజాస్వామ్యవాదులు, మతపెద్దలు, ప్రజాసంఘాలు తీవ్రంగా ఖండించాలి.ఘటనపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చట్టప్రకారం తక్షణ చర్యలు తీసుకోవాలి. రచయితలు, పాత్రికేయులు, కళాకారులు, మేధావులపై బెదిరింపులు, దాడులను అరికట్టేందుకు ప్రభుత్వం సమర్థవంతమైన చర్యలు చేపట్టాలి.మతం పేరుతో ద్వేషం, హింసను ప్రోత్సహించే చర్యలను అరికట్టి, రాజ్యాంగ విలువలు, శాంతి, సామరస్యాన్ని పరిరక్షించాలి.ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు జన్ను దేవేందర్ నాయకులు చంటి చెంద్రశేఖర్ రాజు సమ్మయ్య రామారావు లు పాల్గొన్నారు.

# మాదన్నపేట పాఠశాల విద్యార్థులకు ఎఫ్ఎ నోట్ బుక్స్ పంపిణీ.



**కమలాపూర్, నేటిధాత్రి:** మండలంలోని మాదన్నపేట ఉన్నత పాఠశాల విద్యార్థులకు రూపాయలు పదిహేనువేల విలువగల నోట్ బుక్స్ గ్రామానికి చెందిన వెనిశెట్టి బుచ్చిరాజు లింగం అందజేసినట్లు గ్రామ సర్పంచ్ కత్తి రమేష్ తెలిపారు. ప్రభుత్వ పాఠశాల లో విద్యాభ్యాసం చేస్తున్న పేద విద్యార్థుల అవసరం మేరకు దాత 300 ఎఫ్ఎ నోట్ బుక్స్ అందజేసినట్లు ఆయన తెలిపారు.శనివారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఈ నోట్ బుక్స్ ను విద్యార్థులకు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కత్తి రమేష్,ప్రధాన ఉపాధ్యాయులు వెంకన్న తో పాటు గ్రామానికి చెందిన పారిశ్రామికవేత్త గంగు ప్రభాకర్ రావు, విద్యా కమిటీ చైర్మన్ రజిత, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా విద్యార్థులకు నోటు పుస్తకాల అందించిన బుచ్చి రాజలింగంకు ధన్యవాదాలు తెలిపారు.

# ఆరోగ్యకరమైన వాతావరణం కోసం చెట్లను నాటండి

## కేసముద్రం పిఎసిఎస్ చైర్మన్ దీకొండ వెంకన్న....



**కేసముద్రం, నేటిధాత్రి:** పర్యావరణ పరిరక్షణ కోసం కేసముద్రం విలేజ్ పిఎసిఎస్ చైర్మన్ దీకొండ వెంకన్న, సీఈఓ ఎల్లయ్య, డైరెక్టర్ కొట్టం మహేందర్ రెడ్డి, మొక్కలు నాటడం ఎంతో అభినందనీయం. ప్రకృతిని కాపాడటంలో ఆయన చూపిన చొరవకు అభినందించదగిన విషయం, అనంతరం చైర్మన్ మాట్లాడుతూ, 'మొక్కలు నాటడం అంటే కేవలం భూమిని పచ్చగా మార్చడం కాదు... రాబోయే తరాలకు ప్రాణవాయువును, అందమైన భవిష్యత్తును బహుమతిగా ఇవ్వడం."పర్యావరణ పరిరక్షణ కేవలం బాధ్యత కాదు, ప్రతి ఒక్కరి కర్తవ్యం." పి ఎ సి ఎస్ చైర్మన్ ఈ అడుగు సమాజంలో మరికొందరికి స్ఫూర్తినియాలని అన్నారు.'ప్రకృతిని మనం కాపాడితే, ఆ ప్రకృతి మనల్ని కాపాడుతుందని పచ్చదనాన్ని పెంచడానికి ప్రతి ఒక్కరూ ఒక్కొక్క చెట్టు నాటితే పర్యావరణాన్ని కాపాడుకోవచ్చని అన్నారు. మొక్కలు నాటడం వల్ల సమాజానికి జరిగే ముఖ్యమైన ప్రయోజనాల డైరెక్టర్ కొట్టం మహేందర్ రెడ్డి వివరిస్తూ,

**ప్రాణవాయువు లభ్యత:** చెట్లు మనకు కావలసిన ఆక్సిజన్‌ను అందిస్తూ, హానికరమైన కార్బన్ డయాక్సైడ్‌ను పీల్చుకుని గాలిని శుద్ధి చేస్తాయని. వాతావరణ సమతుల్యత గ్లోబల్ వార్మింగ్‌ను తగ్గించి, ఉష్ణోగ్రతలను అదుపులో ఉంచుతాయని, సకాలంలో వర్షాలు పడటానికి దోహదం చేస్తాయని అప్పుడే ఆరోగ్యకరమైన సమాజం ఏర్పడుతుందని అన్నారు. కాలుష్యం తగ్గడం వల్ల శ్వాసకోశ వ్యాధులు దూరమై ప్రజల ఆరోగ్యం మెరుగవుతుంది.భూగర్భ జలాలు చెట్ల వేర్లు వర్షపు నీటిని భూమిలోకి ఇంకేలా చేసి, భూగర్భ జలమట్టాన్ని పెంచుతాయని ఆర్థిక ప్రయోజనాలు సమాజానికి కావలసిన పండ్లు, ఔషధాలు, కలప మరియు ఉపాధి అవకాశాలను కల్పిస్తాయని మొక్కలు నాటడం అంటే సమాజానికి జీవనాధారాన్ని, పచ్చని భవిష్యత్తును ఇవ్వడమేనని అన్నారు.

ఈ కార్యక్రమంలో పి ఎ సి ఎస్ సి ఈ ఓ ఎల్లయ్య, పి ఎ సి ఎస్ డైరెక్టర్ కొట్టం మహేందర్ రెడ్డి, సురేష్, భద్రం రైతులు తదితరులు పాల్గొన్నారు.

# నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత



**నడికూడ, నేటిధాత్రి:** మండల కేంద్రంలోని సబ్ స్టేషన్ పరిధిలో ఆదివారం నిర్వహణ పనులతో పాటు నూతన బ్రేకర్ ఏర్పాటు పనులు చేపట్టనున్నట్లు ఏ.ఈ. లక్ష్మణ్ నాయక్ ఒక ప్రకటన లో తెలిపారు. నడికూడ,నర్సక్కపల్లి, చౌటుపర్తి, ముస్త్యాలపల్లి, రాయపర్తి గ్రామాల పరిధిలో ఉదయం 10 నుండి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయబడుతుందని పేర్కొన్నారు. విద్యు త్ అంతరాయానికి వినియోగదారులుసహకరించాలని కోరారు.

# కాళేశ్వరం నుండి సాగు, త్రాగునీరు అందించాలి



రాష్ట్ర ప్రభుత్వం తమ వైఖరి స్పష్టంగా చెప్పాలి.... నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు.... పోరాటాలకు శ్రీకారం చుడతాం... సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ ...

**భూపాలపల్లి, నేటిధాత్రి:** రాష్ట్ర ప్రజల ప్రయోజనమే ముఖ్యం అని,కాళేశ్వరం నుండి సాగు, త్రాగునీరు అందించాలనీ, రాష్ట్ర ప్రభుత్వం తమ వైఖరి స్పష్టంగా చెప్పాలనీ,ఇంకా నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదనీ పోరాటాలకు శ్రీకారం చుడతాం అని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ హెచ్చరించారు.శనివారం సిపిఐ ఎం జిల్లా కార్యదర్శి బందు సాయిలు ఆధ్వర్యంలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరం లోని కన్నెపెల్లి పంపు హౌస్,అన్నారం, మేడిగడ్డ ప్రాజెక్ట్ కు సిపిఐ (ఎం) బృందం పరిశించింది.అనంతరం మేడిగడ్డ ప్రాజెక్ట్ వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జాన్ వెస్లీ మాట్లాడుతూ.... దేశంలో రాష్ట్రం లో వర్షాలు ఈ సంవత్సరం చాలా తక్కువగా పడే అవకాశం ఉందని, సెప్టెంబర్ వరకు కూడా వర్షాలు పడేటటువంటి అవకాశం లేదన్నారు. ఇప్పటికే కరువు పరిస్థితి నెలకొందన్నారు. తెలంగాణ ప్రాంతంలో. రైతులు వర్షాల కోసం చూసి, పంటలు వేసుకోవడానికి తీవ్రమైన ఆందోళనతో ఉన్నారన్నారు. వేసుకున్నటువంటి వాళ్ల వర్షాలు లేక నష్టపోతున్న పరిస్థితి ఉందనారు. సాగునీరు సమస్యనే కాక, త్రాగునీరు సమస్య కూడా మారుతుందన్నారు. ఈ సమావేశం లో సిపిఐ(ఎం) రాష్ట్ర నాయకులు మున్న నాగేశ్వరరావు, జంగారెడ్డి , సుధాకర్ రెడ్డి , కారం పుల్లయ్య, వర్ణ వెంకట్ రెడ్డి.కరీంనగర్ జిల్లా కార్యదర్శి వాసుదేవ్ రెడ్డి, జిల్లా నాయకులు పోలేం పెద్ద రాజేందర్,గుర్రం దేవేందర్, పోలేం చిన్న రాజేందర్, ఎస్ఎఫ్ఐ నాయకులు దామెర కిరణ్,కుమ్మరి రాజు కుమార్, బొడ్డు స్మరణ్, కేవీపీఎస్ నాయకులు ఇసునం మహేందర్,తదితరులు పాల్గొన్నారు.

# భారత అంతరిక్ష రంగంలో సరికొత్త అధ్యాయం

స్కైరూట్ ఏరోస్పే 'విక్రమ్-1' రాకెట్ ప్రయోగం విజయవంతం...తొలుత ఇంధన ప్రక్రియలో సాంకేతిక లోపం...అరగంటలోపే సరిదిద్ది పూ-రయోగాన్ని పూర్తి చేసిన షార్...ప్రైవేట్ రంగంలో తొలి రాకెట్ కావడంతో సర్వత్రా హర్షం....ప్రయోగాన్ని వీక్షించిన లోకేశ్, ఇస్రో మాజీ శాస్త్రవేత్తలు...

**శ్రీహరికోట, నేటిధాత్రి:** భారత అంతరిక్ష రంగంలో సరికొత్త అధ్యాయం ప్రారంభమైంది. శ్రీహరికోట షార్ అంతరిక్ష కేంద్రం నుంచి చేపట్టిన ప్రయోగం విజయవంతం అయ్యింది. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ ప్రైవేట్ స్పేస్‌టెక్ స్టార్టప్ 'స్కైరూట్ ఏరోస్పే 'విక్రమ్-1' రాకెట్ రూపొందించింది. శ్రీహరికోటలోని సతీష్ ధవన్ అంతరిక్ష కేంద్రం(షార్) నుంచి శనివారం మధ్యాహ్నం 12:05 గంటలకు చేపట్టిన ఈ ప్రయోగం విజయవంతమైంది. దీంతో ప్రభుత్వ ఆధ్వర్యంలోని అంతరిక్ష కార్యక్రమాలు సహా భారత ప్రైవేటు రంగం కూడా ఉపగ్రహాలను కక్ష్యలోకి పంపగల సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటినట్లు అయ్యింది. వాస్తవానికి ఉదయం 11.30 గంటలకు ప్రయోగం జరగాల్సి ఉండగా సాంకేతిక లోపం తలెత్తింది. దీంతో ప్రయోగానికి స్వల్ప అంతరాయం ఏర్పడింది. ఆ తర్వాత శాస్త్రవేత్తలు పరిశీలనలు చేపట్టి ఇంధన పక్రియలో తలెత్తిన సమస్యను గుర్తించి సరిచేశారు. 35 నిమిషాల తర్వాత తిరిగి రాకెట్‌ను ప్రయోగించారు. ఈ రాకెట్.. సాంకేతిక పేలోడ్‌లు సహా ప్రధాని నరేంద్ర మోదీ స్వహస్తాలతో 'వందేమాతరం' అని రాసి పంపిన ప్రత్యేక పోస్ట్‌కార్డును అంతరిక్షంలోకి తీసుకెళ్లింది. వీటితో పాటు కాస్మోస్ డైమండ్స్ సంస్థ రూపొందించిన 'కాస్మిక్ బ్లూమ' ఆర్ట్‌వర్క్, విక్రమ్-1 రాకెట్ సూక్ష్మ ప్రతిరూపాన్నీ నింగిలోకి పంపారు. దీనిపై సర్ సీవీ రామన్, విక్రమ్ సారాభాయ్, ఏపీజే అబ్దుల్ కలాం వంటి ప్రముఖుల సూక్ష్మరూపాలను చెక్కారు. అంతేకాకుండా.. ఈ ప్రయోగం విజయవంతం కావాలని కాంక్షిస్తూ స్కైరూట్ టీమ్ సహా ఇస్రో మాజీ ఛైర్మన్లు, శాస్త్రవేత్తలు, భారతీయ వ్యోమగాములు, ఇతరులు పంపిన డజన్ల కొద్దీ చేతిరాత పోస్ట్‌కార్డులనూ ప్రత్యేక పేలోడ్ బాక్స్‌లో భద్రపరిచారు. స్కైరూట్ సంస్థ 'మిషన్ ఆగమన' పేరిట ఈ ప్రయోగం చేపట్టింది. భారత ప్రైవేట్ అంతరిక్ష రంగం ఆర్బిటాల్ ప్రయోగాల యుగంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా ఈ మిషన్‌కు ఆ పేరు పెట్టింది. విక్రమ్-1 ద్వారా గ్రహాస్పేస్, కాస్మోసెర్వ్, డీక్యూబ్‌డ్ సంస్థలకు చెందిన టెక్నాలజీ డెమానిస్ట్రేషన్ పేలోడ్‌లు సహా స్కైరూట్‌కు చెందిన 'స్కోప'ను కూడా అంతరిక్షంలోకి పంపారు. ఈ ప్రయోగం ద్వారా రాకెట్‌లోని ప్రొపల్షన్, స్టేజ్ సెపరేషన్, గైడెన్స్, నావిగేషన్, కంట్రోల్ వ్యవస్థల పనితీరును అంతరిక్ష ప్రయాణంలో పరీక్షించి తద్వారా కీలక సమాచారం రాబట్టనున్నారు. దీంతో రానున్న కాలంలో వాణిజ్య ప్రయోగాల అవసరాలకు సాంకేతిక సామర్థ్యాన్ని మరింత మెరుగుపరుచుకోవడమే లక్ష్యంగా స్కైరూట్ ముందడుగేస్తోంది.ఇక.. సుమారు ఏడంతస్తుల భవనం ఎత్తులో రూపొందిన విక్రమ్-1 పూర్తిగా కార్బన్ కాంపోజిట్ నిర్మాణంతో తయారైంది. దేశీయంగా అభివృద్ధి చేసిన 3డీ ప్రింటెడ్ ఇంజిన్లు, ఘన ఇంధన బూస్టర్లతో పనిచేసే ఈ రాకెట్ 350 కిలోల వరకు చిన్న ఉపగ్రహాలను 450 కిలోమీటర్ల ఎత్తులోని లోఎర్త్ ఆర్బిట్ లో ప్రవేశపెట్టే సామర్థ్యాన్ని కలిగి ఉంది. 2022లో విక్రమ్-ఎస్ ద్వారా తొలి ప్రైవేట్ రాకెట్‌ను విజయవంతంగా కక్ష్యలోకి పంపిన స్కైరూట్.. ఇప్పుడు విక్రమ్-1తో తొలి దేశీయ ప్రైవేట్ ఆర్బిటాల్ ప్రయోగం చేపట్టింది. ఈ ప్రయోగాన్ని ఏపీ మంత్రి నారా లోకేశ్ ప్రత్యక్షంగా వీక్షించారు. కుమారుడు దేవాన్ష్‌తో కలిసి శ్రీహరికోటకు వెళ్లిన లోకేశ్.. ఇస్రో గ్యాలరీ నుంచి 'విక్రమ్-1' ప్రయోగాన్ని వీక్షించారు. ఇస్రో మాజీ ఛైర్మన్లు, సీనియర్ శాస్త్రవేత్తలు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# మరో చారిత్రక మైలురాయికి ఇస్రో

విక్రమ్-1' రాకెట్ ప్రయోగంపై చంద్రబాబు హర్షం

**అమరావతి, నేటిధాత్రి:** విక్రమ్-1' రాకెట్ తొలి ప్రయోగంలోనే విజయం సాధించడంపై సీఎం చంద్రబాబు నాయుడు హర్షం వ్యక్తం చేశారు. స్కైరూట్ ఏరోస్పేస్, ఇస్రో, ఇన్-స్పేస్, ఎనఎసఐఎల్‌లకు ఎక్స్ వేదికగా అభినందనలు తెలియజేశారు. విక్రమ్-1 తొలి ప్రయోగంలోనే విజయవంతంగా కక్ష్యలోకి చేరడంతో భారత్ మరో చారిత్రక మైలురాయిని అధిగమించిందన్నారు. ప్రపంచంలోని అత్యుత్తమ దేశాలతో పోటీపడే స్థాయికి భారత ప్రైవేటు అంతరిక్ష రంగం ఎదిగిందని ఈ విజయం నిరూపించిందని వెల్లడించారు. ఇది భారత అంతరిక్ష రంగంలో ఒక నూతన యుగానికి నాంది అని పేర్కొన్నారు. శాస్త్రీయ సంస్థల సామర్థ్యం, భారతీయ పారిశ్రామికవేత్తల సృజనాత్మకత కలిసినప్పుడు ఆవిష్కరణలకు కొత్త హద్దులు ఏర్పడతాయని ఈ ఘన విజయం చాటిచెప్పిందని సీఎం తెలిపారు. స్కైరూట్ ఏరోస్పేస్, ఇస్రో, ఇన్-స్పేస్, ఎనఎసఐఎల్ సహా ఈ విజయాన్ని సాకారం చేసిన వేలాదిమంది శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు, సాంకేతిక నిపుణులు, భాగస్వామ్యులందరికీ అభినందనలు తెలియజేశారు. ఈ విజయం ప్రతి భారతీయుడు గర్వపడే క్షణమన్నారు. భావితరాల యువ శాస్త్రవేత్తలు, ఆవిష్కర్తలకు గొప్ప స్ఫూర్తిగా నిలుస్తుందని తెలిపారు. నక్షత్రాల వైపుగా భారత్ సాగిస్తున్న ప్రస్థానం మరిన్ని విజయాలతో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సీఎం చంద్రబాబు ఆకాంక్షించారు.

# బహుజన విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో డి.ఈ.ఓ ఆఫీసు ముందు ధర్నా



**హన్మకొండ, నేటిధాత్రి:** ప్రభుత్వ అనుమతి లేకుండా నడుపుతున్న ప్రైవేట్ పాఠశాలలను మూసివేయాలని బహుజన విద్యార్థి సంఘం (బి.యస్.ఫ్) ఆధ్వర్యంలో హన్మకొండ జిల్లా విద్యాశాఖ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బి.యస్.ఫ్ హన్మకొండ జిల్లా అధ్యక్షులు బొట్ల మనోహర్ మాట్లాడుతూ హనుమకొండ జిల్లాలో గల్లి గల్లికి విచ్చలవిడిగా ప్రభుత్వ అనుమతి లేకుండా ప్రైవేట్ పాఠశాలలను నడుపుతున్నారని లక్షలాది అధిక ఫీజులు తీసుకుంటున్నారని ఫీజుల పేరుతో పేద మధ్య తరగతి తల్లిదండ్రుల విద్యార్థుల రక్తం తాగుతున్నారని ప్రి ప్రైమరీ మరియు ప్రైమరీ పాఠశాలల పేరుతో ప్రభుత్వ అనుమతి లేకుండా ప్రతి కాలనీ లో పుట్టగొడుగులుగా ప్రైవేట్ పాఠశాల వెలిశాయని వెంటనే వాటిని మూసివేయాలని అధిక ఫీజుల దోపిడి అరికట్టాలని అదేవిధంగా ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ధరలకు పుస్తకాలు నోట్ బుక్స్ అమ్ముతున్నారని ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా స్కూల్ యూనిఫామ్స్ టై బెల్టు లు అమ్ముతున్న ప్రైవేట్ పాఠశాలల గుర్తింపును రద్దు చేయాలని ఎలాంటి గ్రౌండ్ లేకుండా ఫైర్ రక్షణ లేకుండా కమర్షియల్ ఇండ్లలో పాఠశాలలను నడుపుతున్నారని వాటిని గుర్తించి వెంటనే మూసివేయాలని డిమాండ్ చేశారు. అనంతరం పై డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జిల్లా విద్యాశాఖ అధికారికి తన చాంబర్ లో కలిసి అందజేశారు. ఈ కార్యక్రమంలో బిఎస్ఎఫ్ ప్రధాన కార్యదర్శి గడ్డం కృష్ణకాంత్ నాయకులు కడదారపు నవీన్ పుట్ట అజయ్ సునీల్ కుమార్ ప్రశాంత్ రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# రంగాపూర్ మిర్చి స్కామ్: రూ.90 లక్షలు ఎగ్గొట్టిన ముఠాలో ఇద్దరు అరెస్ట్

**మొగుళ్ళపల్లి, నేటిధాత్రి:** అధిక ధర ఆశ చూపి మిర్చి రైతులను రూ.90 లక్షల మేర మోసం చేసిన ముఠాలోని ఇద్దరు నిందితులను జయశంకర్ భూపాలపల్లి జిల్లా పోలీసులు అరెస్ట్ చేశారు. మొగుళ్ళపల్లి మండలం రంగాపూర్ గ్రామంలో ఫర్టిలైజర్ షాపు నిర్వహిస్తున్న ఏ-4, ఏ-1 నుంచి ఏ-3 వరకు ఉన్న నిందితులతో కలిసి కుట్ర పన్నారు. ప్రభుత్వ ధర కంటే క్వింటాకు రూ.2 వేల నుంచి రూ.4 వేల వరకు ఎక్కువ ఇస్తామని చెప్పి రైతుల నుంచి సుమారు రూ.1.20 కోట్ల విలువైన మిర్చి సేకరించారు. రైతులకు కేవలం రూ.30 లక్షలు మాత్రమే చెల్లించి మిగిలిన రూ.90 లక్షలు ఎగ్గొట్టారు. మిగిలిన మిర్చిని ఏ-5 సహాయంతో ఏనుమాముల మార్కెట్ కోల్డ్ స్టోరేజ్‌లో దాచి విక్రయించారు. వచ్చిన సొమ్ముతో విలాసాలు, వాహనాలు కొన్నారు. కేసు నమోదు కాగానే తమ ఆస్తులను ఏ-6 పేరుకు బదిలీ చేసి పరారయ్యారు. ఈ కేసును CCS భూపాలపల్లి, మొగుళ్ళపల్లి పోలీస్ స్టేషన్ సిబ్బంది



సీరియస్‌గా తీసుకున్నారు. చిట్యాల సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీ డి. మల్లేశ్ గారి పర్యవేక్షణలో, మొగుళ్ళపల్లి ఎస్.ఐ శ్రీ ఎం. సురేష్ నేతృత్వంలో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు. నిందితులు రంగాపూర్‌లో ఏ-4 కోసం వస్తున్నారనే సమాచారంతో రంగంలోకి దిగిన పోలీసులు ఏ-1, ఏ-2 లను చాకచక్యంగా పట్టుకున్నారు. సోదాల్లో నిందితుల వ్యాపార సంస్థలైన ASK Agros, R-Enterprises కు సంబంధించిన కీలక పత్రాలు, 4 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరినీ కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.మిగిలిన ఏ-3, ఏ-4, ఏ-5, ఏ-6 కోసం CCS CI శ్రీ రమేష్, SI శ్రీ నరేష్ ల ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి. త్వరలోనే వారిని పట్టుకుంటామని పోలీసులు చెప్పారు.SP అభినందనలు నిందితుల అరెస్ట్‌లో ప్రతిభ కనపరిచిన చిట్యాల CI & • . మల్లేశ్, మొగుళ్ళపల్లి SI ఎం. సురేష్, వారి సిబ్బంది, అలాగే CCS CI రమేష్, SI నరేష్ లను జిల్లా SP శ్రీ సిరిశెట్టి సంకీర్త్ IPS గారు ప్రత్యేకం అభినందించారు

# పర్యాటక రంగంలో పెట్టుబడులకు ఏపీ అత్యంత సురక్షితం

పర్యాటక మంత్రి కందుల దుర్గేష్...."ఆల్ ఇండియా చాప్టర్ ఛైర్మన్ల సమావేశం 2026"కు ముఖ్య అతిథిగా మంత్రి ...సింగిల్ విండో విధానం ద్వారా శరవేగంగా పర్యాటక అనుమతులు....

**అమరావతి, నేటిధాత్రి:** భారతదేశ దేశీయ పర్యాటక రంగ అభివృద్ధిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అత్యంత కీలకమైన భూమిక పోషిస్తోందని, పర్యాటక రంగాన్ని ఒక వ్యూహాత్మక ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. శనివారం న్యూఢిల్లీలోని చాణక్యపురి 'హోటల్ జింజర' వేదికగా అసోసియేషన్ ఆఫ్ డొమెస్టిక్ టూర్ ఆపరేటర్స్ ఆఫ్ ఇండియా నిర్వహించిన "ఆల్ ఇండియా చాప్టర్ ఛైర్మన్ల సమావేశం 2026"కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. "స్వదేశీ పర్యటన్ ? సశక్త్ భారత" అనే ప్రధాన ఇతివృత్తంతో.. ఆంధ్రప్రదేశ్ మరియు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలపై ప్రత్యేక ఫోకస్‌తో జరిగిన సదస్సు లో మంత్రి దుర్గేష్ కీలక ప్రసంగం చేశారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ, పర్యాటకరంగ సేవల్లో 30 ఏళ్లు పూర్తి చేసుకున్న ఎడిటిఓఐ సంస్థకు అభినందనలు తెలిపారు. దేశవ్యాప్తంగా 2,400 మందికి పైగా సభ్యులతో విస్తరించిన ఈ జాతీయ నెట్‌వర్క్, భారతీయ పర్యాటక రంగాన్ని ముందుకు నడిపించడంలో కీలక పాత్ర పోషిస్తోందని కొనియాడారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల దూరదృష్టితో కూడిన నాయకత్వంలో, రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా కల్పించామని, పబ్లిక్-ప్రైవేట్ పార్టనర్‌షిప్ పద్ధతిలో పెట్టుబడులను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. విశాఖపట్నం, అరకు లోయ, రాజమహేంద్రవరం, అమరావతి, శ్రీశైలం, గండికోట, తిరుపతిలను ఏడు ప్రధాన పర్యాటక హబ్‌లుగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఆధ్యాత్మికం, తీరప్రాంతం (కోస్టల్), పర్యావరణం (ఎకో), బౌద్ధ వారసత్వం, గ్రావిణ సంస్కృతి కలగలిసిన అరుదైన పర్యాటక అనుభూతి ఆంధ్రప్రదేశ్ సొంతమని పేర్కొన్నారు. తిరుపతి, శ్రీశైలం వంటి దివ్యక్షేత్రాల నుండి అరకు లోయ అందాలు, గండికోట గ్రాండ్ కాన్యన్, బెలుం గుహల వరకు ఎన్నో అద్భుతాలు రాష్ట్రంలో ఉన్నాయన్నారు.పర్యాటక రంగం కేవలం పెద్ద నగరాలకే పరిమితం కాకుండా గ్రామాలు, తీరప్రాంతాలు, గిరిజన ప్రాంతాల వరకు విస్తరించి మహిళలకు, యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పిస్తుందని, స్థానిక వంటకాలు మరియు చేతివృత్తులకు ప్రాచుర్యం తెస్తుందని మంత్రి దుర్గేష్ నొక్కి చెప్పారు. అమరావతి, నాగార్జునకొండ, తొట్లకొండ, బొజ్జన్నకొండ వంటి బౌద్ధ వారసత్వ ప్రదేశాలతో పాటు విజయవాడ, శ్రీకాళహస్తి క్షేత్రాలను, కోనసీమ గ్రావిణ పర్యాటకాన్ని, మారేడుమిల్లి, కోరింగ వంటి పర్యావరణ పర్యాటక కేంద్రాల ప్రాధాన్యతను మంత్రి వివరించారు.ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక గుర్తింపు తెచ్చిన కలంకారీ కళలు, కొండపల్లి బొమ్మలు, ఏటికొప్పాక బొమ్మలు, ఉప్పాడ-ధర్మవరం చేనేత వస్త్రాలు మరియు అరకు కాఫీ వంటి విశిష్ట ఉత్పత్తులను టూరిజం ప్యాకేజీలలో భాగం చేయాలని కోరారు. పర్యాటకులు ఏపీని కేవలం చూడటమే కాదు... ఇక్కడి సంస్కృతిని అనుభవించేలా చేయాలన్నారు.పర్యాటకులు ఎక్కువ రోజులు బస చేసేలా, ఎక్కువ ఖర్చు పెట్టేలా సరికొత్త హోమ్‌స్టేలు, ఎకో-లాడ్జ్‌లు, కారవాన్ టూరిజం మరియు అడ్వెంచర్ టూరిజం వంటి మౌలిక వసతులను వేగంగా అభివృద్ధి చేస్తున్నట్లు వెల్లడించారు.ఈ సమావేశంలో పర్యాటక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్ జైన్, ఎడిటిఓఐ జాతీయ అధ్యక్షుడు వేద్ ఖన్నా, సంస్థ ముఖ్య ప్రతినిధులు, దేశంలోని వివిధ రాష్ట్రాల చాప్టర్ల ఛైర్మన్లు, పర్యాటక, హోటల్ రంగ ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గోదావరి నదిలో వేటకెళ్లి ఐదుగురు మృతిపై సీఎం చంద్రబాబు విచారం

**అమరావతి, నేటిధాత్రి:** పోలవరం జిల్లా ఎటపాక మండలం గొల్లగూడెం వద్ద గోదావరి నదిలో ఐదుగురు మృతి చెందిన ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. గోదావరి నదిలో చేపల వేటకు వెళ్లి ఐదుగురు గల్లంతయ్యారన్న విషయంపై ముఖ్యమంత్రి అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. గొమ్ముకొత్తగూడెంనకు చెందిన తుర్రం భారతి, ఊకే సుశీల, ఊకే లక్ష్మి, బాసిబోయిన బాలరాజు, ఊకే రమేష్ అనే ఐదుగురు వేటకు వెళ్లి మృత్యువాత పడినట్లు అధికారులు సీఎంకు వివరించారు. మృతుల కుటుంబాలకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని అధికారులను ఆదేశించారు.ఐదుగురు మృతి చెందిన ఘటనపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్ విచారం వ్యక్తం చేశారు. దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. పోలవరం జిల్లా కలెక్టర్ తో మాట్లాడి ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను తెలుసుకున్నారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం తరఫున అవసరమైన సహాయ సహకారాలు అందించాలని అధికారులకి దిశానిర్దేశం చేశారు.

# విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం స్కాలర్షిప్ నిధులు పెంచాలి

విద్యాలయల్లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలి : షైక్ సోహైల్....

**జహీరాబాద్, నేటిధాత్రి:** జహీరాబాద్. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో విద్యార్థులకు అప్పటి ప్రభుత్వం ఉపకార వేతనాలు పెంచి విద్యార్థులకు ఆదుకున్నాదని, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్ళకూ పైగా అవుతున్న ఇప్పటివరకు విద్యార్థులకు స్కాలర్షిప్ నిధులు పెంచకుండా గతంలో ఉన్న వాటినే కొనసాగిస్తుందని, ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి స్కాలర్షిప్ నిధులు పెంచడంతో పాటు విద్యాలయాల్లో నెలకొని ఉన్న సమస్యలను పరిష్కరించాలని ఝరాసంగం మండలం బిఆర్ఎస్ నాయకులు షేక్ సోహైల్ ప్రభుత్వానితో డిమాండ్ చేశారు..



# వర్షాకాలంలో ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి

డాక్టర్ రోహిత్ సాదు

**పరకాల, నేటిధాత్రి:** వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ఎక్కువగా వ్యాపించే అవకాశం ఉన్నందున ప్రజలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని వైద్యులు డాక్టర్ రోహిత్ సాదు సూచించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాగునీటిని వేడిచేసి చల్లార్చిన తర్వాత మాత్రమే తాగాలని, వేడి,తాజాగా వండిన ఆహారాన్ని మాత్రమే తీసుకోవాలని అన్నారు.దోమల నివారణకు ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవడంతో పాటు దోమతెరలు,రిపెల్లెంట్లు ఉపయోగించాలని సూచించారు.వర్షంలో తడిస్తే వెంటనే పొడి దుస్తులు ధరించాలని,చేతులను శుభ్రంగా కడుక్కోవడం,వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం ద్వారా అనేక వ్యాధులను నివారించవచ్చని తెలిపారు.జ్వరం,దగ్గు,విరోచనాలు వంటి లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే సమీప వైద్యుడిని సంప్రదించాలని సూచించారు.



# సమాజ భద్రతలో ప్రజల సహకారం ఎంతో ముఖ్యం

**కొడిమ్యాల, నేటిధాత్రి:** జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండల ఎస్సై ఏ.నరేష్ కుమార్ మాట్లాడుతూ ఇటీవల సమాజంలో జరుగుతున్న అసాంఘిక చర్యలకు వ్యతిరేకంగా పోలీసు వారు తగు చర్యలు తీసుకుంటూ, పౌరులకు పలు సూచనలు చేయడం జరుగుతుంది.బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం నిషేధం, దొంగతనాలు ఎక్కువగా జరుగు తున్నందున ప్రజలు ఇల్లు విడిచి వెళ్లే సమయంలో సరైన భద్రత చూసుకోవాలి. పక్కింటి వారికి,తెలిసిన వారికి ఇల్లును అబ్జర్వేషన్ చేయమని చెప్పాలని, మహిళలు ఒంటరిగా వెళ్ళినప్పుడు తగు వ్యక్తిగత భద్రత చర్యలు తీసుకోవాలి. విధిగా ప్రతి ఇంటికి ఒక ప్రత్యేకమైన సీసీ కెమెరా పెట్టుకోవడం శ్రేయస్కరం, తెలిపారు.పై చర్యలను ప్రతి ఒక్కరు గమనించగలరని కొడిమ్యాల మండలం ప్రజలకు పోలీసు వారి విజ్ఞప్తి .సమాజ భద్రతలో ప్రజల సహకారం ఎంతో ముఖ్యం.కొడిమ్యాల ఎస్సై ఎ .నరేష్ కుమార్, అన్నారు.



# సరూర్‌నగర్‌కు భారీగా తరలిన బాలానగర్ బీఆర్ఎస్ శ్రేణులు

**జడ్చర్ల, నేటిధాత్రి:** హైదరాబాద్ నగరంలోని సరూర్‌నగర్‌లో బీఆర్ఎస్ పార్టీ నిర్వహిస్తున్న నిరుద్యోగ యువ సంగ్రామ యాత్రలో పాల్గొనేందుకు బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు.. జడ్చర్ల నియోజకవర్గం బాలానగర్ మండలం నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో బయలుదేరారు. మాజీ మంత్రి డాక్టర్ చర్లకోల లక్ష్మారెడ్డి



ఆధ్వర్యంలో మండలంలోని వివిధ గ్రామాల నుంచి బీఆర్ఎస్ శ్రేణులు వాహనాల్లో సరూర్‌నగర్‌కు తరలివెళ్లాయి. రాష్ట్రంలో నిరుద్యోగుల సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీసేందుకు నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని, ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేసి యువతకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

# విక్రమ్-1' విజయవంతంపై ప్రధాని మోడీ హర్షం

స్కైరూట్ ఏరోస్పేస్ బృందానికి ఫోన్‌లో అభినందనలు.....ఇంజనీర్ల కృషిని ప్రశంసిస్తూ..తనను కలవాలని సందేశం...

**న్యూఢిల్లీ, నేటిధాత్రి:** భారత తొలి ప్రైవేటు అంతరిక్ష ప్రయోగం 'విక్రమ్-1' విజయవంతం కావడంపై ప్రధాని నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. ప్రయోగం విజయవంతమైన వెంటనే హైదరాబాద్‌కు చెందిన స్కైరూట్ ఏరోస్పేస్ బృందంతో ఫోన్‌లో మాట్లాడి, వారికి ప్రత్యేక అభినందనలు తెలిపారు మోదీ. ఈ ప్రయోగాన్ని తాను ప్రత్యక్షంగా వీక్షించినట్టు చెప్పిన ఆయన.. ఈ ఘనత దేశానికి గొప్ప విజయమని అభివర్ణించారు. భారత అంతరిక్ష ప్రయాణంలో ఇదో కీలక మైలురాయిగా నిలిచిందని పేర్కొన్నారు. 'ప్రయోగాన్ని నేను ప్రత్యక్షంగా వీక్షించాను. దీని వెనుక ఎందరో యువ ఇంజినీర్ల శ్రమ దాగుంది. మొత్తం బృందానికి నా హృదయపూర్వక అభినందనలు. ఇది ఆరంభం మాత్రమే. ఈ ప్రయాణాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలి' అని స్కైరూట్ టీమ్‌ను ప్రోత్సహించారు. ఈ సందర్భంగా స్కైరూట్ ఏరోస్పేస్ శాస్త్రవేత్తలు, ఇంజినీర్ల బృందం త్వరలో తనను కలవాలని ఫోన్ ద్వారా ఆహ్వానించారు. అంతరిక్ష రంగంలో భారత్ స్వావలంబన దిశగా వేగంగా ముందుకు సాగుతోందని ఈ ప్రయోగం ప్రపంచానికి చాటిచెప్పిందని మోదీ అభిప్రాయపడ్డారు. 'అంతరిక్ష రంగంలోనూ భారత్ ఆత్మనిర్భర్‌గా ఎదగగలదని విరు ప్రపంచానికి నిరూపించారు' అని ప్రధాని కొనియాడారు. 'విక్రమ్-1'లో తన 'వందేమాతరం' సందేశంతో కూడిన కార్డును కూడా పంపించిన విషయాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. ప్రపంచం నలుమలల నుంచి వచ్చిన శుభాకాంక్షలు సహా ఆ సందేశం కూడా అంతరిక్షంలోకి చేరడం గర్వకారణమన్నారు. 'ఈ ప్రయోగం ద్వారా 'వందేమాతరం' సందేశం మరింత ఉన్నత స్థాయికి చేరి అంతరిక్షంలోనూ మార్మోగింది' అని మోదీ వ్యాఖ్యానించారు. శ్రీహరికోటలోని సతీష్ ధవన్ అంతరిక్ష కేంద్రం నుంచి శనివారం మధ్యాహ్నం 12:05 గంటలకు 'మిషన్ ఆగమన' పేరిట చేపట్టిన 'విక్రమ్-1' రాకెట్ విజయవంతంగా నింగిలోకి దూసుకెళ్లింది. నిర్ణీత సమయం కంటే 35 నిమిషాలు ఆలస్యంగా ప్రయోగం చేపట్టినప్పటికీ.. అన్ని దశలను విజయవంతంగా పూర్తి చేయడంతో భారత ప్రైవేటు అంతరిక్ష రంగంలో కొత్త అధ్యాయానికి నాంది పలికింది.

# చారిత్రక ఘట్టానికి ఈ ప్రయోగం నిదర్శనం

ఇస్రోను అభినందించిన పవన్, లోకేశ్

**అమరావతి, నేటిధాత్రి:** విక్రమ్-1 రాకెట్ ప్రయోగంపై ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అభినందనలు తెలిపారు. ఈ ప్రయోగాన్ని చరిత్రాత్మక ఘట్టంగా పవన్ కల్యాణ్ అభివర్ణించారు.భారత అంతరిక్ష రంగంలో తొలిసారిగా ఓ ప్రైవేట్ ఏరోస్పేస్ రూపొందించిన రాకెట్ నింగిలోకి దూసుకెళ్లింది. 'విక్రమ్-1' రాకెట్, 'మిషన్ ఆగమన' పేరుతో శ్రీహరికోటలోని సతీశ్ ధవన్ అంతరిక్ష కేంద్రంలో ఈ ప్రయోగాన్ని చేపట్టారు. భారతదేశం ఈ రోజు అంతరిక్ష రంగంలో మరో కీలక మైలురాయిని చేరుకుందని పవన్ కల్యాణ్ ఉద్ఘాటించారు. శ్రీహరికోటలోని సతీశ్ ధావన్ అంతరిక్ష కేంద్రం నుంచి ప్రయోగించిన విక్రమ్-1 రాకెట్, అంతరిక్ష సాంకేతికత, ఆవిష్కరణల్లో ప్రపంచ అగ్రగామిగా నిలవాలనే భారతదేశ లక్ష్యానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ చరిత్రాత్మక ప్రయోగం ప్రధానమంత్రి నరేంద్రమోదీ దార్శనికతకు నిదర్శనమని అభిప్రాయపడ్డారు. బారత అంతరిక్ష రంగంలో ప్రైవేట్ భాగస్వామ్యం ద్వారా దేశంలో ఆవిష్కరణలు, స్టార్టప్‌ల అభివృద్ధికి కొత్త అవకాశాలు ఏర్పడ్డాయని డిప్యూటీ సీఎం తెలిపారు. ఈ నేపథ్యంలో ఇస్రో పోషించిన పాత్రను ప్రత్యేకంగా ప్రశంసించారు. శాస్త్రీయ పరిశోధన, సాంకేతిక నైపుణ్యం, యువతలోని వ్యవస్థాపక స్ఫూర్తిని ప్రోత్సహించడంలో ఇస్రో కీలకంగా వ్యవహరించిందని పేర్కొన్నారు. విక్రమ్-1 మిషన్ భారతీయ ప్రతిభ, శాస్త్రీయ సామర్థ్యం, ఆవిష్కరణల శక్తికి ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. ధైర్యం, పట్టుదల, వినూత్న ఆలోచనలతో ఏ లక్ష్యాన్నైనా సాధించవచ్చనే సందేశాన్ని ఈ ప్రయోగం ప్రతి యువ భారతీయుడికి అందిస్తుందని చెప్పుకొచ్చారు. చరిత్రాత్మక విజయాన్ని సాధించేందుకు కృషి చేసిన స్కైరూట్ ఏరోస్పేస్, ఇస్రో, ఇన్-స్పేస్ సంస్థల బృందాలకు పవన్ కల్యాణ్ హృదయపూర్వక అభినందనలు తెలిపారు. విక్రమ్-1 మిషన్ విజయవంతంగా పూర్తై భారత అంతరిక్ష రంగానికి మరిన్ని విజయాలకు నాంది పలకాలని ఆకాంక్షించారు. భారతదేశాన్ని మరింత ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లే ఈ విజయగాథ రాబోయే తరాలకు స్ఫూర్తిగా నిలిచి, మరింత పెద్ద కలలు కనేందుకు యువతను ప్రేరేపించాలని పవన్ కల్యాణ్ ఆశాభావం వ్యక్తం చేశారు. విక్రమ్-1 రాకెట్ ప్రయోగం విజయవంతమైందని ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. 350 కేజీల బరువున్న ఉపగ్రహాలను లో-ఎర్త్ ఆర్బిట్‌లోకి ఈ రాకెట్ తీసుకెళ్లిందని తెలిపారు. భారత అంతరిక్ష పరిశోధన రంగంలో కొత్త అధ్యాయం ప్రారంభమైందని వెల్లడించారు. ఇస్రో నుంచి తొలిసారిగా స్కైరూట్ ఏరోస్పేస్ విక్రమ్-1 ప్రైవేట్ రాకెట్‌ను ప్రయోగించారని తెలిపారు. ఈ సందర్భంగా ఇస్రో చైర్మన్‌ను, శాస్త్రవేత్తలను మంత్రి లోకేశ్ అభినందించారు.



# నేటిధాత్రి 9 NETI DHATHRI

## తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రెండు తెలుగు రాష్ట్రాల వ్యాప్తంగా "నేటిధాత్రి 9" యూట్యూబ్ ఛానల్ లో పనిచేయుటకు

## ఆసక్తి కలిగిన కెమెరామెన్లు, రిపోర్టర్లకు

# ఆహ్వానం




పత్రికా రంగంలో "23 వసంతాల" అనుభవం
కలిగిన "నేటిధాత్రి" తెలుగు వార్త పత్రిక ఆధ్వర్యంలో
ఇప్పుడు "నేటిధాత్రి 9" యూట్యూబ్ ఛానల్‌ని
"పాఠక దేవుళ్ళ కోసం " " శక్తి బ్రాడ్ కాస్టింగ్స్ " ద్వారా
మీ ముందుకు తీసుకు వస్తున్నామని తెలుపుటకు సంతోషిస్తున్నాము.

"నేటిధాత్రి" పత్రికను ఆదరించిన
విధంగానే "నేటిధాత్రి 9"
" యూట్యూబ్ ఛానల్ " కూడా
ఆదరిస్తారని కోరుకుంటూ....



మీ
**కట్టా శివ సుబ్రహ్మణ్యం**
సీఈఓ నేటిధాత్రి డిజిటల్ మీడియా
8520007444



మీ
**కట్టా రాఘవేందర్ రావ్**
సీఈఓ నేటిధాత్రి దినపత్రిక
8297779999

**సంప్రదించవలసిన చిరునామా..**

Srinivasa Nilayam 3rd Floor UBI Colony Road no: 03
Near TV9 Office Banjara Hills Hyderabad Pin Code : 500034

# ఈ పండు ఎప్పుడైనా తిన్నారా.. ఆరోగ్యానికి ఎంత మంచిదో తెలుసా..?

సాధారణంగా పండు ఏదైనా ఆరోగ్యానికి మేలు చేస్తుంది. ప్రకృతి సిద్ధంగా లభ్యమయ్యే పండువల్ల ప్రయోజనాలే ఎక్కువగా ఉంటాయి. అయితే ఈ ప్రయోజనాలు కొన్ని పండ్లలో ఎక్కువగా, కొన్ని పండ్లలో తక్కువగా ఉంటాయి. ఇలా ఎక్కువ ఆరోగ్య ప్రయోజనాలు ఉండే పండ్లలో పంపర పనస ఒకటి. ఈ పంపర పనస పండు అచ్చం బత్తాయిని పోలి, పరిమాణంలో కొంత పెద్దగా ఉంటుంది. పండు లోపల నిమ్మ, నారింజ, బత్తాయిలాగానే తొనలు ఉంటాయి. సిట్రస్ జాతికి చెందిన ఈ పండు కలర్ ఫుల్‌గా కనిపించడమే కాకుండా మంచి ఆరోగ్య లక్షణాలను కూడా కలిగి ఉంది. పంపర పనస పండుతో కలిగే ఆరోగ్య ప్రయోజనాలు ఏమిటో ఇప్పుడు తెలుసుకుందాం



### రోగ నిరోధక శక్తి వృద్ధి

పంపర పనసలో విటమిన్–సి పుష్కలంగా ఉంటుంది. కాబట్టి ఈ పండు తినడంవల్ల రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. తరచూ ఈ పండును తింటుంటే అనారోగ్యాలు దరిచేరవు.

### గుండెకు మేలు

పంపర పనసలో పొటాషియం, ఫైబర్ పుష్కలంగా ఉంటాయి. ఇవి గుండె ఆరోగ్యానికి మేలు చేస్తాయి. పొటాషియం రక్తపోటును నియంత్రించడంలో సాయపడుతుంది. రక్తపోటు అదుపులో ఉంటే గుండె సంబంధ సమస్యలు సహజగానే అదుపులో ఉంటాయి. ఇక ఈ పండులోని ఫైబర్ కంటెంట్ కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గిస్తుంది. గుండెపోటు ప్రమాదాన్ని నియంత్రిస్తుంది.

### జీర్ణశక్తి మెరుగు

జీర్ణక్రియకు సాయపడే జీర్ణ ఎంజైమ్‌లు కూడా పంపర పనసలో పుష్కలంగా ఉంటాయి. కాబట్టి ఈ పండు తరచూ తీసుకుంటే జీర్ణశక్తి మెరుగుపడుతుంది. ఈ పండులోని ఫైబర్ కంటెంట్ మలబద్దకాన్ని నివారిస్తుంది. ప్రేగు కదలికలను ప్రోత్సహిస్తుంది. దాంతో జీర్ణవ్యవస్థ సమర్థవంతంగా పనిచేస్తుంది.

### బరువు అదుపులో

పంపర పనస రుచిలో తియ్యగా ఉన్నప్పటికీ దీనిలో కేలరీలు తక్కువగా ఉంటాయి. కొవ్వు తక్కువ, ఫైబర్ ఎక్కువ ఉంటుంది. తీపి తినాలనే వారికి ఇది తృప్తిని ఇస్తుంది. అతిగా తినడాన్ని నివారిస్తుంది. బరువు తగ్గాలని అనుకునేవారు పంపర పనస తీసుకుంటే మంచి ప్రయోజనాలు ఉంటాయి.

### చర్మం ఆరోగ్యం

ఈ పండులో విటమిన్ సి, ఫ్లేవనాయిడ్స్ లాంటి యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉండటంవల్ల చర్మాన్ని ఆరోగ్యంగా, యవ్వనంగా ఉంచడంలో కీలక పాత్ర పోషిస్తుంది. యాంటీ ఆక్సిడెంట్లు చర్మ కణాలను దెబ్బతీసే ఫ్రీ రాడికల్స్‌తో పోరాడుతాయి. ముడతలు, గీతలు లాంటి వృద్ధాప్య సంకేతాలను తగ్గించడంలో సాయపడుతాయి. ఈ పండును రెగ్యులర్‌గా తీసుకుంటే కొల్లాజెన్ ఉత్పత్తి పెరుగుతుంది. ఫలితంగా ప్రకాశవంతమైన చర్మం సొంతమవుతుంది.

# ఐదు విటమిన్లు తప్పనిసరి!



ఏ ఇంట్లో అయినా ఇల్లాలు ఆరోగ్యంగా ఉంటే ఆ కుటుంబం కూడా బాగుంటుంది. ఉద్యోగం చేసి సంపాదించే మహిళలు అయినా, ఇంటి పట్టున ఉంటూ కుటుంబ యోగక్షేమాలు చూసుకునే గృహిణులకు అయినా ఇదే సూత్రం వర్తిస్తుంది. అయితే, ఒక వయసు వచ్చేసరికి అందరిలోనూ అనారోగ్య సమస్యలు తలెత్తడం సహజం. హార్మోన్ల అసమతుల్యత, పోషకాహార లోపం, ఒత్తిడి తదితర సమస్యలు వారిని అనారోగ్యానికి చేరువ చేస్తుంటాయి. అయితే, శారీరకంగా బలంగా ఉన్నప్పుడే మానసికంగా దృఢంగా ఉండగలం. నడి వయసుకు వచ్చాక మహిళలు అనారోగ్యంతో సావాసం చేయొద్దంటే ఈ ఐదు విటమిన్లు రోజువారీగా అందేలా జాగ్రత్తలు తీసుకోవాలని చెబుతున్నారు నిపుణులు.

విటమిన్ డి3

దీని లోపం వల్ల ప్రీ మెన్‌స్ట్రువల్ సిండ్రోమ్, పాలిసిస్టిక్ ఓవరీ సిండ్రోమ్, ఇన్సులిన్ తగ్గడం, రుతుచక్రంలో మార్పులు, సమస్యలు వస్తాయి. ఉదయాన్నే సూర్యరశ్మి శరీరానికి తాకితే విటమిన్ డి3 పుష్కలంగా లభిస్తుంది. అంతేకాదు, సాల్మన్ చేపలు, గుడ్లు, పాలు, పాల ఉత్పత్తులకు రెగ్యులర్ డైట్‌లో చోటివ్వడం వల్ల కూడా విటమిన్ డి3 శరీరానికి అందుతుంది.

### విటమిన్ సి

విటమిన్ సి లోపంతో బాధపడేవారికి ప్రొజెస్టిరాన్ ఉత్పత్తి సరిగ్గా ఉండదు. సంతానోత్పత్తి సమస్యలు కూడా వచ్చే ప్రమాదం ఉంది. నిమ్మకాయ, నారింజ, ఆరెంజ్ వంటి పుల్లటి పండ్ల నుంచి విటమిన్ సి లభిస్తుందని అందరికీ తెలిసిందే. వాటితోపాటు బ్రకోలి, టమాట, క్యాప్సికమ్ నుంచి కూడా శరీరానికి విటమిన్ సి అందుతుంది. జామకాయలు తరచూ తినడం మంచిది. ఇది చర్మ సంరక్షణకూ సహకరిస్తుంది.

### విటమిన్ బి12

ప్రస్తుతం ఎక్కువమంది విటమిన్ బి12 లోపాన్ని ఎదుర్కొంటున్నారు. ఇది లోపిస్తే.. ఎర్ర రక్త కణాల ఉత్పత్తి మందగిస్తుంది. థైరాయిడ్ సమస్యలు వస్తాయి. మాంసం, చేపలు, గుడ్లు ఎక్కువగా తీసుకుంటే విటమిన్ బి12 లోపం నుంచి బయటపడవచ్చు.

### విటమిన్ బి9

విటమిన్ బి9 లోపంతో గర్భధారణ, సంతానోత్పత్తిలో సమస్యలు ఎదురవుతాయి. ఆకుకూరలు, కూరగాయలు, తృణధాన్యాలు తీసుకుంటే విటమిన్ బి9 పుష్కలంగా అందుతుంది.

### విటమిన్ బి6

విటమిన్ బి6 లోపం ఉన్న మహిళల్లో ప్రీ మెన్‌స్ట్రువల్ సిండ్రోమ్, ప్రీ మెన్‌స్ట్రువల్ డైస్ఫోరిక్ డిజార్డర్, అడ్రినల్ గ్రంథి సమస్యలు కనిపిస్తాయి. ఈ విటమిన్ లోపం కారణంగా నిద్రలేమి సమస్య వస్తుంది. మెదడు ఆరోగ్యం కూడా దెబ్బతింటుంది. అరటిపండ్లు, ఆలుగడ్డలు, చికెన్ తినడం వల్ల విటమిన్ బి6 లభిస్తుంది.

# ఇద్దరిలో ఒకరు ఎందుకలా

హలో జిందగీ. కవల పిల్లలు పుట్టినప్పుడు ఒకరు బలహీనంగా మరొకరు బలంగా, ఒకరు ఆరోగ్యంగా మరొకరు సమస్యలతో పుట్టడానికి కారణం ఏమిటి? కవల పిల్లలు కడుపులో ఉన్నప్పుడు వాళ్లు చక్కటి ఆరోగ్యంతో పుట్టాలంటే ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి? తెలుపగలరు.

ఓ పాఠకురాలు



కవల పిల్లల్లో ఒకరు బలంగా, ఇంకొకరు బలహీనంగా ఉండటానికి రకరకాల కారణాలు ఉంటాయి. ముఖ్యంగా వాళ్లు ఒకే అండం నుంచి ఏర్పడ్డారా లేదా రెండు అండాల నుంచి ఏర్పడ్డారా అన్నది ముఖ్యం. వంశపారంపర్యం ఉన్నవాళ్లకు రెండు వేర్వేరు అండాల నుంచి పిండాలు ఏర్పడతాయి. దానివల్ల ఇద్దరు పిల్లలూ కొంత ఆరోగ్యంగా ఉండటానికి అవకాశం ఉంది. కానీ ఒకే అండం నుంచి ఏర్పడి ఒకే మాయ, ఉమ్మనీరు పంచుకుంటే మాత్రం ఎక్కువ శాతం ఒకరు బలహీనంగా ఉంటారు. ఐవీఎఫ్‌లాంటి విధానాల్లో పిండం ఏర్పడితే ఇలాంటి పరిస్థితే ఎదురవుతుంది. ముఖ్యంగా ఒకే మాయలో ఉన్నప్పుడు ఇద్దరికీ రక్త ప్రసరణ సమానంగా ఉండదు. ఒకరికి ఎక్కువ, మరొకరికి తక్కువ అందుతుంది. అలాగే ఒక బిడ్డ నుంచి మరో బిడ్డకు రక్తం వెళ్లే పరిస్థితులూ ఉంటాయి.


అలాంటప్పుడు మొదటి బిడ్డ గుండె బలహీనంగా ఉంటుంది. ఇవి మాత్రమే కాదు, బిడ్డ ఏర్పడటంలోనూ రకరకాల ఇబ్బందులు తలెత్తుతాయి. తల్లికి కూడా హైబీపీ వచ్చే అవకాశాలు ఉంటాయి. ప్రీ మెచ్యూర్ డెలివరీ అయ్యే అవకాశాలూ ఎక్కువే. అలాగే డెలివరీ సమయంలో రక్తం ఎక్కువగా పోతుంది. ఇద్దరు బిడ్డలకు సరిపడా పెద్దగా సాగిన గర్భాశయం తిరిగి సాధారణ స్థితికి రావడానికి సమయం పడుతుంది. అందుకే, కడుపులో కవలలు ఉన్నప్పుడు డాక్టర్ చెప్పిన సూచనలను జాగ్రత్తగా పాటించాలి. ముఖ్యంగా చిన్నపిల్లలకు అత్యవసరమైన ఎన్ఐసీయూ సదుపాయం ఉండే ఆసుపత్రులకు అందుబాటులో ఉండాలి. మొత్తంగా చెప్పాలంటే సాధారణ గర్భం కంటే మరింత జాగ్రత్తగా ఉండటం ద్వారా కొంతవరకూ కాంప్లికేషన్లను అధిగమించవచ్చు.

**డాక్టర్ పి. బాలాంబ సీనియర్ గైనకాలజిస్ట్**



# సత్తువ పిండి

మన పెద్దలకు సత్తుపిండి ప్రయోజనాలు బాగా తెలుసు. అందుకే వాళ్లు తరచుగా సత్తుపిండిని ఆహారంగా తీసుకునేవాళ్లు. ఇప్పటికీ తెలంగాణ సహా కొన్ని రాష్ట్రాల్లో గ్రామీణుల ఆహారంలో సత్తుపిండి ఓ భాగమే. పేదవాళ్ల ప్రొటీన్ల భాండాగారంగా భావించే సత్తుపిండి ప్రయోజనాలను ఇప్పటితరం అంతగా పట్టించుకోవడం లేదు. వీర శివాజీ మెచ్చిన ఈ సహజమైన ప్రొటీన్ పొడి అచ్చంగా భారతీయ ఆహారమే.



### సత్వర శక్తి

సత్తుపిండి శరీరానికి వెంటనే శక్తిని ప్రసాదిస్తుంది. 100 గ్రాముల సత్తుపిండిలో ప్రొటీన్లు 25 నుంచి 30 గ్రాముల వరకు ఉంటాయి. అలా శాకాహారులకు నాణ్యమైన ప్రొటీన్లను ప్రసాదిస్తుంది. అంతేకాదు ఇందులో ఫైబర్ కూడా ఎక్కువే. ఇది మన కడుపును శుద్ధిచేస్తుంది. గ్యాస్, ఎసిడిటీ, మలబద్ధకంతో బాధపడుతున్న వారికి సత్తుపిండి మంచి ఆహారపదార్థం.

### అందరి ఆహారం

సత్తుపిండిలో ట్లగ్లైసిమిక్ ఇండెక్స్ తక్కువగా ఉంటుంది. రక్తంలో చక్కెర స్థాయిలు తక్కువగా పెరుగుతాయి. అలా ఇది డయాబెటిస్ ఉన్నవాళ్లకూ మంచిదే. సోడియం తక్కువ ఉండటంతో అధిక రక్తపోటు ఉన్నవారు కూడా ఆరగించవచ్చు. క్యాల్షియం, ఐరన్, మాంగనీస్, మెగ్నీషియం, ఎ, సి విటమిన్లు కూడా శరీరానికి అందుతాయి. 25 గ్రాముల సత్తుపిండిలో 100 క్యాలరీలు ఉన్నప్పటికీ, దీని ప్రయోజనాలతో పోలిస్తే క్యాలరీల సమస్య పెద్దది కాదు. కండరాలకు శక్తినిస్తుంది కాబట్టి, పెరిగే పిల్లలకూ సత్తుపిండి గొప్పదే.

### ఆహారంలో

బీహార్, జార?ండ్ రాష్ట్రాల్లో సత్తుపిండితో లిట్టి అనే వంటకం చేస్తారు. కూరగాయలు జోడించి పరాఠాలు, ఉప్మా చేసుకోవచ్చు. సత్తుపిండికి ఉల్లిపాయలు కలిపి పకోడీలుగా వేసుకోవచ్చు. సత్తుతో లడ్డూలు, మామిడిపండు రసంతో స్మూతీ, సత్తు కబాబ్‌లు కూడా చేస్తారు. ఇక సత్తుపిండికి కొబ్బరి తురుము, డ్రై ఫ్రూట్స్, శనగపిండి, నెయ్యి, చక్కెర, యాలకుల పొడి లాంటివి చేర్చి చేసే సత్తు పంజిరి రుచిగా ఉంటుంది. నీళ్లు కలిపిన సత్తుపిండి ముద్దకు చక్కెర లేదంటే ఊరగాయ కలుపుకొని ఉపాహారంగానూ ఆరగించవచ్చు. మళ్లీ మధ్యాహ్నం వరకు కడుపులో ఎలుకలు ఉరుకులాడవు.

పానీయంగా

శనగలను ఇసుకలో వేయించి, ఆ తర్వాత వాటిని జల్లెడపడతారు. వీటిని పిండిగా మారుస్తారు. సత్తుపిండి అంటే ఇదే. సత్తుపిండిని బెల్లంతో కలుపుకొని గానీ, ఉప్పు, వేయించిన జీలకర్ర పొడితో కలుపుకొని గానీ తాగితే ఆరోగ్యానికి మంచిది. సత్తు షర్బత్ ఎండాకాలంలో శరీరానికి చల్లదనాన్ని ఇస్తుంది. నిమ్మరసం, పుదీనా ఆకులు కూడా జోడించుకోవచ్చు. ఇది శక్తిదాయిని.

### మితం తప్పొద్దు

మంచిదని చెప్పి సత్తుపిండిని ఎక్కువగా తింటే కడుపులో గ్యాస్ సమస్య తలెత్తుతుంది. కాబట్టి, గ్యాస్ట్రిక్ సమస్యలు ఉన్నవాళ్లు మితంగా తినాలి. పిత్తాశయంలో రాళ్లు ఉన్నవాళ్లు సత్తుపిండి తినకూడదు. కిడ్నీల్లో రాళ్లు ఉంటే డాక్టర్ సలహా తీసుకోవాలి. ఇక శనగలంటే అలర్జీ ఉన్నవాళ్లు, సత్తుపిండి అరిగించుకోలేని వాళ్లు కూడా సత్తుకు దూరంగా ఉంటే మంచిది.

# వేళకు తింటేనే భళా!



ఆహారంలో పోషకాలు ఉండటం చాలా అవసరం. తేలికపాటి అల్పాహారం ఆరోగ్యాన్ని ఇస్తుంది. మధ్యాహ్న భోజనం పప్పు, కూరలతో నిండుగా ఉండాలి. ఓ మోస్తరుగా రాత్రి డిన్నర్ ప్లాన్ చేసుకోవాలి. ఇవన్నీ మాకు తెలుసులే అంటారా! మంచిదే!! కానీ, ఈ పోషకాలు ఏ సమయంలోగా తీసుకోవాలో తెలిసినప్పుడే ఆరోగ్యానికి శ్రీరామ రక్ష అని గుర్తుంచుకోండి.

### టైమ్‌కు టిఫిన్

రోజులో అల్పాహారం చాలా ముఖ్యమైన భాగం. సుదీర్ఘ సమయం తర్వాత తీసుకునే ఆహారమిది. బ్రేక్‌ఫాస్ట్ సరిగ్గా ఉంటేనే శరీరం ఆ రోజు పనికి ఉత్సాహంగా సిద్ధమవుతుంది. ఉదయం నిద్ర లేచిన తర్వాత గంటలోపు అల్పాహారం తీసుకోవడం చాలా మంచిది. సమయం ప్రకారం.. ఉదయం 7 నుంచి 8 గంటల మధ్య టిఫిన్ చేయాలి. అప్పుడే అది ఒంట బడుతుంది. ఎప్పుడైనా ఆలస్యమైతే ఓకే! ఎట్టి పరిస్థితిల్లోనూ ఉదయం పది గంటల లోపు బ్రేక్ ఫాస్ట్ ముగించాలని గుర్తుంచుకోండి. బ్రేక్‌ఫాస్ట్‌లో కాయగూరలు, పండ్లు ఉండేలా చూసుకోవాలి. ప్రొటీన్లు సమృద్ధిగా అందాలి.

### లంచ్ బెల్

అల్పాహారం తీసుకున్న నాలుగు గంటల తర్వాత భోజనానికి సరైన సమయం. ఇంకా చెప్పాలంటే మధ్యాహ్నం 12 నుంచి 1.30 గంటల మధ్య భోజనం చేయాలి. ఆ సమయంలో శరీరం మంచి ఆకలి మీద ఉంటుంది. అప్పుడు తినే ప్రతి ముద్దా%ా% శరీరానికి శక్తినిస్తుంది. భోజనంలో కూరగాయలు, లీన్ ప్రొటీన్స్, కాంప్లెక్స్ పిండిపదార్థాలు ఉండేలా చూసుకోవాలి.

### డిన్నర్ విన్నర్

రాత్రి నిద్రకు ఉపక్రమించడానికి రెండు గంటల ముందు డిన్నర్ చేసేలా చూసుకోవాలి. చీకటి పడినప్పుడు శరీర గడియారం చురుగ్గా మారుతుంది. మెలటోనిన్ స్థాయులు పెరుగుతాయి. పాంక్రియాస్ కార్యాచరణ కూడా తగ్గుతుంది. పడుకోవడానికి పది నిమిషాల ముందు భోజనం చేస్తే%ా% రక్తంలో చక్కెర పెరుగుతుంది. జీవక్రియలు కూడా మందకొడిగా సాగుతాయి. ఇది అధిక బరువుకు కారణం అవుతుంది. అందుకే, రాత్రి ఏడు నుంచి ఎనిమిది గంటల మధ్య డిన్నర్ చేస్తే.. మీరే విన్నర్.

# గోధుమ పిండికి ఇవి కలిపితే టేస్టీ, హెల్దీ రోటీలు రెడీ..!



బరువు తగ్గాలనుకునే వారు రైస్ పక్కనపెట్టి రోటీలు తినడం సర్వసాధారణం. గోధుమ పిండితో చేసే రోటీలు, చపాతీలకు బదులు ఈ పిండిలో పోషకాలతో కూడిన పలు రకాల పొడులు, పిండి కలపడం ద్వారా మెరుగైన ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చని పోషకాహార నిపుణులు సూచిస్తున్నారు. గోధుమ పిండితో చేసే రెగ్యులర్ రోటీలను కొద్దిపాటి మార్పులతో రుచిగా, హెల్దీగా తయారుచేసుకోవచ్చు

గోధుమ పిండిలో పోషకాల గనిగా పేరొందిన మునగాకు పొడిని మిక్స్ చేస్తే ఆరోగ్యానికి మేలు చేస్తుంది. కప్పు గోధుమ పిండిలో కేవలం ఒక స్పూన్ మునగాకు పొడి కలిపితే రోటీలు ఆకుపచ్చ వర్ణంలో పోషకాలతో నిండిఉంటాయి. మునగాకులో ఉండే విటమిన్ ఏ, పాలకూరలో కంటే మూడు రెట్లు అధికం. ఇందులో ఉండే అధిక ఫైబర్, యాంటీఆక్సిడెంట్ క్లోరోజెనిక్ యాసిడ్ కారణంగా బరువు నియంత్రిస్తుంది.

మునగాకు పొడితో పాటు యాంటీఇన్‌ఫ్లమేటరీ, యాంటీఆక్సిడెంట్ పదార్థాలు పుష్కలంగా ఉండే పసుపును వాడటం కూడా ఆరోగ్యానికి మేలు చేస్తుంది. ఆటాలో ఒక కప్పు పిండికి స్పూన్ పసుపు కలిపితే రోటీలు బంగారు వర్ణంలో మెరుస్తూ అద్భుత రుచినీ అందిస్తాయి. ఆర్థరైటిస్, జీర్ణ సమస్యలు, కుంగుబాటు, అలర్జీలకూ పసుపు దివ్యౌషధంగా పనిచేస్తుంది. పప్పు, కర్రీస్‌కు కూడా పసుపు మంచి రుచిని అందిస్తుంది. ఇక రోటీలు టేస్ట్‌గా, ఆరోగ్య ప్రయోజనాలను అందించేలా ఉండాలంటే వీటిని మిక్స్ చేస్తే బెటర్..

మునగాకు పొడి ,పసుపుజి,మెంతి పొడి

వాముజి,అవిసె గింజలు

# పేగులు బాగుండాలంటే..

ఆయాసం, వాంతులు, మలబద్ధకం, గ్యాస్, అవాంఛితంగా బరువు పెరగడం, బరువు తగ్గడం, నిద్రలేమి, అలసట ఇవన్నీ పేగుల అనారోగ్యాన్ని సూచిస్తాయి. ఇక పేగులను ఆరోగ్యంగా ఉంచడంలో ప్రొబయోటిక్ ఆహార పదార్థాలు ముఖ్యపాత్ర పోషిస్తాయి. వాటికోసం ఎక్కడో వెతకాల్సిన పన్లేదు. మన వంటల్లోనే ఉన్నాయి.

రసం: పప్పు, చింతపండు, మూలికలు, సుగంధ ద్రవ్యాలు రసం తయారీకి ముడిసరుకులు. వీటిలో ఎ, సి విటమిన్లు, మెగ్నీషియం, ఇనుము, కాల్షియం సమృద్ధిగా ఉంటాయి. రసంలో పీచు పదార్థాలూ ఉంటాయి. ఇవి జీర్ణ వ్యవస్థకు గొప్పగా ఉపయోగపడతాయి.

కఢీ: దీన్ని శనగపిండితో చేస్తారు. ఇందులో పుష్కలంగా ఉండే మెగ్నీషియం, ఫైబర్ పేగుల ఆరోగ్యానికి అత్యవసరం. కడుపునొప్పి, మలబద్ధకం, బరువు తగ్గడానికి వంటింటి చిట్కా కఢీ.

మెంతికూర: బరువు తగ్గడం, మలబద్ధకం లాంటి పేగులకు సంబంధించిన సమస్యలలో మెంతులు ఎంతో సహాయకారి. ఈ ఆహార పదార్థాలకు అదనంగా వ్యాయామం, యోగా, తగినన్ని నీళ్లు పేగులను ఆరోగ్యంగా ఉంచడంలో కీలకపాత్ర పోషిస్తాయి.

## పరకాల పట్టణంలో గాంధీ విగ్రహాన్ని
# ఏర్పాటు చేయాలి





గతంలో ఉన్న మహాత్మా గాంధీ విగ్రహం

పరకాల,నేటిధాత్రి:

పరకాల పట్టణంలో మహాత్మా గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని స్థానికులు,సామాజికవేత్తలు,ప్రజా సంఘాల ప్రతినిధులు కోరుతున్నారు.పట్టణంలోని రాజీపేట అంబేద్కర్ సర్కిల్ వద్ద గతంలో మహాత్మా గాంధీ విగ్రహం ఉండేది,ప్రస్తుతం ఆ స్థానంలో కేవలం పీఠం మాత్రమే మిగిలి ఉండడంతో అదే ప్రదేశంలో గాంధీజీ విగ్రహాన్ని తిరిగి ఏర్పాటు చేసి జాతిపితకు తగిన గౌరవం కల్పించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.భారత స్వాతంత్ర్య ఉద్యమానికి నాయకత్వం వహించిన మహాత్మా గాంధీ సత్యం,అహింస,శాంతి సిద్ధాంతాలతో ప్రపంచానికి ఆదర్శంగా నిలిచారని స్థానికులు పేర్కొన్నారు.దేశ నిర్మాణంలో ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని,నేటి తరానికి ఆయన ఆశయాలు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాయని అన్నారు.అందువల్ల పరకాల పట్టణంలో గాంధీజీ విగ్రహం ఏర్పాటు చేయడం అవసరమని అభిప్రాయపడుతున్నారు.రాజీపేట అంబేద్కర్ సర్కిల్లో గతంలో ఉన్న గాంధీ విగ్రహానికి గాంధీ జయంతి,స్వాతంత్ర్య దినోత్సవం,గణతంత్ర దినోత్సవం వంటి జాతీయ పర్వదినాల సందర్భంగా అధికారులు,ప్రజాప్రతినిధులు,వివిధ రాజకీయ పార్టీల నాయకులు,సామాజిక సంస్థల ప్రతినిధులు నివాళులర్పించేవారని స్థానికులు గుర్తు చేస్తున్నారు.ప్రస్తుతం విగ్రహం లేకపోవడంతో జాతీయ పర్వదినాల సందర్భంగా గాంధీజీకి నివాళు లర్పించే అవకాశం లేకపోవడం బాధాకరమని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అందువల్ల సంబంధిత అధికారులు,ప్రజాప్రతినిధులు స్పందించి మహాత్మా గాంధీ విగ్రహాన్ని తిరిగి ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.జాతిపితకు తగిన గౌరవం కల్పించడంతో పాటు,ఆయన ఆశయాలను భావితరాలకు చేరవేసేలా వీలైనంత త్వరగా చర్యలు చేపట్టాలని వారు విజ్ఞప్తి చేశారు.

**వెంటనే చర్యలు తీసుకోవాలి**

మహాత్మా గాంధీ కేవలం స్వాతంత్ర్య సమరయోధుడే కాకుండా భారతదేశానికి నైతిక విలువలను అందించిన మహనీయుడు,అలాంటి జాతిపితకు పరకాల పట్టణంలో శాశ్వత గుర్తుగా విగ్రహం లేకపోవడం విచారకరం.ప్రజల మనోభావాలను గౌరవిస్తూ ప్రభుత్వం ఈ అంశాన్ని ప్రత్యేకంగా పరిగణించి వెంటనే చర్యలు చేపట్టాలి.రాజకీయాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలు గాంధీజీ ఆశయాలను గౌరవిస్తారు,అందుకే పట్టణంలో మహాత్మా గాంధీ విగ్రహాన్ని తిరిగి ఏర్పాటు చేయాలి.విగ్రహం ఏర్పాటు ద్వారా యువతలో దేశభక్తి, ప్రజాస్వామ్య విలువలు,అహింస సిద్ధాంతాల పట్ల అవగాహన మరింత పెరుగుతుంది.సంబంధిత అధికారులు ఆలస్యం చేయకుండా గాంధీ విగ్రహం ఏర్పాటుకు అవసరమైన చర్యలు చేపట్టాలి.



ఆముదాలపల్లి మల్లేశం గౌడ్

# వివరణ.

"నేటిధాత్రి" దిన పత్రిక లో సీఐ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో దొంగల పట్టి వేత" అనే వార్త కు సంబంధించిన హెడ్డింగ్‌లో పొరపాటు జరిగింది. రిపోర్టర్,ఆపరేటర్ పొరపాటు వల్ల హెడ్డింగ్ లో పొరపాటు దొర్లింది. ఇకపై అలాంటి తప్పులు దొర్లకుండా జాగ్రత్తలు తీసుకోవడం జరుగుతుంది. దయచేసి జరిగిన పొరపాటుకు క్షమాపణ కోరుతున్నాము. వార్తలో ఎక్కడా పొరపాటు లేదు. అది గమనించగలరని మనవి. ధన్యవాదములు.

ఇట్లు,
నేటిధాత్రి డెస్క్

# సవరణ

**దొగతనం కేసును వేగంగా చేధించిన ఎస్ఐ లను, సిబ్బందిని అభినందించిన "సీఐ నాగేశ్వరరావు"**




నిందితుల అరెస్టు చూపిన పోలీసులు ....

తంగళ్ళపల్లి, నేటిధాత్రి: తంగళ్ళపల్లి మండలం బద్దెనపల్లి గ్రామానికి చెందిన. అరె టి పోచయ్య అరెటి. వెంకటేష్ కు చెందిన గేదెల దొంగతనం జరగడంతో. సదరు బాధితులు తంగడపల్లి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా. పోలీసులు రంగంలోకి దిగి దర్యాప్తులో భాగంగా. పోలీసులు. బాధితులకు చెందిన మూడు. గేదలు దొంగిలించడం జరిగిందని నిర్ధారించి సాంకేతిక ఆధారాల. సహాయంతో. నిందితులను గుర్తించిన పోలీసులు. గుంటూరు జిల్లాలోని. తాడేపల్లి కి. ప్రత్యేక పోలీసు బృందాన్ని పంపించారు. అక్కడ ముగ్గురి నిందితులో ఇద్దరిని అదుపులకు తీసుకొని విచారించగా. దొంగతనం చేసినట్లు. నేరాన్ని అంగీకరించినట్లు, పోలీసులు వెల్లడించారు. నిందితుల దగ్గర నుండి ఒక లక్ష 30 వేల రూపాయలు. నగదు స్వాధీనం చేసుకున్నట్లు. పోలీసులు తెలిపారు. నిందితుల్లో,ఒకరు పరారీలో ఉన్నట్లు. అతడి కోసం గాలింపు జరుగుతుందని తెలియజేస్తూ. ఇట్టి కేసును. వేగంగా చేదించిన. తంగళ్ళపల్లి ఎస్సై ఎం ఉపేంద్ర చారి. 2. ఎస్సై మల్లేశం. పోలీసులు. సంపత్ కుమార్ ను శ్రీనివాసులను. పోలీసులు సీఐ. కే నాగేశ్వరరావు

నేటిధాత్రి
https://epaper.netidhatri.com/clip/3436918 Jul 2026Page 10

## ఇదేం సమావేశం.. మహిళా సర్పంచులకు
# బదులు బంధువులు హాజరు ?

కుబీర్, నేటిధాత్రి:


మహిళలు అన్ని రంగాల్లో రాణించాలనే ఉద్దేశంతో కల్పించిన హక్కులు ఆదిలోనే నీరుగారిపోతున్నాయి. నిర్మల్ జిల్లా కుబీర్ మండల కేంద్రంలో శనివారం జరిగిన సమావేశం ఇందుకు ఉదాహరణగా మారింది.ఐకేపీ కార్యాలయంలో శనివారం ' వర్షాభావ పరిస్థితులు -- తీసుకోవాల్సిన జాగ్రత్తలు' అనే అంశంపై ఎంపీడీఓ అక్బర్ దేవ్ శ్రీనివాస్, మండల ప్రత్యేక అధికారి జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు.

# "చినుకే పడితే... స్మశానం చెరువే..!"

**చిన్న వర్షానికే జలమయం.. దహన సంస్కారాలకూ ఇబ్బందులు**



- గ్రేటర్ వరంగల్ ఉర్సు ప్రాంతం 40వ డివిజన్ స్మశానవాటిక దుస్థితి
- మూడు డివిజన్ల ప్రజలకు తీవ్ర ఇబ్బందులు
- అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని స్థానికుల విజ్ఞప్తి



వరంగల్, నేటిధాత్రి:

గ్రేటర్ వరంగల్ ఉర్సు ప్రాంతం, 40వ డివిజన్ లోని హిందూ స్మశానవాటిక చిన్నపాటి వర్షానికే నీటమునిగి పోతోంది. దీంతో మృతదేహాలకు కనీసం దహన సంస్కారాలు నిర్వహించడం కూడా కష్టసాధ్యంగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై ఇప్పటికే పలుమార్లు ప్రజాప్రతినిధులు, అధికారులకు వినతులు అందించినప్పటికీ ఎలాంటి శాశ్వత పరిష్కారం చూపలేదని వారు ఆరోపిస్తున్నారు.

ఉర్సు ప్రాంతానికి చెందిన మూడు డివిజన్ల ప్రజలు ఈ ఒక్క స్మశానవాటికపైనే ఆధారపడాల్సి వస్తుండటంతో వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు.

వర్షపు నీరు నిల్వ ఉండకుండా డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచడంతో పాటు స్మశానవాటికలో అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని, సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు గ్రేటర్ వరంగల్ మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులను కోరుతున్నారు.

# అంబేద్కర్ భవనం పబ్లిక్ టాయిలెట్ దుస్థితి..

**దుర్వాసనతో స్థానికుల అవస్థలు**



వరంగల్, నేటిధాత్రి..

వరంగల్ ఓ సిటీ సమీపంలోని ప్రతాప్‌నగర్‌లో ఉన్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ భవనం పబ్లిక్ టాయిలెట్‌లో సరైన పారిశుద్ధ్య వసతులు లేక స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. టాయిలెట్ నుంచి వెలువడుతున్న మురుగునీరు, భరించలేని దుర్వాసనతో పరిసర ప్రాంత ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.

మురుగునీరు నిల్వ ఉండటంతో దోమలు, ఈగలు విపరీతంగా పెరిగి జ్వరాలు, వాంతులు, విరేచనాలు వంటి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చిన్నారులు, వృద్ధులు, మహిళలు ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని జిల్లా యంత్రాంగం, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి పబ్లిక్ టాయిలెట్‌కు అవసరమైన పారిశుద్ధ్య వసతులు కల్పించడంతో పాటు మురుగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని ప్రతాప్‌నగర్ నగరవాసులు విజ్ఞప్తి చేశారు.


# కాళేశ్వరం...ఆత్మరక్షణలో కాంగ్రెస్ ప్రభుత్వం!

డెస్క్, నేటిధాత్రి:

దొంగలు పడ్డ ఆరు నెలలకు అన్న చందంగా ప్రభుత్వం ఏర్పడి రెండున్నరేళ్లు కావస్తున్న తరుణంలో ఇప్పుడు ధరణిపై విచారణకు ఓ కమిటీని వేయాలని రేవంత్ సర్కార్ తీసుకున్న నిర్ణయం నవ్వులు తెప్పించేదిగా ఉంది. కేసీఆర్, బీఆర్ఎస్ అవినీతిపై పెద్దపెద్ద మాటలు మాట్లాడి అధికారంలోకి వచ్చిన రేవంత్ ఇప్పటి వరకు పైసా అవినీతిని నిరూపించలేకపోయారు. కాళేశ్వరం, ధరణి, కార్ రేస్, పవర్ ప్లాంట్లు, విద్యుత్ ఒప్పందాలు తదితర అంశాలన్నీ ఇప్పుడు ప్రచార వస్తువుగా మారాయి. కేవలం బీఆర్ఎస్‌పై రాజకీయంగా పైచేయి సాధించేందుకే విమర్శలు చేస్తున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఇందులో ప్రధానంగా కాళేశ్వరం 'కూలేశ్వరం' అంటూ చేసిన ఆరోపణల్లో ఇంచుమించు ఎలాంటి పురోగతి కనిపించలేదు. లక్ష కోట్ల రూపాయలు వెచ్చించి నిర్మించిన ప్రాజెక్టు పడావు పడింది. దానిని ఎలాగైనా వినియోగంలోకి తీసుకువచ్చి ప్రజాధనాన్ని కాపాడాలన్న ముందుచూపు ప్రభుత్వంలో కనిపించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఎంతసేపూ రాజకీయ విమర్శలకే పరిమితమవుతూ, గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై చేసిన అవినీతి ఆరోపణల్లో ఎలాంటి పురోగతి సాధించలేదు. రేవంత్ రెడ్డి దీనిని కేవలం రాజకీయంగా ఉపయోగించుకొని బీఆర్ఎస్‌ను భ్రష్టుపట్టించే యోచనలో ఉన్నారా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.





ఎందుకంటే కాళేశ్వరాన్ని పక్కనపెట్టి ఇప్పుడు మళ్లీ ప్రాణహిత అంటూ కొత్త పల్లవి అందుకున్నారు. ఇప్పటికే ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయడం, వాటిని వినియోగంలోకి ఎలా తీసుకురావాలన్న అంశాన్ని పక్కన పెట్టారు. అందుకే నిత్యం కాళేశ్వరం ప్రాజెక్టు వివాదం కొనసాగుతూనే ఉంది. రాజకీయ విమర్శలకు కాళేశ్వరం వేదికగా మారుతోంది. పరస్పర విమర్శలు తప్ప గోదావరి జలాలను ఎలా ఉపయోగించుకోవాలన్న దానిపై ఎవరూ దృష్టి సారించడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి నీటి విడుదల వ్యవహారం కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల మధ్య సవాళ్లు, ప్రతిసవాళ్లు, పరస్పర ప్రజెంటేషన్లకు కేంద్రంగా మారింది. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు వెనక్కి పోయాయి. మరోవైపు కాళేశ్వరం నుంచి గోదావరి జలాలను తరలించడం అసాధ్యమని ప్రభుత్వం తేల్చి చెబుతోంది. ఈ ప్రాజెక్టును అత్యంత ప్రతిష్ఠాత్మకంగా పూర్తి చేసినప్పటికీ మేడిగడ్డ వద్ద కొన్ని పిల్లర్లు కుంగిపోవడంతో ఇక అది పనికిరాదన్న రీతిలో ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు కనిపిస్తోంది. మోటార్లు, కాలువలు అన్నీ వృథాగా మారుతున్నాయని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఇదే విషయాన్ని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ ప్రస్తావిస్తే ఆయనను బీఆర్ఎస్ ఏజెంట్‌గా అభివర్ణిస్తూ విమర్శలు గుప్పించారు. నిజానికి 2023 శాసనసభ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమిలో కాళేశ్వరం, ధరణి అంశాలు ప్రధాన పాత్ర పోషించాయి. అధికారంలోకి రావడానికి అనేక హామీలు, వాగ్దానాలు గుప్పించిన రేవంత్ సర్కార్ ఇప్పుడు గుడ్డెద్దు చేలో పడ్డట్లుగా వ్యవహరిస్తోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. పదికాలాల పాటు పనికివచ్చే నిర్ణయాలు తీసుకోవడంలో ప్రభుత్వం వెనుకబడిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ముఖ్యంగా కాళేశ్వరం ప్రాజెక్టుపై ఎలాంటి విధానం అనుసరించాలన్న దానిపై ప్రభుత్వం స్పష్టమైన అవగాహనతో వ్యవహరించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. కాళేశ్వరం పిల్లర్లను పునరుద్ధరించి, నీటిని వినియోగంలోకి తీసుకొచ్చి ఉంటే ఈ ఏడాది మంచి ఫలితాలు వచ్చేవని, ప్రభుత్వానికి కూడా మంచిపేరు వచ్చేదని పలువురు అభిప్రాయపడుతున్నారు. అయితే కాళేశ్వరం ప్రాజెక్టును వినియోగించరాదన్న మొండి వైఖరితో రేవంత్ ప్రభుత్వం వ్యవహరిస్తోందనే ఆరోపణలు ఉన్నాయి.

ప్రాజెక్టు భద్రత ప్రమాదంలో ఉందని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్ఏ) పేర్కొన్నందున అక్కడ నీటిని నిల్వ చేసి వినియోగించడం సాధ్యం కాదని ప్రభుత్వం చెబుతోంది. గతంలో కాళేశ్వరం "ఏటీఎం"గా మారిందని బీజేపీ కూడా ఆరోపించింది. రేవంత్ రెడ్డి కూడా ఇదే ప్రచారం చేశారు. అయితే నిజంగానే అవినీతి జరిగి ఉంటే, దానిని వెలికితీసి కేసీఆర్ తదితరులను చట్టపరంగా దోషులుగా నిరూపించి ఉంటే రేవంత్‌కు రాజకీయంగా మరింత బలం చేకూరేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కానీ రెండున్నరేళ్లుగా ఆరోపణలకే పరిమితమయ్యారనే విమర్శలు వస్తున్నాయి.

కాళేశ్వరం అంశంపై ప్రభుత్వం జస్టిస్ పి.సి. ఘోష్ కమిషన్‌ను కూడా ఏర్పాటు చేసింది. అయితే కమిషన్ నివేదికపై హైకోర్టు స్టే విధించింది. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, అప్పటి సాగునీటి శాఖ మంత్రి హరీశ్‌రావులను అరెస్టు చేస్తారన్న ప్రచారం కూడా జరిగింది. కానీ చివరికి అలాంటిదేమీ జరగలేదు. దీంతో కమిషన్ నివేదికకు కూడా పెద్దగా ప్రాధాన్యం లేకుండా పోయిందా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

ప్రస్తుతం కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బారేజీల వద్ద నీటిని నిల్వ చేసి పంప్‌హౌస్‌ల ద్వారా ఆయా రిజర్వాయర్లను నింపాలని బీఆర్ఎస్ డిమాండ్ చేస్తోంది. అయితే ఇందుకు ప్రభుత్వం ససేమిరా అంటోంది. మరోవైపు చంద్రబాబు కోసం గోదావరి జలాలను దిగువకు వదిలేస్తున్నారని బీఆర్ఎస్ నేతలు ఆరోపిస్తున్నారు.

ఒకవైపు వర్షాభావ పరిస్థితులతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అలాంటి పరిస్థితుల్లో వర్షాలు తక్కువగా కురిసిన ప్రాంతాలకు నీటిని ఎలా అందించాలన్న దానిపై ప్రభుత్వం దృష్టి పెట్టాల్సి ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. కేసీఆర్ నిర్మించిన ప్రాజెక్టు కాబట్టి అది కేసీఆర్ వ్యక్తిగత ఆస్తి కాదని, ప్రజాధనంతో నిర్మించిన ప్రభుత్వ ప్రాజెక్టు కాబట్టి ప్రజల ప్రయోజనాల కోసమే వినియోగించాలని పలువురు సూచిస్తున్నారు.

ఇదంతా ఒక ఎత్తయితే, ఇప్పుడు రాజకీయంగా రేవంత్ రెడ్డిని ఇరుకున పెట్టడంలో బీఆర్ఎస్ మెల్లగా పైచేయి సాధిస్తున్నట్లు కనిపిస్తోంది. మంత్రులు అవినీతిలో కూరుకుపోయారని కేటీఆర్, హరీశ్‌రావు రోజూ విమర్శలు చేస్తున్నారు. కమిషన్లు లేకుండా మంత్రులు కాలు బయట పెట్టడం లేదని ఆరోపిస్తున్నారు. ఈ ఎదురుదాడితో కాంగ్రెస్ ప్రభుత్వం ఓ రకంగా ఆత్మరక్షణలో పడిపోయిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. సింగరేణి తదితర అంశాల్లో కూడా ప్రభుత్వం ఇబ్బందికర పరిస్థితిని ఎదుర్కొంటోందని రాజకీయ వర్గాలు చర్చిస్తున్నాయి.

ఈ క్రమంలో వాదోపవాదాలు, విమర్శలు, ప్రతి విమర్శలతో రాజకీయాలు మరింత వేడెక్కుతున్నాయి. అవినీతి జరిగిందని ఆరోపించిన రేవంత్ రెడ్డి ఇప్పటి వరకు వాటిని నిరూపించలేదని ప్రత్యర్థులు విమర్శిస్తున్నారు. మరోవైపు కేటీఆర్, హరీశ్‌రావు గట్టిగానే ఎదురుదాడి చేస్తున్నారు. దీంతో రేవంత్ రెడ్డి కూడా అసహనానికి గురవుతున్నారనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

ఒకవేళ నిజంగానే గోదావరి జలాలను లిఫ్ట్ చేయడంలో సాంకేతిక ఇబ్బందులు ఉంటే, నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్ఏ) నివేదికపై అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి చర్చించాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. బారేజీలు, పంప్‌హౌస్‌ల వద్దకు రిటైర్డ్ ఇంజినీర్లను తీసుకెళ్లి, ఇరిగేషన్ అధికారుల ద్వారా వాస్తవ పరిస్థితులను ప్రజలకు వివరించి ఉంటే సందేహాలు నివృత్తి అయ్యేవని సూచిస్తున్నారు.

అయితే అలాంటి చర్యలు చేపట్టకపోవడంతో కాళేశ్వరం అంశం ఇప్పటికీ రాజకీయ దుమారానికే పరిమితమవుతోంది. అధికార, ప్రతిపక్షాల మధ్య పరస్పర ఆరోపణలు కొనసాగుతుండగా, ప్రాజెక్టు భవిష్యత్తుపై స్పష్టత లేకపోవడం చర్చనీయాంశంగా మారింది. ఇదే పరిస్థితి కొనసాగితే కాళేశ్వరం అంశం బీఆర్ఎస్‌కు రాజకీయంగా మరింత బలం చేకూర్చే అవకాశముందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ప్రస్తుతం రాష్ట్ర రాజకీయాల్లో కాళేశ్వరం ప్రధాన చర్చనీయాంశంగా మారింది. ఒకవైపు కాంగ్రెస్ ప్రభుత్వం గత ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకుని విమర్శలు కొనసాగిస్తుండగా, మరోవైపు బీఆర్ఎస్ ప్రభుత్వం వైఫల్యాలనే కాంగ్రెస్‌కు ఎదురుదాడి ఆయుధంగా మలుచుకుంటోంది. ఈ నేపథ్యంలో కాళేశ్వరం వివాదం రాజకీయంగా ఇంకా ఎన్ని మలుపులు తిరుగుతుందన్నది ఆసక్తికరంగా మారింది.

# జూలై 20న ఓరుగల్లులో జగన్నాథుడి రథయాత్ర



వరంగల్, నేటిధాత్రి:


ఓరుగల్లు మహానగరంలో జూలై 20న జగన్నాథుడి రథయాత్రను అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఇస్కాన్ టెంపుల్ వరంగల్ నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు నిర్వహించిన మీడియా సమావేశంలో మురళీవదన కృష్ణ దాస్ ప్రభు వివరాలు వెల్లడించారు.

మధ్యాహ్నం ఒంటి గంటకు పోలీస్ హెడ్‌క్వార్టర్స్ నుంచి ప్రారంభమయ్యే రథయాత్ర హనుమకొండ చౌరస్తా, ములుగు రోడ్డు, ఎంజీఎం జంక్షన్, పోచమ్మ మైదానం యూ-టర్న్ మీదుగా తిరిగి ఎంజీఎం జంక్షన్‌లోని వెంకటేశ్వర గార్డెన్ వరకు సాగనుంది. భజనలు, కీర్తనలు, ఆధ్యాత్మిక కార్యక్రమాల నడుమ రథయాత్ర నిర్వహించనున్నట్లు తెలిపారు.

వరంగల్ ట్రైసిటీ ప్రజలు, యువత, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని జగన్నాథుడి కృపకు పాత్రులై రథయాత్రను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. రథయాత్రలో పాల్గొనే భక్తులకు లడ్డూ ప్రసాదం పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. అలాగే రాత్రి వెంకటేశ్వర గార్డెన్‌లో జరిగే ముగింపు కార్యక్రమంలో భక్తి ప్రవచనాలు, అనంతరం అన్నప్రసాద వితరణ ఉంటుందని పేర్కొన్నారు.

గత 20 ఏళ్లుగా వరంగల్‌లో జగన్నాథుడి రథయాత్రను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నామని, ఇస్కాన్ దేవాలయంలో శ్రీకృష్ణ జన్మాష్టమి, ఏకాదశి తదితర పర్వదినాలను కూడా వైభవంగా నిర్వహిస్తున్నామని మురళీవదన కృష్ణ దాస్ ప్రభు తెలిపారు. ఈ మీడియా సమావేశంలో మురళీవదన కృష్ణ దాస్, భూపవన హరినామ దాస్, చిట్ట హరి గోపాల దాస్, కారుణ్యమయ కృష్ణ దాస్, విజయ్ రఘునాథ దాస్ తదితరులు పాల్గొన్నారు.

# కన్నం సౌందర్య భూములను ఎవరికి పట్టా చేయవద్దు



మల్లంపల్లి, నేటిధాత్రి:

మండలంలోని మహమ్మద్ గౌస్ పల్లి గ్రామానికి చెందిన నిరుపేద దళితురాలు కన్నం సౌందర్య పేరు మీద వివిధ గ్రామాలలో పట్టా భూములు ఉన్నాయని ఆమెకు గాని ఆమె కుటుంబీకుల గాని తెలియకుండా ఎవరికి ఈ భూములను పట్టా చేయవద్దని అని ప్రజా సంఘాల జేఏసీ హన్మకొండ జిల్లా చైర్మన్ మాదాసి సురేష్,ములుగు జిల్లా చైర్మన్ ముంజాల బిక్షపతి గౌడ్,ప్రముఖ న్యాయవాది అసైన్ భూమి సమితి అధ్యక్షుడు కలకోటి మహేందర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం డిప్యూటీ తహసిల్దార్ మమతకు బాధిత కుటుంబీకులతో కలిసి వినతిపత్రం సమర్పించారు.అనంతరం వారు మాట్లాడుతూ కన్నం సౌందర్య పేరు మీద మండలంలోని చాలా గ్రామాల్లో విలువైన భూములు ఉన్నప్పటికీ వారు ఆ భూములను ఎవరికి అమ్ముకోలేదని ఈ భూములను కాజేయాలని కుట్రతో కొందరు తప్పుడు పత్రాలు సృష్టించి సాదా బైనామా కింద దరఖాస్తులు చేసుకున్నట్లు తమ దృష్టికి వచ్చిందని అన్నారు.కావున ఆ దరఖాస్తులను తిరస్కరించి సదరు భూములను కన్నం సౌందర్య మరియు ఆమె కుటుంబీకుల మీద పట్టా చేసి,పట్టాదారు పాసుపుస్తకాలు జారి చేయాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో వివిధ ప్రజాసంఘాల మాదాసు జితేందర్,నల్లబెల్లి మేఘం తో పాటు బాధిత కుటుంబీకులు పాల్గొన్నారు.

**Printed, Published & owned by Katta Raghavender Rao,** Printed at S.V. Offset Printers, H. No. 4-6-65, S.T. Josephes High School,Kumarpalli Hanamkond, Warangal-01. Telangana State. & Published from, H.No.4-6-65, Opp. S.T. Josephes High School,kumarpalli, Hanamkonda, Warangal -506001. Telangana State.
**Editor : Katta Raghavender Rao, RNI No. APTEL / 2005/15537. E-mail :** netidhatrisv@gmail.com Cell : 9908658888, 8297779999